ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 13.07.2026 | సంపుటి : 12 సంచిక : 354 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# బడిపిల్లలను చూసి బస్సు ఆగదు.. ఆగినా బస్సులో సందేలేదు

రోజూ తెల్లవారుజామునే నిద్రలేచి, పుస్తకాల సంచీ భుజాన వేసుకుని బడికి బయలుదేరే పిల్లల కళ్లలో ఉండాల్సింది చదువుపై ఆసక్తి. కానీ నేడు చాలామంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కళ్లలో కనిపిస్తోంది రోడ్డుపై నిలబడి బస్సు కోసం ఎదురుచూసే నిస్సహాయత. కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు స్టాపుల్లో ఆగకుండా వెళ్లిపోతుండటంతో, బడి పిల్లలు బస్సు దొరికితేనే బడికి, లేకుంటే మళ్లీ ఇంటిబాటే పట్టాల్సిన దుస్థితి నెలకొంది.

## స్కూల్‌టైంలో ఫ్రీ స్పెషల్ బస్సులు కావాల్సిందే



## సర్కారు బడికి ప్రత్యేక బస్సు.. ఇదే నేటి తక్షణ అవసరం

**హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి, జూలై 12 (జనంసాక్షి):**

**సమస్య చిన్నదేమీ కాదు..**

ఉదయం 7:30 నుంచి 9:30 గంటల మధ్య మూడు గంటల్లో మూడు బస్సులు వచ్చినా, అవి జనంతో కిక్కిరిసి ఉంటున్నాయి. లోపల నిలబడేందుకు కూడా స్థలం లేని పరిస్థితుల్లో, యాభై మంది విద్యార్థుల్లో బస్సు ఎక్కగలిగిన కొందరే బడికి చేరుకుంటున్నారు. మిగిలిన వారు నిరాశతో ఇంటిబాట పడుతున్నారు. కొందరు విద్యార్థులైతే గంటలకొద్దీ రోడ్డుపై నిలబడి ఎదురుచూసి, చివరికి లిఫ్ట్ అడిగి ద్విచక్రవాహనాలపై పాఠశాలకు వెళ్తున్న దయనీయ పరిస్థితి కూడా కనిపిస్తోంది.

**ప్రైవేటుకూ, సర్కారుకూ నడుమ అంతరం**

ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏసీ బస్సులు, ప్రత్యేక వ్యాన్లు దర్జాగా ఇంటి ముందుకే వస్తాయి. కానీ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు సాధారణ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. ఆ బస్సులు కూడా సరిపడా అందుబాటులో లేకపోవడం, డ్రైవర్లు స్టాపుల్లో ఆపకుండా వెళ్లిపోవడం విద్యార్థుల చదువుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ఇది కేవలం రవాణా సమస్య కాదు, విద్యా హక్కుకు అడ్డంకి.

**నష్టం ఎవరిది? దేశానిదే..!**

ఒక్కరోజు క్లాసు మిస్ అయినా, సమయానికి బడికి చేరుకోలేకపోయినా, ఆ నష్టం కేవలం ఆ విద్యార్థికో, కుటుంబానికో పరిమితం కాదు. క్రమేణా ఇలాంటి విద్యార్థులు డ్రాపవుట్లుగా మారి, బాల కార్మికులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే అక్షరాస్యతలో ఇప్పటికే వెనుకబడి ఉన్న మనం, ముఖ్యంగా వెనుకబడిన తెలంగాణ ప్రాంతాల్లో ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలకు తీరని నష్టం వాటిల్లుతుంది.

**డిమాండ్ ఇదే..:** శాశ్వత పరిష్కారం అమల్లోకి వచ్చేవరకు, స్కూల్ సమయాల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక ఉచిత బస్సులను ఆర్టీసీ నడపాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ కనీసం ఒక ప్రత్యేక స్కూల్ బస్సు కేటాయించాలి. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో అదనపు ట్రిప్పులు నడపాలి. డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి. విద్యార్థులను చూసి బస్సు ఆపకుండా వెళ్లిపోకూడదు.



# వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి

- భారతీయుడి గల్లంతు
- తీవ్రంగా ఖండించిన భారత్

**టెహ్రాన్(జనంసాక్షి):** ఒమన్ తీరం వద్ద హర్మూజ్ జలసంధిలోవాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ చేసిన దాడిలో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. సైప్రస్ జెండాతో వెళ్తున్న ఈ నౌకలో మొత్తం 11 మంది భారతీయులు ఉండగా వారిలో 10 మందిని రక్షించారు. ఈ విషయాన్ని భారత దౌత్య కార్యాలయం ధ్రువీకరించింది." వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఒమన్ తీరంలో దాడిచేయడాన్ని మేము ఖండిస్తున్నాం. దీనిలో ఉన్న 11 మంది భారతీయుల్లో 10 మందిని రక్షించారు. ఒకరి జాడ గల్లంతైంది. ఒమన్‌లోని మా దౌత్య కార్యాలయం పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తోంది. గాలింపు చర్యల్లో ఒమన్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. ఒమన్ ప్రభుత్వం అందించిన సాయానికి ధన్యవాదాలు"

మిగతా 2లో..

# ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ!

**23న ఖమేనీ స్మారక సభకు హాజరు కానున్న ఇరాన్ సుప్రీం లీడర్ !**

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జులై 23న టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను మొజ్తబా నిర్వహించనున్నారని సమాచారం. సాయంత్రం5 నుంచి 7గంటల మధ్యలో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని కీలక నేతలందరూ పాల్గొంటారని వారు తెలిపారు.సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించట్లేదు. భద్రత దృష్ట్యా ఇటీవల నిర్వహించిన తండ్రి అంత్యక్రియలకు కూడా దూరంగా ఉన్నారు. రెండు వారాల కిందట

మిగతా 2లో..



ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొన్న ముసుగు ధరించిన వ్యక్తి..( వృత్తంలో)

# మళ్లీ హర్మూజ్‌ను మూసేసిన ఇరాన్

**హర్మూజ్ తీరంలోని పట్టణాలపై విరుచుకుపడ్డ అమెరికా**

**ఖతార్,కువైట్,బహ్రెయిన్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు**



**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. సైప్రస్ జెండాతో హర్మూజ్‌లో అనధికార మార్గంలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై తమ సైన్యం కాల్పులు జరి పిందని.. ఈ జలసంధిని మరోసారి మూసివేస్తునట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడి కారణంగా నౌకలోని ఒక సిబ్బంది మృతి చెందినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇరా న్ ఓ తప్పుడు నిర్ణయం తీసుకుందని.. దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చ రించారు. దీంతో టెహ్రాన్‌పై అమెరికా దాడులు కొనసాగించే అవకాశం ఉందని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హర్మూజ్ తీరంలోని రెండు పట్టణాలపై అమెరికా విరుచుకుపడంతో 10 చోట్ల భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ వెల్లడించింది. కాగా టెహ్రాన్‌పై మూడో విడత దాడులు పూర్తి చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మొత్తం 140 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

మిగతా 2లో..

## హర్మూజ్ తెరిచే ఉంది

- ఇరాన్ వాదన తప్పు:అమెరికా
- జలసంధిని ఆ దేశం నియంత్రించలేదు
- రాకపోకలు సాగుతున్నాయి వెల్లడి



**వాషింగ్టన్(జనంసాక్షి):** హర్మూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన వేళ అమెరికా మరోసారి స్పందిం చింది. అంతర్జాతీయ జలమార్గంలో చట్టబద్ధంగా ప్రయాణం కొన సాగించే నౌకల కోసం ఈ జల సంధి తెరిచే ఉందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్ బెదిరింపులు, ఏకపక్ష ప్రకటనలు

మిగతా 2లో..

2లో..

## ఖతార్ కీలక నిర్ణయం

- సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేత
- ఈ మేరకు వాణిజ్య నౌకల యాజమాన్యాలకు ఆదేశం
- ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

**చేతులు కాలాక..**

షాబాద్ ఆరు హత్యల కేసు..

# నిందితుడి కోసం 12 బృందాల వేట



**షాబాద్(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డు లతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీ లను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మిగతా 2లో..

**మూడో డిస్కం సేవలకు**

# గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థకు ఆమోదం
- లైసెన్స్ జారీచేసిన విద్యుత్ నియంత్రణ మండలి
- యథావిధిగానే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని కమిషన్ ఆదేశం
- ఆస్తులు, అప్పులు సంస్థకు బదిలీ
- ఎవరికీ నష్టం కలగకుండా తగిన ఏర్పాట్లు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థకు విద్యుత్ నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈఆర్?సీ ఆదేశాలతో రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలని, మోటర్లకు మీటర్లు బిగించవద్దు అని కమిషన్ ఆదేశించింది. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది.రాష్ట్రంలో మూడో డిస్కం ఆవిర్భవించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ రైతు విద్యుత్ పం పిణీ సంస్థకు విద్యుత్ నియంత్రణ మండలి లైసెన్స్‌ను జారీ చేసింది. తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థకు తెలంగాణ వి ద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేసింది. ఉగాది పర్వదినం అయిన మార్చ్ 19న టీజీఆర్‌పీడీ సీఎల్ లైసెన్స్ కోసం టీజీఆర్సీకి దరఖాస్తు చేసింది. ఈ లైసెన్స్ దరఖాస్తు పై మే 29న ఈఆర్?సీ బహిరంగ విచారణ నిర్వహిం చింది. బహరంగ విచారణలో ఈఆర్?సీ రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వినియోగదారుల సంస్థలు, విద్యుత్ రంగ నిపుణులు తమ అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి, అందిన అన్ని అభిప్రాయాలను అంశాల వారీగా పరిగణనలోకి తీసుకుని కమిష న్ తన ఉత్తర్వుల్లో సమాధానాలు ఇచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టు చేసిన ఈ కొత్త డిస్కం రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా 2లో..

# నీళ్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరించడం కుదరదు

- రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పిన తర్వాత కూడా సీఎంకు అవగాహన రాలేదు
- కరవు సమస్యను జఠిలం చేయొద్దు
- మీడియా సమావేశంలో హరీశ్ ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** మేడిగడ్డ ,సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నీటి విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. దమ్ముంటే నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికే ఆధారం అంటున్న ప్రభుత్వం దాని విశ్వాసనీయత ఏపాటిదో

మిగతా 2లో..



# 60 ఏళ్ల నెత్తుటి దాహం తీరలేదా?



**ఉద్యమంలో ప్రాణాలు బలితీసుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే..**

**ఆ పార్టీ నేతలపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటవా.. రక్త పిశాచీ అంటూ మండిపడ్డారు. ఇంకా తీరలేదా మీ రక్తదాహం 60 ఏండ్లు పీడించి తెలంగాణ నెత్తురు తాగారు కదా.. సరిపోలేదా? తెలంగాణ రక్తం రుచి మరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలి? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి ఎన్ కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన నరహంతకులు మీరు అంటూ కాంగ్రెస్

మిగతా 2లో..

# నీళ్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరించడం కుదరదు

తెలుసు కోవాలని హితావు పలికారు. 31 నెలలుగా ముఖ్యమంత్రిగా పని చేసినా రేవంత్ రెడ్డికి ఇంకా విషయం పరిజ్ఞానం పెరగలేదన్నారు. మొన్నటి వరకు నిపుణులుగా భావించిన ఇంజనీర్లే నేడు కిలేడి వాళ్లుగా కనిపిస్తున్నారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. రైతుల కోసం నీళ్లు అడిగితే సీఎం తమ రక్తం అడుగుతున్నారని అయినా సరే తమ రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తానంటే ఊరుకునేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ కటిక నొక్కమంటే విపక్షాల కంఠం నొక్కుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల మీద ఉన్న శ్రద్ధ రైతుల పంటల మీద లేదన్నారు. మేడిగడ్డ మీద సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అవాస్తవాలని విమర్శించారు. సీఎంగా 31 నెలలు పూర్తయినా, కాళేశ్వరంపై రేవంత్ రెడ్డికి అవగాహన రాలేదని ఎద్దేవా చేశారు. నీళ్లు ఎత్తిపోయవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెప్తున్నారన్న హరీశ్‌రావు మేడిగడ్డ వద్ద కాపర్ డ్యామ్ నిర్మించి నీళ్లు ఎత్తిపోయవచ్చని ఇంజినీర్లు చెప్పారని తెలిపారు. రూ.8.50 కోట్లతో కాపర్ డ్యామ్ నిర్మించి నీళ్లు ఎత్తిపోయవచ్చని, వాస్తవాలు మాట్లాడిన వారిని జైలులో పెడతానంటూ భయపెడుతున్నారని, ఎల్లంపల్లి ప్రాజెక్టు మీద హైదరాబాద్ సహా అనేక జిల్లాలు ఆధారపడ్డాయని పేర్కొన్నారు. ఎల్లంపల్లి మీద ఆధారపడి రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రం పని చేస్తోందని అన్నారు. రాజకీయాలకు పోయి కరవు సమస్యను జఠిలం చేయొద్దని సూచించారు.బీఆర్ఎస్ పదేళ్లలో కొత్తగా 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని, మహబూబ్‌నగర్ జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని తెలిపారు. కల్వకుర్తికి నీళ్లు తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నులు మాత్రమేనని, 2023 నాటికి ధాన్యం ఉత్పత్తి 2.60 లక్షల కోట్ల టన్నులకు పెరిగిందని వెల్లడించారు.రాజ్‌కుమార్‌కు, సీఎంకు మధ్య తేడా లేదు : సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. హిట్లర్ తనకు ఆదర్శమని ఇప్పటికే రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. చెప్పేందుకు విషయం లేకనే రేవంత్ రెడ్డి బూతులకు దిగారని, జారుడుబండపై ఉన్నందునే రేవంత్ రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారని అన్నారు. షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన రాజ్‌కుమార్‌కు, సీఎంకు మధ్య తేడా లేదని విమర్శించారు. షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డి ఇప్పటికీ స్పందించలేదని, ప్రశ్నించిన వాళ్ల రక్తం పారిస్తానని సీఎం అంటున్నారని ఆరోపించారు.

# 60 ఏళ్ల నెత్తుటి దాహం తీరలేదా?


నాయకులపై కేటీఆర్ మండిపడ్డారు. 1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపి రక్తం కళ్లజూసిన రాక్షసులు మీరు.. 1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు మీరు.. మలిదశ పోరాటంలో వేయిమందిని బలితీసుకున్న మృగాలు మీరు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిచినై..! కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటినై అని వ్యాఖ్యానించారు. నీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం..కానీ, నువ్వు రైతులకు నీళ్లు ఇవ్వు అని సూచించారు.పేగులు తెగేదాకా రాష్ట్రం కోసం కొట్లాడిన వాళ్లం.. రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన వాళ్లమని తెలిపారు. నెత్తురు ఇస్తేనే.. నీళ్లు ఇస్తాం అని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే మా నెత్తురు ధారపోస్తామని తెలిపారు. మీ రక్తదాహం తీర్చుకోని.. ఎండుతున్న పొలాల జలదాహం తీర్చండని సూచించారు.

### షాబాద్ ఆరు హత్యల కేసు..

# నిందితుడి కోసం 12 బృందాల వేట

తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

# మళ్లీ హర్మూజ్‌ను మూసేసిన ఇరాన్



షెహర్ ప్రావిన్స్‌పై జరిపిన దాడుల్లో ఒక సైనిక స్థావరంతో సహా పలు ప్రాంతాలు దెబ్బతిన్నట్లు సమాచారం. తాజా దాడులతో ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యా యని ప్రభుత్వ మీడియా వర్గాలు వెల్లడించాయి.

**కువైట్..బహ్రెయిన్‌లపై ప్రతీకార దాడులు..**

టెహ్రాన్‌పై దాడులకు ప్రతీకారంగా కువైట్ బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై డ్రోన్ దాడులు చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. కువైట్.. బహ్రెయిన్ లలోని యూఎస్ వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధ డిపో, రాడార్ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ దాడులతో బహ్రెయిన్ అంతటా సైరన్‌లు మోగుతున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దోహాలో భారీ పేలుళ్ల వినిపిస్తుండడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ప్రాంతీయ ఉద్రిక్తలల నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తున్నట్లు గల్ఫ్ దేశాలు ప్రకటించాయి. క్షిపణి ముప్పును ఎదుర్కోవడానికి తమ గగనతల రక్షణ వ్యవస్థలు చురుగ్గా ప్రతిస్పందిస్తున్నాయని యూఏఈ వెల్లడించింది.

**అమెరికా యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రంపైకి క్షిపణులు..**

ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై క్షిపణి దాడులు చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఆ స్థావరంలోని యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రం కమాండ్-అండ్-కంట్రోల్ వ్యవ స్థను పూర్తిగా ధ్వంసం చేసినట్లు పేర్కొంది. జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్ బేస్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపైనా క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఆ బేస్‌లోని కమాండ్-అండ్-కంట్రోల్ సెంటర్‌తో పాటు డ్రోన్‌లు ఉన్న హ్యాంగర్లను నాశనం చేశామంది. అయితే ఘటనలపై అమెరికా.. ఖతార్ అధికారుల నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

**దుఖ్మ్ ఓడరేవు లక్ష్యంగా దాడులు ..**

ఒమన్‌లోని దుఖ్మ్ ఓడరేవుపై ఇరాన్ భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో అమెరికా విమాన వాహక నౌకలు ఉపయోగించే లాజిస్టిక్స్ సహాయ కేంద్రాలు, ఇంధనం నింపే కేంద్రాలు ధ్వంసమయ్యాయి. అమెరికా బాంబు దాడులకు స్పందనగా ఒమన్‌పై మూడో దశ దాడులు ప్రారంభించినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. కాగా దుఖ్మ్ భారత్‌కు కీలకమైన ఓడరేవు. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు సరఫరా అవుతుంది.


**ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసింది: మహమ్మద్ ఘాలిబాఫ్**

ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. మాట నిలబెట్టుకోవాలని.. లేదంటే మూల్యం చెల్లించడానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇక అమెరికాతో ఒప్పందంలోని అయిదో పాయింట్‌ను ఫొటోను ఆయన తన ఎక్స్ పోస్టుకు జత చేశారు. ఖతార్ రాజధాని దోహాపై ఇవాళ ఉదయం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఖతార్ రక్షణ వ్యవస్థ పలు క్షిపణులను కూల్చివేసినట్లు తెలుస్తోంది.

# హర్మూజ్ తెరిచే ఉంది

చేస్తున్నప్పటికీ.. నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేందుకు వీలుగా అమెరికా బలగాలు మోహరించి, సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది.తమ బలగాల పర్యవేక్షణలో కాకుండా ఏ విదేశీ నౌకా జలసంధి నుంచి ప్రయాణించలేవని ఐఆర్‌జీసీ చేస్తున్న వాదన తప్పని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. హర్మూజ్‌ను ఇరాన్ నియంత్రించ లేదని, రాకపోకలు సాగుతున్నాయని స్పష్టం చేసింది. గత ఏడు రోజుల్లో 140కి పైగా నౌకలు ఇక్కడి నుంచి ప్రయాణాలు కొనసాగించాయని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై మాట్లాడుతూ హర్మూజ్ తెరిచే ఉందన్నారు.

# ఖతార్ కీలక నిర్ణయం



దోహ(జనంసాక్షి):

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని మరోసారి మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం, నౌకలపై దాడులు చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో గల్ఫ్ దేశం ఖతార్ కీలక నిర్ణయం తీసుకుంది. సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతోపాటు, చేపల బోట్లను కూడా నిలిపివేయాలని స్పష్టం చేసింది. ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి..

అని భారత విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై ఇరాన్ దాడి చేయడంతో భారీగా మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది ఆ నౌకను వదిలేసి ఒక చిన్న లైఫ్‌బోట్‌లో బయటపడ్డారు. నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనతో హర్మూజ్ జలసంధి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిపోయింది. ఇరాన్‌లోని మొత్తం 140 లక్ష్యాలపై అమెరికా దాడులు చేసింది.

# ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ!



తన సతీమణి అం త్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు ఫిబ్రవరి 28 నాటి దాడుల్లోప్రాణాలు కోల్పోయారు. ఆ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తబా చికిత్స తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. నాటి నుంచి ఇరాన్‌పై దాడులను సోషల్ మీడియా వేదికగా ఖండిస్తూ వస్తున్నారు. శనివారం సోషల్ మీడియా పోస్ట్‌లో.. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు.

**ఖమేనీ అంత్యక్రియల్లో ఆ ముసుగు మనిషి ఎవరు..?**

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో ఓ ముసుగు మనిషి పాల్గొనడం.. అతడికి ప్రాధాన్యం ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. బేస్‌బాల్ క్యాప్, ముఖానికి నల్లటి మాస్కు ధరించి ఉన్న ఆ వ్యక్తి ఫొటోలు వైరల్‌గా మారాయి. ఖమేనీ కుటంబంలోని పసిబిడ్డ మృతదేహాన్ని ఉంచిన బాక్సును కూడా ఆ వ్యక్తి మోశారు. ముసుగులో వచ్చిన వ్యక్తి బహుశా అలీ ఖమేనీ కుమారుడు, ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అయ్యుండవచ్చని జోరుగా ప్రచారం జరుగుతోంది. తండ్రి అంత్యక్రియలకు రహస్యంగా హాజరై ఉంటారని భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఇంటర్నేషనల్ పత్రిక మాత్రం అతడు అలీ ఖమేనీ పెద్ద మనవడు మహమ్మద్ జావెద్ ఖమేనీ అని చెబుతోంది. ఫిబ్రవరి 28న అమెరికా ఖమేనీ కాంపౌండ్‌పై చేసిన దాడిలో జావెద్ శరీరం తీవ్రంగా కాలిపోయిందని పేర్కొంది. ఇదే దాడిలో ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. అలీ ఖమేనీ పెద్ద కుమారుడు ముస్తఫా సంతానమే జావెద్. అయితే ఈ ప్రచారంపై ఇరాన్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.చాలా రోజుల తర్వాత ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందించారు. తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో ఓ సందేశాన్ని విడుదల చేశారు.

# '105 నియోజకవర్గాల్లో పార్టీ జెండా గురవేశాం..

### పేరు మార్చమంటే అన్యాయం'



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రక్షణ సేనకు గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆ పార్టీ కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ లేఖ రాశారు. పార్టీ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన వెయ్యి అభ్యంతరాలను తమకు పంపాలని కోరారు. అభ్యంతరాల కాపీలు ఇవ్వకుండా సమాధానం ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తొలుత కేటాయించిన పేరుతోనే 105 నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఎగురవేశామని.. ఇప్పుడు పేరు మార్చమంటే అన్యాయమన్నారు. తెలంగాణలో ఒకే రకమైన పేర్లతో పలు పార్టీలకు గుర్తింపు ఇచ్చారని.. రక్షణ సేనపైనే అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు. అభ్యంతరాలను పరిశీలించి, సమాధానం ఇచ్చేందుకు తగిన సమయం ఇచ్చాకే వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో మూడో డిస్కం సేవలకు గ్రీన్ సిగ్నల్



ఉన్న వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సంయుక్త రక్షిత తాగునీటి పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రత్యేక పంపిణీ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా విద్యుత్ పొందుతున్న మున్సిపల్ తాగునీటి కనెక్షన్లకు సేవలు అందిస్తుంది. ఈ ఉత్తర్వు తేదీ నుంచి నాలుగు నెలల తర్వాత టీజీఆర్?పీడీసీఎల్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమవ్వాలని కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్‌ను జారీ చేసిన తర్వాతే లైసెన్స్ అమల్లోకి వస్తుంది.

**ఆస్తులు, అప్పులు బదిలీ**

విద్యుత్ చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ దాఖలు చేసిన దరఖాస్తులను కూడా కమిషన్ ఆమోదించింది. టీజీఆర్‌పీడీసీఎల్ కార్యకలాపాలు ప్రారంభమైన తేదీ నుంచి బదిలీ అయ్యే వినియోగదారుల వర్గాలను ఈ రెండు డిస్కంల పరిధి నుంచి తొలగిస్తూ వాటి లైసెన్సులను సవరించింది. మిగతా వినియోగదారులకు సేవలు అందించే బాధ్యతలు, భౌగోళిక పరిధిలో ఎలాంటి మార్పు ఉండదు.మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేలా కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 131 ప్రకారం ట్రాన్స్ఫర్ స్కీమ్ జారీ చేసి సంబంధిత ఆస్తులు, అప్పులు, వినియోగదారులను టీజీఆర్‌పీడీసీఎల్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే 2027-28 టారిఫ్ ప్రతిపాదనలను ఈ ఏడాది నవంబర్ 30లోపు సమర్పించాలి. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.

**ఇతర డిస్కంల మాదిరిగానే**

రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. భవిష్యత్తులోనూ ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని ఈఆర్‌సీ స్పష్టం చేసింది. వ్యక్తిగత వ్యవసాయ పంప్సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా కమిషన్ ఉత్తర్వుల్లో నమోదు చేసింది. టీజీఆర్?పీడీసీఎల్ కూడా ఇతర డిస్కంల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగదారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పర్యవేక్షణలో పనిచేస్తుంది. మార్పిడి ప్రక్రియను కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే ప్రజాహిత దృష్ట్యా మరిన్ని ఆదేశాలు జారీ చేస్తుంది.



ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 29a కింద ... పార్టీ ...

# రష్యాకు ఉక్రెయిన్ మరో షాక్

### సిజ్రాన్ రిఫైనరీపై ఉక్రెయిన్ మెరుపుదాడి..!

**మాస్కో(జనంసాక్షి):**రష్యాకు ఉక్రెయిన్ మరో షాక్ ఇచ్చింది. సమర రీజియన్లోని సిజ్రాన్ చమురు శుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్లు మెరుపు దాడి చేశాయి. దీంతో ఆయిల్ రిఫైనరీకి భారీ నష్టం వాటిల్లింది. జులై 11-12 మధ్యలో ఈ దాడులు చోటు చేసుకొన్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడంచారు. ఈ రిఫైనరీ ఏటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు. ఇక్కడి నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళతాయి. వీటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు. గతంలో ఈ రిఫైనరీని లక్ష్యంగా చేసుకొని ఏప్రిల్ 18, మే 11వ తేదీల్లో ఉక్రెయిన్ దాడులు చేసింది. ఉక్రెయిన్ ఇక్కడితో ఆగకుండా అజోవ్ సముద్రంలో 10 ట్యాంకర్లు, నాలుగు ఫెర్రీలను కూడా ధ్వంసం చేసింది. అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకొంటూ ఈ ట్యాంకర్లు రష్యా చమురును విక్రయిస్తుంటాయి. ఇక ధ్వంసమైన ఫెర్రీలు రష్యా సేనలకు లాజిస్టిక్స్ అవసరాలు, కార్గో తరలింపునకు వినియోగిస్తున్నారు. జులై 11వ తేదీన భారీగా లూబ్రికెంట్ ఆయిల్ తరలిస్తున్న ఓ రైలును టోక్‌మాక్ వద్ద ఉక్రెయిన్ దళాలు ధ్వంసం చేశాయి. దీంతోపాటు పెద్ద ఎత్తున చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ రక్షణ దళాలు ప్రకటించుకొన్నాయి. ఇప్పటికే ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం 20%- 40% వరకు పడిపోయింది. ఇప్పటికే ఆ దేశంలో చమురు సంక్షోభం సెగ 5 కోట్ల మందిని తాకింది.

### రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు

# రికార్డు స్థాయికి

### జూన్‌లోనూ భారీగా కొనుగోలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు రికార్డు స్థాయికి చేరాయి జూన్‌లో రష్యా నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేసిన రెండో దేశంగా భారత్ నిలిచింది. మొత్తం 5.5 బిలియన్ యూరోల విలువైన రష్యా ఇంధనం, బొగ్గు భారత్ కొనుగోలు చేసినట్లు ఐరోపాకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎనర్జీ అండ్ క్లీన్ తన నివేదికలో వెల్లడించింది. మే నెలతో పోలిస్తే ఇది 34 శాతం అధికం.రష్యా నుంచి దిగుమతుల్లో 83 శాతం చమురు ఉండటం గమనార్హం. మరోవైపు, ప్రపంచ వ్యాప్తంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియాలు జూన్‌లో దాదాపు 814 మిలియన్ యూరోల విలువైన చమురును ఎగుమతి చేశాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ప్రధాన దిగుమతిదారులుగా ఉన్నాయి. రష్యా చమురు నుంచి తయారు చేసిన జెట్, డీజిల్ ఫ్యూయెల్ దిగుమతులకు బ్రిటన్ మినహాయింపు ఇవ్వడంతో జామ్‌నగర్ రిఫైనరీ నుంచి మొదటిసారి జెట్ ఫ్యూయెల్ కార్గో ఆ దేశానికి చేరింది.










# యాత్రికుల బస్సు బోల్తా..

### 16 మందికి గాయాలు

కాంగ్రా(జనంసాక్షి):

అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడడంతో 16మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్ లోని కాంగ్రా జిల్లాలో చోటుచేసుకుంది. ఘటన జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో
# నిరంతర కృషి

- పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం
- వరంగల్ తూర్పులో కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం
- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారం

**వరంగల్ బ్యూరో, జూలై 12 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని ఓ సిటీ క్లబ్ హౌస్ లోమంత్రి కొండా సురేఖ సమక్షంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతోకాలంగా కష్టపడ్డ మీసాల ప్రకాశ్‌కు ఈ పదవి దక్కడం ఆనందంగా ఉందని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఇస్తామని చెప్పారు. వరంగల్ తూర్పు నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి యువ నాయకుడు నవీన్ రాజ్ చేస్తున్న కృషిని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తూర్పు నియోజకవర్గ కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు కొండా మురళీధర్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసిస్తూ, త్వరలో నవీన్ రాజ్‌కు పార్టీ పదవితో సత్కరిస్తామని ప్రకటించారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, స్మశాన వాటికల ప్రహరీలు, అండర్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నేరుగా అధికారు లకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. కొండా మురళీధర్ రావు నాయకత్వంలో వరంగల్ తూర్పును ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దడంలో మీసాల ప్రకాశ్ కీలక పాత్ర పోషించాలని మంత్రి ఆకాంక్షిం చారు. నూతనంగా వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్గా ప్రమాణస్వీకారం చేసిన మీసాల ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయ సంస్థ ద్వారా గ్రంథలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం వరంగల్ నగరంలోని మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ శ్రేణులు శ్రేయోభి లాషులు మిత్రులు పెద్ద ఎత్తున మీసాల ప్రకాష్ ను శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ తోపాటు కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'షాబాద్' ఘటన నిందితునికి కఠిన శిక్షలు తప్పవు

- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి
- బాధితులకు పరామర్శ



**షాబాద్, జులై 12(జనం సాక్షి):** అభం శుభం తెలియని పిల్లలు, వృద్ధులను కిరాతకంగా హతమార్చడం దుర్మార్గమైన, హేయమైన ధని నిందితునికి కఠినమైన శిక్షలు తప్పవు అని ప్రభుత్వ చీఫ్ వీఫ్ అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో మైనర్ బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ...బాధిత కుటుంబంలోని మేఘునకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు.5 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు అంశం కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రకటిం చారని అన్నారు.బాధిత కుటుంబంలోని దివ్యాం గురాలు మేఘన చూసి చెలించి పోయారు. మేఘన కు వైద్యం, పునరావాసం కోసం కలెక్టర్ నారాయణ రెడ్డి, ను ప్రభుత్వం ఆదేశించిందన్నారు సీఐ, ఎస్ఐ లను సస్పెండ్ చేశారని వివరించారు. నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన భీం భరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, నాయకులు జడల రాజేందర్ గౌడ్, తమ్మలి రవిందర్, రామస్వామి, మాణిక్ రెడ్డి, అస్మత్ పాషా, ఉప సర్పంచ్ దండు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మన ధర్మమే మన దేశానికి రక్ష




- ఎంపీ ఈటెల రాజేందర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** లక్షల సంఖ్యలో సాదులుసంతులు ఈ దేశమే నా కుటుంబమని, నా పుట్టుకే మానవ కళ్యాణం కోసమని పనిచేస్తున్నారు కాబట్టే ఈకలియుగంలో కలికాలంలో ఈమాత్రమన్నా ప్రశాంతత ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఎల్బీనగర్ లోని సువర్ణ భారతి గోశాలలో ఏర్పాటు చేసిన భారత్ నేషనలిస్ట్ ఫోరం మూడవ వార్షికోత్సవ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భిన్న వైవిధ్యాలు ఉన్నా సుభిక్షంగా సురక్షితంగా కొనసాగుతున్న భారతదేశం మానవ కళ్యాణాన్ని కోరుకుంటుంది. అందుకే సర్వేజన సుఖినోభవంతు అనే నానుడి వచ్చిందన్నారు. మనతో సమానంగా ఉన్న చైనాలో ప్రజాస్వామ్యం లేదు. అనేక గల్ఫ్ దేశాలలో రాజరికమే తప్ప ప్రజాస్వామ్యం లేదన్నారు. ఏ సంస్కృతి ఉన్నా కలిసిమెలిసి జీవించే అవకాశాన్ని కల్పించింది భారతదేశం మాత్రమేనని తెలిపారు. ప్రపంచానికి సంస్కృతి సాంప్రదాయాలు సనాతన ధర్మాన్ని అందించింది కాబట్టి భారతదేశం విశ్వగురు అయిందని అమెరికాకు ఇంత పెద్ద చరిత్ర లేదన్నారు. ఇంత సంప్రదాయం ఉన్నా మన దేశంలో కనకూడని వినకూడని సమస్యలు వింటున్నప్పుడు మన ప్రాణం కొట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేసారు. సమాజమంటే సంపద ఒకటే కాదు మానసిక ప్రశాంతత ఉన్న దేశమే అత్యంత సంపన్నమైన దేశమని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం మన దేశంలోనే చూస్తున్నాం. పాశ్చాత్య ధోరణిలో కొట్టుకుపోతున్న యువతకు మన విలువలు నేర్పించకపోతే దేశంలో ప్రశాంతత ఉండదన్నారు. దేశాన్ని రక్షించే సత్తా ప్రభుత్వాలకు మాత్రమే ఉండదని అది మన ధర్మానికి మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ, హాజీబు శ్రీనివాసరావు, చౌడవరపు కరుణాకర్, కుండకూల యాదయ్య, బీఎన్ఎఫ్ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం సనాతన ధర్మానికి సంబంధించిన పలు పుస్తకాలను అయన ఆవిష్కరించారు.

# పటాన్‌చెరు గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా..

## వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..

- సిగాచి మృతులకు నమ్మకద్రోహం చేసిన ఘనత రేవంత్ రెడ్డి దే..
- ఎస్ఐఆర్ అంశంలో అప్రమత్తంగా ఉండండి
- ఎస్ఐఆర్, బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ అవగాహన సదస్సులో మాజీ మంత్రి హరీష్ రావు
- ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే జీఎంఆర్.. గులాబీ శ్రేణులు
- ఓఆర్ఆర్ జంక్షన్ నుండి జిఎంఆర్ కన్వెన్షన్ వరకు గులాబీమయం
- ప్రతి ఓటు హక్కును కాపాడుకుంటాం : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు జులై 12 (జనంసాక్షి) :** అర చేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని.. స్కామ్‌ల ప్రభుత్వం పోయి మళ్లీ సంక్షేమ పథకాల ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు విమర్శించారు. ఎస్ ఐ ఆర్ మరియు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు అంశాలపై పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముత్తంగి ఓఆర్ఆర్ జంక్షన్ నుండి పటాన్చెరు పట్టణం మీదుగా జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకు ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, గూడెం విక్రమ్ రెడ్డిల నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు వందలాది వాహనాలతో హరీష్ రావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి హరీష్ రావు మాట్లాడుతూ.. ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలు గడువు ఉన్నప్పటికీ.. పటాన్చెరు బిఆర్ఎస్ శ్రేణులు అందించిన స్వాగతం మరిచిపోలేదని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురవేసి యావత్తు తెలంగాణ మీ వైపు చూసేలా చేశారని కితాబునిచ్చారు. పటాన్చెరు అడ్డ బిఆర్ఎస్ గడ్డ అని ప్రశంసల వర్షం కురిపించారు.

కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రారంభించిన సర్ ప్రక్రియపై పార్టీ నాయకులు, ఆశావహులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ కారణంగా ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగి ఎన్నికల ఫలితాలు మారాయని ఆరోపించారు. జి హెచ్ ఎం సి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు సర్‌ను సీరియస్‌గా తీసుకోవాలని, బిఎల్ఏ లను చురుకుగా పనిచేయించాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.30 వేల కోట్ల విలువైన భూములను విక్రయించిందని ఆరోపించిన ఆయన, బిఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా.. అందాల పోటీలు, బోధి భవన్ వంటి కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మూసీ సుందరీకరణ, ఇతర కార్యక్రమాలకు నిధులు ఉన్నా పేదల సంక్షేమానికి నిధులు లేవని ఆరోపించారు. సిగాచి ప్రమాదంలో 54 మంది మృతి చెందినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం చేయలేదని, కంపెనీ యాజమాన్యమే పరిహారం చెల్లించిందని విమర్శించారు.

కేసీఆర్ హయాంలో పటాన్చెరు పట్టణంలో 200 కోట్ల రూపాయలతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడం చేతకాని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని విమర్శించారు. పటాన్‌చెరులో ఐటి పార్క్ కోసం కేటాయించిన భూమిని ప్రభుత్వం విక్రయించిందని ఆరోపించారు.రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ గెలుస్తుందని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. సీట్ల సంఖ్య పెరిగినా వాటిని కూడా బిఆర్ఎస్ పార్టీ గెలుచుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ 117 సీట్లు గెలుస్తామని చెబుతున్నప్పటికీ, తొమ్మిది సీట్లకు మించి గెలవలేదని ఎద్దేవా చేశారు. అనంతరం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ అంశంపై బూత్ లెవెల్ స్థాయి నుండి కార్యకర్తలను అప్రమత్తం చేయడంతో పాటు.. అవగాహన సదస్సులు నిర్వహిస్తూ.. ప్రతి ఓటును కాపాడుకుంటున్నామని తెలిపారు. త్వరలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ అంశంలోనూ.. రెండు లక్షల సభ్యత్వం నమోదు చేసి కెసిఆర్ కు బహుమతిగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ మాజీ చైర్మన్ బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గండం గడిచేదెలా?
# ముంచుకొస్తున్న కరువు..!!

- కానరాని నైరుతి వర్షాల కోసం రైతన్న ఎదురు చూపులు
- ఖరీఫ్ పంటలపై కరువు మబ్బులు
- వ్యవసాయానికి పెనుముప్పు ఖరీఫ్ ఖతమేనా?



**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 12 (జనం సాక్షి):** రైతుకు ఉండే ఒకానొక దిక్కు వ్యవసాయం.. వర్షం కురవక ఆ దిక్కు కూడా లేకుండా పోతుంది. రైతన్నల సాగుబడి దినదిన గండంగా తయారయింది. జులై మాసం వచ్చేసింది. రైతన్నల గుండెల్లో దడ పుట్టింది. భారతదేశ వాతావరణ శాఖ హెచ్చరించిన ప్రకారం జులై మాసంలో ఎల్ నీ నో తీవ్ర రూపం దాల్చనుంది. అందుకు సంకేతంగా జూన్ మాసంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసాయి. ఎల్ ని నో ప్రభావం వల్ల వికారాబాద్ జిల్లాలో సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఇప్పటివరకు ఎల్ ని నో వల్ల ఒకచోట ఎక్కువ ఒకచోట తక్కువ వర్షం కురిసింది. అనధికార అంచనా ప్రకారం ఇప్పటివరకు జిల్లాలో 30 శాతం మంది రైతులు తమ పొలాల్లో పంటలు వేయలేదు. కొద్ది చోట రైతులు పంటలు వేసిన నైరుతి పవనాల వల్ల సరైన వర్షం కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ప్రత్యమ్మయ పంటలు వేయాలని అధికారులు సూచిస్తున్న ఆ పంటలకు సరిపోను వర్షం జిల్లాలో కురవలేదు. దీంతో వికారాబాద్ జిల్లాలో కరువు ముంచుకొచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు సకాలంలో కురువని కారణంగా బావులు చెరువులు ప్రాజెక్టులలో నీటిమట్టం పెరగలేదు. దీని కారణంగా తడి పంట సాగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగు తీవ్ర నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. పసిఫిక్ మహాసముద్రంలో పుట్టే నైరుతి రుతుపవనాల గమ్యాన్ని ఎల్ ని నో మార్చి వేసింది. దీని ప్రభావం వలన జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆదివారం నాటికి జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీని కారణంగా మొలకెత్తిన పంటలు ఎండిపోతున్నాయి. వానల జాడ లేని కారణంగా తాగు సాగు నీటి కొరత అధికంగా ఉండే అవకాశం ఉంది. జూలై మాసంలో ఎల్ ని నో ప్రభావం అధికంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో వర్షాలు రాక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వర్షాధారిత పంటలు రైతులు అధికంగా వేస్తారు. వారి ఆర్థిక పరిస్థితికి వెన్నుముక్కల వర్షం ఉపయోగపడుతుంది. కానీ దీని జాడ లేక తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి ఆర్థిక సంక్షోభం నుంచి ఎలా గొట్టెక్కాలా అనే ఆలోచనతో రైతన్న దిగులు చెందుతున్నాడు. ఏడాది పాటు కరువు వస్తే మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసుకోలేని పరిస్థితి వస్తుంది. విద్యుత్ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉంటుంది. అటు పంటలు పండక ఇటు పెరిగిన ధరలకు తగ్గట్టుగా ఆర్థిక వనరులు లేకపోవడంతో భవిష్యత్తును ఊహించుకొని ఈ ఏడాది తమకు ఊరేనా అన్నట్లు రైతులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. అప్పుడు ఇప్పుడు పడిన వర్షానికి కొన్ని పంటలు మొలకెత్తిన వాటిని సంరక్షించుకోవడానికి రైతన్నలకు ఎరువుల సంక్షోభం ఏర్పడింది. సకాలంలో రైతన్నలకు ఎరువులు అందక మొన్నటి వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితులు ఇప్పుడు ఇట్లా ఉంటే మున్ముందు వచ్చే మాసాల్లో ఎల్ ని నో ప్రభావం వలన ఎలాంటి ముప్పు ఉందోనని ఆందోళన చెందుతున్నారు. అప్పటివరకు పరిస్థితులు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే..



## 96,81,855 మంది చిన్నారులకు ఆల్బండజోల్ ట్యాబ్లెట్స్

- సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమం
- రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించనున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పిల్లల్లో నులిపురుగుల (నట్టలు) సమస్యను నివారించేందుకు, సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అల్బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయడానికి ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. విద్యాశాఖ, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు వేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకే రోజు(జూలై 13, సోమవారం) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జూలై 13న ఏ కారణంతోనైనా మాత్ర వేయించుకోలేకపోయిన పిల్లలకు జూలై 20న మాప్-అప్ కార్యక్రమం ద్వారా తప్పనిసరిగా మాత్ర వేయాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

1 నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఆల్బండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని మంత్రి వివరించారు. ఈ సమస్యల కారణంగా చదువుపై పిల్లల శ్రద్ధ తగ్గిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. నులిపురుగులు బయటకు కనిపించకపోయినా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా ఆల్బండజోల్ వేయించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం నాడు ఆల్బండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ఈ సమాచారాన్ని పిల్లల తల్లిదండ్రులందరికీ షేర్ చేయాలని మంత్రి ప్రజలను కోరారు.

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మాత్రలు వేయడంతోనే ముగిసిపోదని మంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన తాగునీరు ఉపయోగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం వంటి మంచి అలవాట్లపై కూడా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు.

అల్బెండాజోల్ మాత్రల ద్వారా నులిపురుగులను సమర్థవంతంగా నివారించవచ్చని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. ఈ మాత్ర వల్ల నులి పురుగుల సమస్య తొలగిపోయి పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని, తిన్న ఆహారంలోని పోషకాలు శరీరానికి బాగా అందుతాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతాయని ఆమె వివరించారు. ఆల్బండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని సంగీత వెల్లడించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలను ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ సహాయకులు గుర్తించి సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకొచ్చి మాత్ర వేయిస్తారని తెలిపారు. ట్యాబ్లెట్లను ఇంటి వద్దకు తీసుకెళ్లవద్దని, నిపుణుల పర్యవేక్షణలోనే పిల్లలు ఈ ట్యాబ్లెట్ వేసుకోవాల్సి ఉంటుందని తల్లిందండ్రులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ట్యాబ్లెట్ వేయించడానికి ముందు పిల్లలకు తప్పనిసరిగా ఆహారం తినిపించాలని, ఖాళీ కడుపుతో ట్యాబ్లెట్ వేయించొద్దన్నారు.



## సబ్ స్టేషన్ ఆపరేటర్
# ఆత్మహత్య

**నల్లబెల్లి, జూలై 12 (జనంసాక్షి):** సబ్ స్టేషన్ ఆపరేటర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన చీకటి విక్రమ్ (32) నెక్కొండ మండలం పత్తిపాక సబ్ స్టేషన్ లో గత నాలుగు సంవత్సరాలుగా ఆపరేటర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. డ్యూటీలో పని ఒత్తిడి, ఉద్యోగం పర్మినెంట్ అయితలేదనే కారణంగా మనస్థాపానికి గురై ఆదివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చీకటి సునంద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
13 జూలై 2026

# అధికార దాహంలో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు

సంపాదకీయం

130వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదన, నిజానికి ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలనే ప్రశ్నార్థకం చేస్తోంది. ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయితే వారిని ఆటోమేటిక్‌గా పదవుల నుంచి తొలగించాలన్న ఈ ప్రతిపాదన, మొదటి చూపుకు "అవినీతిపై కఠిన చర్య"గా కనిపించొచ్చు. కానీ లోతుగా పరిశీలిస్తే, ఇది అధికార పార్టీ చేతిలో ప్రతిపక్షాలను దెబ్బతీసే ఆయుధంగా మారే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

మన న్యాయ వ్యవస్థలో "దోషిగా రుజువయ్యే వరకు నిర్దోషి" అనే మౌలిక సూత్రం ఉంది. కేవలం అరెస్టు అయినంత మాత్రాన ఒక వ్యక్తి నేరస్థుడు కాదు. కేసులు దర్యాప్తు దశలో ఉన్నప్పుడే, న్యాయస్థానం తీర్పు ఇవ్వకముందే, ఎన్నికైన ప్రజాప్రతినిధిని పదవి నుంచి తొలగించడం అంటే – దర్యాప్తు సంస్థలకు, పరోక్షంగా వాటిని నియంత్రించే కేంద్ర ప్రభుత్వానికి అనధికారికంగా అపారమైన అధికారం కట్టబెట్టడమే. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో గత కొన్నేళ్లుగా యావత్ దేశం చూస్తూనే ఉంది. ప్రతిపక్ష నేతలపైనే అత్యధిక కేసులు, అధికార పార్టీలో చేరిన వెంటనే కేసులు మాయం కావడం వంటి ఉదాహరణలు కళ్లముందు కనిపిస్తున్నప్పుడు, ఈ బిల్లు దుర్వినియోగానికి గురికాదని ఎవరు హామీ ఇవ్వగలరు?

జైలుకెళ్లిన నేతలను ఉదాహరణగా చూపుతూ ఈ సవరణను సమర్థించుకోవచ్చు. కానీ నిర్దోషిగా విడుదలైతే, లేదా నిర్ణీత గడువులో ప్రాసిక్యూషన్ కేసును ముందుకు తీసుకెళ్లడంలో విఫలమైతే ఏమిటి? అప్పటికే పదవి కోల్పోయిన నేతకు, ప్రజలు ఇచ్చిన తీర్పుకు జరిగిన అన్యాయాన్ని ఎవరు తిరిగి ఇవ్వగలరు? ఎన్నికల ద్వారా ప్రజలు అప్పగించిన బాధ్యతను, దర్యాప్తు సంస్థ ఒక్క ఎఫ్ఐఆర్‌తో లాగేసుకునే అవకాశం కల్పించడం ఫెడరల్ స్ఫూర్తికే విరుద్ధం. ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను గురిపెట్టేందుకు ఇది సులువైన మార్గంగా మారే అవకాశం ఉంది.

జేపీసీలో సభ్యులైన అసదుద్దీన్ ఒవైసీ, సుప్రియా సూలే వంటి ప్రతిపక్ష నేతలు ఈ సిఫార్సులను వ్యతిరేకిస్తూ ప్రత్యేక నోట్ సమర్పించాలని నిర్ణయించడం ఆషామాషీ విషయం కాదు. ఇది కేవలం రాజకీయ వ్యతిరేకత కాదు – రాజ్యాంగ మౌలిక సూత్రాలపై ఆందోళన. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, ఐదేళ్లకు మించిన శిక్షల విషయంలో ప్రత్యేక నిబంధనలు వంటివి పైపైన బాగానే కనిపించొచ్చు. కానీ మౌలిక ప్రశ్న ఏమిటంటే – విచారణ పూర్తికాకుండానే, ఒక్క అరెస్టుతోనే ఎన్నికైన ప్రభుత్వాధినేతను తొలగించే అధికారం రాజ్యాంగబద్ధమేనా అన్నదే.

అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఇలాంటి బిల్లులను హడావిడిగా తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యవస్థలను తలకిందులు చేయడమే. ఈరోజు ప్రతిపక్షాలపై ప్రయోగించే ఈ అస్త్రం, రేపు అధికార మార్పిడి జరిగినప్పుడు నేటి పాలకులపైనే ప్రయోగించబడే అవకాశం ఉంది. చరిత్రలో అధికార దుర్వినియోగం ఎప్పుడూ శాశ్వతంగా నిలవలేదు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార పక్షానికే కాదు, యావత్ పార్లమెంటుకూ ఉంది. సంఖ్యాబలం ఉందని ఏకపక్షంగా ఇలాంటి కీలక సవరణలను ముందుకు తీసుకెళ్లడం మానుకోవాలి. విస్తృత చర్చ, అన్ని పక్షాల ఏకాభిప్రాయంతోనే ఇలాంటి రాజ్యాంగ మార్పులు జరగాలి – అప్పుడే అవి దేశ ప్రజాస్వామ్యానికి మేలు చేస్తాయి, కాకపోతే భవిష్యత్తులో ప్రతీకార రాజకీయాలకు నాంది పలుకుతాయి.

# మార్కుల కంటే న్యాయం ముఖ్యం

## పారదర్శక మూల్యాంకనం వైపు అడుగులు




విద్యా వ్యవస్థ అంతిమ లక్ష్యం కేవలం పుస్తకాల్లోని సమాచారాన్ని విద్యార్థుల తలల్లోకి ఎక్కించడం కాదు. వారిలో సృజనాత్మకతను, విమర్శనాత్మక ఆలోచనా ధోరణిని, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించడం. కానీ దురదృష్టవశాత్తూ, నేటి ఆధునిక విద్యా ప్రపంచం ఈ ఉన్నత ఆశయాలకు ఆమడ దూరంలో నిలిచింది. ఇవాళ చదువు అంటే కేవలం మార్కుల వేటగా, ర్యాంకుల పోటీగా మారిపోయింది. ప్రతి సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడినప్పుడు సమాజంలో ఒక రకమైన ఆందోళనకర వాతావరణం కనిపిస్తుంది. అనుకున్న మార్కులు రాలేదనే తీవ్ర మనస్తాపంతో కొందరు పసిమొగ్గలు ఆత్మహత్యల వంటి దారుణ నిర్ణయాలు తీసుకుంటుంటే, మరికొందరు బోర్డుల నిర్లక్ష్యం వల్ల, మూల్యాంకనంలో జరిగిన ఘోర తప్పిదాల వల్ల తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారు. ఈ దారుణ పరిస్థితుల నేపథ్యంలోనే మార్కుల కంటే న్యాయం ముఖ్యం అనే నినాదం ఇవాళ ప్రతి ఒక్కరూ లోతుగా చర్చించాల్సిన అత్యంత కీలకమైన అంశంగా మారింది. మన విద్యా బోర్డుల పనితీరును గమనిస్తే, ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థుల జవాబు పత్రాలను అత్యంత తక్కువ వ్యవధిలో మూల్యాంకనం చేయాల్సి వస్తుంది. దీనివల్ల పరీక్షా పత్రాలు దిద్దే ఉపాధ్యాయులపై (ఎవాల్యుయేటర్లు) విపరీతమైన మానసిక ఒత్తిడి పెరుగుతోంది. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు నిర్దేశిత సంఖ్య కంటే ఎక్కువ పేపర్లు దిద్దాల్సి రావడం వల్ల, వారు ప్రతి జవాబును క్షుణ్ణంగా పరిశీలించే సమయం కోల్పోతున్నారు. ఫలితంగా, విద్యార్థి సరైన సమాధానం రాసినప్పటికీ తక్కువ మార్కులు పడటం, మార్కుల కూడికలలో (టోటలింగ్) దొర్లే పొరపాట్లు, కొన్నిసార్లు ఓఎంఆర్ షీట్ల గుర్తింపులో సాంకేతిక లోపాలు వంటి అనేక విస్తుపోయే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ తప్పిదాలను సరిదిద్దుకోవడానికి విద్యార్థులు ఆశ్రయించే రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్ ప్రక్రియలు కూడా వారికి శ్రమతో కూడుకున్నవిగా మారాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు భారం కలిగించే విధంగా బోర్డులు పెద్ద మొత్తంలో రుసుములను వసూలు చేస్తున్నాయి. అంతటితో ఆగకుండా, ఈ పునఃసమీక్ష ఫలితాలు వెల్లడించడానికి నెలల తరబడి సమయం తీసుకుంటున్నారు. ఈ లోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఉన్నత కళాశాలల్లో ప్రవేశాలు ముగిసిపోవడం, జాతీయ స్థాయి పోటీ పరీక్షల కౌన్సిలింగ్ సమయం దాటిపోవడం వల్ల విద్యార్థులు తమ జీవితకాల అవకాశాలను కోల్పోతున్నారు. ఇది కేవలం ఒక చిన్న పరిపాలనా లోపమో, సాంకేతిక పొరపాటో కాదు. ఇది ఒక విద్యార్థి ప్రాథమిక హక్కును కాలరాయడమే, చట్టబద్ధమైన న్యాయ సమస్యే. ప్రస్తుత పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో కనిపిస్తున్న అతిపెద్ద లోపం పారదర్శకత లేకపోవడం. ఒక విద్యార్థి తాను ఎంతో కష్టపడి రాసిన పరీక్షకు మార్కులు ఎలా తగ్గాయో, ఏ సమాధానానికి ఎన్ని మార్కులు వేశారో తెలుసుకునే కనీస అవకాశం కూడా నేడు లభించడం లేదు. కొన్ని రాష్ట్రాల విద్యా బోర్డులు సమాచార హక్కు చట్టం కింద జవాబు పత్రాల నకళ్లను (ఫోటోకాపీలు) ఇవ్వడానికి సైతం రకరకాల సాకులు చెపుతూ నిరాకరిస్తున్నాయి. అలాగే రీ-ఎవాల్యుయేషన్ తర్వాత మార్కులలో మార్పులు ఉంటే దానికి గల స్పష్టమైన వివరణను విద్యార్థులకు అందించడం లేదు. ఈ విధమైన రహస్య విధానాలు విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో తీవ్రమైన అపనమ్మకాన్ని, అసంతృప్తిని పెంచుతున్నాయి. ప్రజాస్వామ్య సమాజంలో ఏ నిర్ణయమైనా సహేతుకమైన వివరణతో కూడి ఉండాలనేది న్యాయ సూత్రం. అదే సూత్రం విద్యా రంగంలో కూడా కచ్చితంగా వర్తించాలి. విద్యార్థులను కేవలం పరీక్షలు రాసే యంత్రాలుగా చూడటం మానేసి, వారికి కొన్ని ప్రాథమిక హక్కులు ఉంటాయనే నిజాన్ని వ్యవస్థ గుర్తించాలి. ముఖ్యంగా కింది నాలుగు హక్కులను చట్టబద్ధం చేయాల్సిన అవసరం ఉంది. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికి తన ఒరిజినల్ జవాబు పత్రం యొక్క స్కాన్ చేసిన కాపీని ఉచితంగా లేదా నామమాత్రపు రుసుముతో ఆన్‌లైన్ ద్వారా పొందే హక్కు ఉండాలి. రీ-వెరిఫికేషన్ లేదా రీ-ఎవాల్యుయేషన్ దరఖాస్తు చేసుకున్న తేదీ నుండి గరిష్టంగా రెండు వారాల లోపు ఫలితాలను ప్రకటించాలి. జాప్యం జరిగితే దానికి అధికారులను జవాబుదారీ చేయాలి. బోర్డు లేదా అధికారుల నిర్లక్ష్యం వల్ల మూల్యాంకనంలో తప్పులు జరిగి, దానివల్ల విద్యార్థి మంచి కాలేజీ సీటును లేదా స్కాలర్‌షిప్‌ను కోల్పోతే, సదరు బోర్డు విద్యార్థికి తగిన ఆర్థిక, విద్యాసంబంధిత పరిహారం చెల్లించాలి. కేవలం పరీక్షల సమయంలోనే కాకుండా, ఫలితాలు వచ్చిన తర్వాత తీవ్ర ఒత్తిడికి లోనయ్యే విద్యార్థుల కోసం ప్రతి విద్యాసంస్థలో అర్హులైన కౌన్సెలర్లను అందుబాటులో ఉంచాలి. వ్యవస్థలోని లోపాలను వేలెత్తి చూపడమే కాకుండా, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడం కూడా అంతే ముఖ్యం. సాంకేతికతను సమర్థవంతంగా వాడుకోవడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. జవాబు పత్రాలను పూర్తిగా స్కాన్ చేసి డిజిటల్ రూపంలోకి మార్చాలి. ఒకే పత్రాన్ని ఇద్దరు వేర్వేరు ఉపాధ్యాయుల చేత స్వతంత్రంగా మూల్యాంకనం చేయించి , వారిద్దరి మార్కులలో వ్యత్యాసం ఎక్కువగా ఉంటే మూడో సీనియర్ ఉపాధ్యాయుడికి పంపే విధానం తీసుకురావాలి. ఇది మానవ తప్పిదాలను, పక్షపాతాలను పూర్తిగా నివారిస్తుంది. అలాగే మార్కుల కూడికను సాఫ్ట్‌వేర్ల ద్వారా ఆటోమేటిక్ చేయడం వల్ల టోటలింగ్ తప్పులు దొర్లే అవకాశమే ఉండదు. అన్నింటికంటే ముఖ్యంగా, పేపర్లు దిద్దే ఉపాధ్యాయులకు తగినంత సమయం ఇవ్వాలి, వారి పని భారాన్ని తగ్గించాలి మరియు వారి శ్రమకు తగిన గౌరవప్రదమైన వేతనాన్ని అందించాలి. అప్పుడే వారు పూర్తి బాధ్యతతో, ఏకాగ్రతతో మూల్యాంకనం చేయగలుగుతారు. గ్రేడింగ్ విధానాన్ని మరింత శాస్త్రీయంగా విస్తృతం చేయడం ద్వారా ఒక్క మార్కు తేడాతో విద్యార్థి జీవితం మారిపోయే తీవ్ర ఒత్తిడిని తగ్గించవచ్చు. విద్యార్థి యొక్క మేధస్సును, సృజనాత్మకతను కేవలం మూడు గంటల పాటు జరిగే ఒకే ఒక్క రాత పరీక్ష ఆధారంగా అంచనా వేయడం ఏమాత్రం శాస్త్రీయం కాదు. ఆ రోజు విద్యార్థి ఆరోగ్యం బాలేకపోయినా లేదా మానసిక ఆందోళనకు గురైనా అతని విద్యా సామర్థ్యం మొత్తం దెబ్బతింటుంది. అందుకే విద్యా రంగంలో నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని నిజాయితీగా అమలు చేయాలి. విద్యార్థి ఏడాది పొడవునా ప్రదర్శించిన ప్రతిభ, ప్రాజెక్టు పనులు, ప్రయోగాత్మక నైపుణ్యాలు , తరగతి గదిలో భాగస్వామ్యం మరియు క్రీడలు, కళల వంటి పాఠ్యేతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని అంతిమ ఫలితాలను ఖరారు చేయాలి. దీనివల్ల విద్యార్థులపై పరీక్షల భయం మరియు వార్షిక పరీక్షల ఒత్తిడి గణనీయంగా తగ్గుతాయి. ఇది విద్యార్థుల నిజమైన, బహుముఖ ప్రజ్ఞను ప్రతిబింబించే న్యాయబద్ధమైన అంచనాకు దారి తీస్తుంది.

విద్య అనేది కేవలం ర్యాంకుల కోసం జరిగే పరుగు పందెం కాదు, అది ఒక సంపూర్ణ మానవుడిని తీర్చిదిద్దే పవిత్రమైన ప్రక్రియ. మార్కులు అనేవి కేవలం విద్యార్థి ప్రయాణంలో ఒక చిన్న మైలురాయి మాత్రమే, అవి ఏనాటికీ ఒక మనిషి జీవిత విలువను లేదా సామర్థ్యాన్ని నిర్ణయించలేవు. మన పరీక్షా విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు విద్యార్థుల పట్ల మానవతా దృక్పథం లోపించినంత కాలం, మనం ఎంతటి అధునాతన విద్యా విధానాన్ని తెచ్చినా ప్రయోజనం శూన్యం. ప్రభుత్వాలు, విద్యా రంగానికి చెందిన బోర్డులు, పాఠశాల యాజమాన్యాలు మరియు ఉపాధ్యాయులు అందరూ ఒకే తాటిపైకి వచ్చి, మార్కుల కంటే న్యాయం, విద్యార్థి భవిష్యత్తే ముఖ్యం అనే సూత్రాన్ని కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో చూపించాలి. ప్రతి విద్యార్థి తాను పడిన కష్టానికి తగిన, న్యాయమైన, పారదర్శకమైన గుర్తింపును పొందేలా చేయడమే మన విద్యా వ్యవస్థ యొక్క ప్రథమ కర్తవ్యం కావాలి. అప్పుడే నిజమైన విద్యా సంస్కరణలు సాధ్యమవుతాయి, రేపటి తరం సురక్షితంగా ఎదుగుతుంది.

డా . సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## ఫలిస్తున్న కల!

ముఖంనుండి
భుజాలనుండి
తొడలనుండి
పాదాలనుండి
పుట్టుట సాధ్యమా?
సాధ్యంకాదని
ఇప్పటికైనా
గ్రహించి
ప్రశ్నిస్తారా?
తరతరాలుగా
అలవాటైపోయి
అదేనిజమని
నమ్ముతారా?
మనువాదుల
నీచబుద్ధులు
శోచనీయం!
ఇంకా నమ్మిస్తారు!
ప్రశ్న అనేది
రాకూడదనే
చదువులకు
దూరంచేశారు!
ఎన్నాళ్లుచేస్తారు?
ఏదోఒకరోజు
అబద్ధం
బ్రద్దలు కావాల్సిందే!
ఎప్పటికీ కాదని
'వాళ్లు' అనుకుంటే
ఆదివాళ్ళ
బుద్ధిజాడ్యం!
వాళ్ల అబద్ధాలు
బ్రద్దలయ్యే
వైజ్ఞానిక ప్రపంచంలో
మనం ప్రవేశించాం!
స్వాతంత్ర్యం
సమభావం
సౌభ్రాత్రం
నేటిసమాజం!
నెహ్రూ లాంటి
సైంటిఫిక్
ప్రధాని మన
అదృష్టం!
నష్టపోయిన
అల్పవర్గాలు
ఆయనవల్లే
ఎదిగారు!
ఎదిగి -వాళ్లు
ప్రశ్నించటం చూసి
నేటి మనువులు
కుళ్ళి చస్తున్నారు!
అందుకేమళ్ళీవెనక్కి
తీసుకుపోవాలని
వాళ్లుచేస్తున్న
అసాధ్య ప్రయత్నం!
పుస్తకాలనిండా
అశాస్త్రీయత!
విద్యార్థుల్లో
అహేతుకత!
ఎన్నిచేసినా
సాధ్యంకాదు!
నిజానిదే
తుదివిజయం!
మతగ్రంథాలనుండి
చీకటిని తరిమి




వైజ్ఞానిక వెలుగులు
నింపుదాం!
నోరువిప్పండి
అందరం ప్రశ్నిద్దాం!
మనుస్మృతిని
మళ్ళీ తగలెడదాం!
జై భీమ్!
జై అంబేద్కర్!
నీకలలు ఫలించే
రోజులొచ్చాయి !

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# నిరుద్యోగులు లక్షల్లో... నియామకాలు పదుల్లో!




తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లు నిరుద్యోగ యువతలో ఆశ కంటే ఆందోళనను ఎక్కువగా కలిగిస్తున్నాయి. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు లక్షల్లో ఉంటే, భర్తీ చేస్తున్న పోస్టులు మాత్రం వందల్లోనే పరిమితమవు తున్నాయి. ఒకవైపు ఏళ్ల తరబడి కష్టపడి చదువుతున్న యువత, మరోవైపు అతి తక్కువ పోస్టులు–ఈ అసమతుల్యత తీవ్రమైన పోటీని, మానసిక ఒత్తిడిని సృష్టిస్తోంది.

*గత కొన్నేళ్లుగా ప్రతి నోటిఫికేషన్‌కు లక్షల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. కొన్ని పోస్టులకు ఒక్క ఉద్యోగానికి వందల నుంచి వేల మంది వరకు పోటీ పడుతున్నారు. ఇది కేవలం పోటీ తీవ్రతను మాత్రమే కాదు, రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కొరతను కూడా ప్రతిబింబిస్తుంది. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్లలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లో అనలిస్ట్ గ్రేడ్ గ్రేడ్-2 లో 20, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులు 24, డైట్ లెక్చరర్ 86, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ 7, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ 8, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ 10, రోడ్లు-భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సూజుజు) పోస్టులు 222 మాత్రమే ఉన్నాయి. మరోవైపు పోలీసు శాఖలో సుమారు 7,000 పోస్టులకు ఆర్థిక శాఖ ఆమోదం లభించినప్పటికీ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలని, మొత్తం 20 వేల పోలీసు ఉద్యోగాలు ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.*

ప్రభుత్వ ఉద్యోగం అంటే సామాజిక భద్రత, స్థిర ఆదాయం, గౌరవప్రదమైన జీవితం అనే భావనతో అనేక కుటుంబాలున్నాయి. ముఖ్యంగా గ్రామీణ పేద దళిత, బహుజనులకు ప్రభుత్వ ఉద్యోగమే వారి సామాజిక స్థితిని మారుస్తుంది. అందుకే వేలాది మంది కోచింగ్‌లు, పుస్తకాలు, వసతి వంటి ఖర్చులు భరిస్తూ సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్నారు. అయితే ప్రశ్న ఏమిటంటే–నియామకాలు ఎందుకు అంత పరిమితంగా ఉన్నాయి? ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ పోస్టులను సమయానికి భర్తీ చేస్తున్నాయా? ప్రతి శాఖలోని వాస్తవ ఖాళీలను పారదర్శకంగా ప్రకటిస్తున్నాయా? ఇవి ప్రజా చర్చకు రావాల్సిన అంశాలు. ఒక ప్రభుత్వ ఉద్యోగం కోసం కొందరు యువకులు ఐదు, ఆరు, పదేళ్ల వరకు తమ జీవితంలోని అత్యంత విలువైన కాలాన్ని సిద్ధతకే అంకితం చేస్తున్నారు. కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు, వయోపరిమితి ఒత్తిడి, పెళ్లిళ్లు వాయిదా పడటం, అప్పులు చేసి కోచింగ్‌లు చదవడం, ఉద్యోగం వస్తుందో లేదో అనే అనిశ్చితి– ఇవన్నీ నేటి నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న వాస్తవాలు.


**రాజకీయాలకు అతీతంగా ఒత్తిడి తేవాలి.**

తెలంగాణ ఉద్యమంలో నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదం ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయని ఆశించారు. నేడు నిరుద్యోగ యువత ఆవేదనను అగ్రకుల రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలకు, ప్రభుత్వాలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే సాధనంగా వాడుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగ యువత భావోద్వేగాలకు లోనుకాకుండా, వాస్తవాలను విశ్లేషించే దృక్పథంతో అప్రమత్తంగా వ్యవహరించాలి. లక్షల్లో నిరుద్యోగులు ఉన్న వేళ, పరిమిత నియామకాలపై రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తు ఉద్యోగ నోటిఫికేషన్ లో పరిమిత స్థాయిలోనే పోస్టులు ఉంటే నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. లక్షలాది మంది యువత ప్రతిభ, శ్రమ, ఆశయాలు పదుల పోస్టులకే పరిమితమైతే అది వ్యక్తిగత విషాదం మారే అవకాశం ఉంది. రాష్ట్ర మానవ వనరుల వృథా కూడా. ప్రతి నోటిఫికేషన్ వారికి కేవలం ఒక ప్రకటన కాదు, వారికి ధైర్యాన్ని, చదవాలనే ఆసక్తిని, భరోసాను ఇవ్వాలి. కావున ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను అప్పుడప్పుడు చేసే ప్రక్రియగా కాకుండా, నిరంతర పరిపాలనా బాధ్యతగా చూడాలి. ప్రతి శాఖలో ఖాళీలను పారదర్శకంగా వెల్లడిస్తూ, వార్షిక నియామక క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేయాలి. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కొత్త పోస్టులను సృష్టించడంతో పాటు, ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను వేగంగా భర్తీ చేయాలి. యువత శక్తిని నిరాశగా కాకుండా అభివృద్ధి శక్తిగా మలచడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. ఉద్యోగం ఒక నియామక పత్రం కాదు, ఒక కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం, రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది. అందుకే ఉద్యోగాల కల్పనను వ్యయంగా కాకుండా, తెలంగాణ భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడిగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# ఉగ్రవాదం – ఓ ఊసరవెల్లిని... గుర్తించి, నిర్మూలించటమే ఛాలెంజ్



ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద ఘటనలు తగ్గుతున్నాయనే గణాంకాలు మొదటి చూపులో ఆశాజనకంగా కనిపిస్తాయి. కొన్ని అంతర్జాతీయ నివేదికలు గత దశాబ్దంతో పోలిస్తే అనేక ప్రాంతాల్లో దాడుల సంఖ్య, మరణాల సంఖ్య తగ్గినట్లు సూచిస్తున్నాయి. అయితే గణాంకాల్లో కనిపించే ఈ తగ్గుదలనే వాస్తవ పరిస్థితిగా భావించడం ప్రమాదకరం. ఎందుకంటే ఉగ్రవాదం అనేది ఒక స్థిరమైన శత్రువు కాదు; కాలానికి అనుగుణంగా తన రూపాన్ని, వ్యూహాన్ని, లక్ష్యాన్ని మార్చుకుంటూ ముందుకు సాగే చలనశీలమైన ముప్పు. అందువల్ల కేవలం సంఖ్యల ఆధారంగా ప్రపంచం మరింత సురక్షితమైందని నిర్ణయించడం సరైన విశ్లేషణ కాదు.

గతంలో ఉగ్రవాద సంస్థలు పెద్దఎత్తున భూభాగాలను ఆక్రమించడం, ప్రత్యక్ష యుద్ధాలు చేయడం, భారీ పేలుళ్లకు పాల్పడటం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇచ్చేవి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. భౌగోళిక ఆధిపత్యం కంటే భావజాల వ్యాప్తి, చిన్న చిన్న స్వతంత్ర దాడులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆన్‌లైన్ నియామకం, డిజిటల్ ప్రచారం వంటి పద్ధతులు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. అందువల్ల దాడుల సంఖ్య తగ్గినా, వాటి ప్రభావం తగ్గిందని చెప్పలేం.

ప్రపంచ ఉగ్రవాద సూచీ (గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్) తాజా అంచనాల ప్రకారం, ఉగ్రవాదానికి సంబంధించిన భారం ఇప్పటికీ ప్రధానంగా సాహెల్ ప్రాంతం, సహారా దక్షిణ ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ వంటి ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉంది. ప్రపంచ ఉగ్రవాద మరణాల్లో గణనీయమైన భాగం ఈ ప్రాంతాల నుంచే నమోదవుతోంది. (లభ్యమైన తాజా అంతర్జాతీయ డేటా ఆధారంగా – 2025 నివేదిక). అంటే సమస్య అంతరించిపోలేదు; కేవలం కేంద్రాలు మారాయి.

మరో ముఖ్యమైన పరిణామం "లోన్-వుల్ఫ్" దాడుల పెరుగుదల. ఒక పెద్ద ఉగ్రసంస్థకు ప్రత్యక్ష సంబంధం లేకుండానే, ఇంటర్నెట్ ద్వారా తీవ్రవాద భావజాలానికి ప్రభావితమై వ్యక్తిగతంగా దాడులు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిని ముందుగానే గుర్తించడం సంప్రదాయ నిఘా వ్యవస్థలకు చాలా కష్టం. ఫలితంగా పెద్ద కుట్రలను అడ్డుకోవడం కంటే చిన్న చిన్న దాడులను నిరోధించడం భద్రతా సంస్థలకు కొత్త సవాలుగా మారింది. డిజిటల్ ప్రపంచం ఉగ్రవాదానికి కొత్త ఆయుధంగా మారింది. సామాజిక మాధ్యమాలు, గుప్త సందేశ వ్యవస్థలు, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వేదికలు, క్రిప్టోకరెన్సీల వినియోగం ద్వారా నియామకం, నిధుల సేకరణ, శిక్షణ, ప్రచారం మరింత సులభమయ్యాయి. ఒకప్పుడు శిక్షణ శిబిరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు ఒక మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు; తీవ్రవాద ప్రచారం ప్రపంచవ్యాప్తంగా క్షణాల్లో వ్యాపిస్తోంది.

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్)(ఏఐ), డ్రోన్లు, స్వయంచాలక (ఆటోమాటిక్) సాంకేతికతలు కూడా కొత్త ప్రమాదాలకు దారితీస్తున్నాయి. తక్కువ ఖర్చుతో డ్రోన్లను పేలుడు పదార్థాల వాహకాలుగా ఉపయోగించే అవకాశం పెరిగింది. కృత్రిమ మేధస్సుతో తప్పుడు వీడియోలు, నకిలీ ప్రసంగాలు, ద్వేష ప్రచారాన్ని మరింత విశ్వసనీయంగా రూపొందించే సామర్థ్యం పెరుగుతోంది. భవిష్యత్తులో ఉగ్రవాదం కేవలం తుపాకులు, బాంబులతో మాత్రమే కాకుండా సమాచార యుద్ధం, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం రూపంలో కూడా వ్యక్తమయ్యే అవకాశం ఉంది.


భారత్‌కు ఈ పరిస్థితి ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. సరిహద్దు దాటి ప్రోత్సహించబడే ఉగ్రవాదం, జమ్మూ-కాశ్మీర్‌లో పరిస్థితులు, సరిహద్దు చొరబాట్లు, డ్రోన్‌ల ద్వారా ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలు ఇప్పటికీ భద్రతాపరమైన ఆందోళనలుగానే ఉన్నాయి. అదే సమయంలో దేశీయంగా సామాజిక విభజనలు, మత విద్వేషాలు, ద్వేష ప్రచారం, ఆన్‌లైన్ తీవ్రవాదీకరణ వంటి అంశాలను కూడా నిర్లక్ష్యం చేయరాదు. ఉగ్రవాదం కేవలం సరిహద్దుల నుంచే వస్తుందని భావించడం నేటి పరిస్థితుల్లో సరైన దృక్పథం కాదు.

అంతర్జాతీయ సహకారం కూడా గతంతో పోలిస్తే మరింత కీలకంగా మారింది. ఉగ్రవాద నిధుల నియంత్రణ, సమాచార మార్పిడి, సైబర్ నిఘా, అంతర్జాతీయ నేర ముఠాలపై సంయుక్త చర్యలు లేకుండా ఏ దేశమూ ఒంటరిగా ఈ ముప్పును ఎదుర్కోలేదు. ఉగ్రవాదానికి ఆర్థిక వనరులు, ఆయుధాల సరఫరా, డిజిటల్ మౌలిక వసతులను అడ్డుకోవడం కూడా సైనిక చర్యలంతే ముఖ్యమైన అంశంగా మారింది.

అయితే భద్రత పేరుతో ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడం కూడా ప్రమాదకరమే. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం చట్టబద్ధంగా, పారదర్శకంగా, మానవ హక్కులను గౌరవించే విధంగా సాగాలి. లేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అదే తీవ్రవాద సంస్థలకు కొత్త నియామకాల అవకాశాన్ని కల్పిస్తుంది. భద్రతా చర్యలు, ప్రజాస్వామ్య విలువలు రెండూ సమతుల్యంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సైనిక శక్తి ఒక్కటే పరిష్కారం కాదు. నిరుద్యోగం, పేదరికం, విద్యా లోపం, సామాజిక వివక్ష, రాజకీయ అస్థిరత, విద్వేష ప్రచారం వంటి మూలకారణాలను కూడా పరిష్కరించాలి. యువతలో విమర్శనాత్మక ఆలోచన, డిజిటల్ అక్షరాస్యత, శాంతి విలువలపై అవగాహన పెంపొందించడం దీర్ఘకాలిక భద్రతకు అవసరం.

గణాంకాలు పాలకులకు, పరిశోధకులకు ఉపయోగకరమైన సాధనాలు మాత్రమే; అవే సంపూర్ణ సత్యం కావు. కొన్ని ప్రాంతాల్లో దాడులు తగ్గడం ఒక సానుకూల పరిణామమే అయినప్పటికీ, అదే సమయంలో ఉగ్రవాదం తన రూపాన్ని మార్చుకుంటూ కొత్త రంగాల్లోకి ప్రవేశిస్తోంది. అందువల్ల విజయాన్ని కేవలం మరణాల సంఖ్యతో లేదా దాడుల సంఖ్యతో కొలవలేం. సమాజంలో భయం తగ్గిందా? తీవ్రవాద భావజాలం బలహీనపడిందా? యువతను అతివాద ప్రచారం నుంచి రక్షించగలుగుతున్నామా? సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం కాకుండా అడ్డుకుంటున్నామా? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు. అందుకే ప్రపంచం ఈరోజు నేర్చుకోవాల్సిన ప్రధాన పాఠం ఒక్కటే...ఉగ్రవాదం కనిపించే రూపం తగ్గిందని, అది అంతరించి పోయిందని అనుకోవడం అత్యంత ప్రమాదకరమైన భ్రమ. గణాంకాల వెనుక దాగి ఉన్న కొత్త ముప్పులను ముందుగానే గుర్తించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అంతర్జాతీయ సహకారంతో, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలతో, సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తూ ముందుకు సాగినప్పుడే నిజమైన భద్రత సాధ్యమవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## సంప్రదాయ కళలను చేరవేయడమే లక్ష్యం

● రస కూటమి ఫౌండేషన్ కో-ఫౌండర్ సునీల్ సత్యవోలు



**ఖైరతాబాద్, జూలై 12 (జనం సాక్షి) :** సంప్రదాయ కళలను ఆధునిక తరానికి చేరవేయడమే లక్ష్యంగా రస కూటమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో 'సంప్రదాయం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి నట్లు ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు సునీల్ సత్యవోలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిధిగా పద్మశ్రీ డా.దీపికా రెడ్డి, డా.దీప్తి దేవరకొండ పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కనకయ్య బృందం(చెక్క బొమ్మలత), మీనయ్య బృందం(యక్షగానం), డా.ఉదయ రేణుగుంట నేతృత్వంలోని సప్తమాత్రే(ముద్గర్ వారియర్స్), శివాంశ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్(భరతనాట్యం), డా. భోగిరి శివ నేతృత్వంలోని ఎన్.సి.కలరి (కలరిప యట్టు), దీపేష్, లక్ష్మణ్, అనన్య, ఉజ్వల్‌ల లైవ్ ఫ్యూజన్ ప్రదర్శనలు ఆకట్టుకున్నట్లు చెప్పారు. తెలంగాణ పర్యాటక శాఖ సహకారంతో నిర్వ హించిన ఈ కార్యక్రమానికి రేడియంట్ అవెన్యూస్, ది గోల్డెన్ హంప్, సింగిడి కలెక్టివ్ మద్దతు అందిం చాయని పేర్కొన్నారు.

## బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం



**నిజాంపేట్, జూలై 12 (జనం సాక్షి) :** దుండిగల్ 59 సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో 12వ బ్లాక్ నుంచి 27వ బ్లాక్ వరకు ఉన్న ఎనిమిది బ్లాక్‌లలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొనడంతో ఆయా బ్లాక్‌ల కాలనీవాసులు గత వారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి సమస్యను వివరించారు.వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త బోరు మోటార్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అధికారుల సహకారంతో బోరు మోటార్ ఏర్పాటు పూర్తికాగా, ఆదివారం హన్మంత్ రెడ్డి స్వయంగా దానిని ప్రారంభించి కాలనీవాసులకు అంకితం చేశారు.. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరిం పరిష్కరించిన హనుమంత రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అరికెల విజయ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వీర రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతగింది సురేష్, 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మన్నె కుమార్, బాలరాజు, శ్రీను, హేమలత, రజియా, కమలమ్మ, డీసీసీ జనరల్ సెక్రటరీ రమ్య, సుధారాణి, సోమరాజు తదితరులు, అలాగే పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూలై 12 (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తులసీ గార్డెన్స్‌లో పిఆర్‌టియు యాలాల మండలం ఆధ్వర్యంలో ఎస్. చంద్రయ్య పదవీ విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయులను సన్మానించి, వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు అందించే సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎస్. చంద్రయ్య తన సుదీర్ఘ సేవా కాలంలో విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి విశేష కృషి చేశారని ప్రశంసించారు.పదవి విరమణ అనేది సేవలకు ముగింపు కాదు. ఇది సమాజానికి మార్గదర్శకత్వం అందించే కొత్త అధ్యాయానికి నాందిఅని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులోనూ తమ అనుభవం, జ్ఞానంతో సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. చంద్రయ్య పదవీ విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమం చివరలో పిఆర్ టియు నాయకులు, ఉపాధ్యాయులు చంద్రయ్యని పూలమాలలతో, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి



**హయత్‌నగర్, జూలై 12 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎల్‌బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తన నివాసంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఇప్పటికే నియోజకవర్గ పార్టీ శ్రేణులకు సమగ్ర అవగాహన కల్పించారని తెలిపారు. ఆ మేరకు నియోజకవర్గం లోని ప్రతి కాలనీకి వెళ్లి ఇంటింటా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరాలు తెలియజేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కోసం అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణకు శ్రీకారం



**ఉప్పల్/హబ్సిగూడ, జూలై 12 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి చరిత్రలో మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుట్టబడింది. హబ్సిగూడ--రామంతాపూర్ డివిజన్ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషితో సుమారు రూ.19 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి కార్యక్రమానికి ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీవాసుల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రామంతాపూర్ పెద్దచెరువు ఉప్పల్ నియోజకవర్గంలోని అత్యంత ప్రాచీన జలవనరుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. నగర విస్తరణతో పాటు పెరుగుతున్న జనాభా ఒత్తిడి కారణంగా చెరువు క్రమంగా నిర్లక్ష్యానికి గురవుతూ తన సహజ స్వరూపాన్ని కోల్పోయింది. చెరువులో పూడిక పేరుకుపోవడం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, కాలుష్యం పెరగడం, వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడడం వంటి సమస్యలు స్థానిక ప్రజలను చాలా కాలంగా ఇబ్బందులకు గురిచేశాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భారీ నిధులను మంజూరు చేయగా, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిరంతర కృషితో పనులు ప్రారంభం కావడం స్థానికుల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదని, ప్రకృతి సంపదను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. నగర అభివృద్ధితో పాటు చెరువులు, కుంటలు, జలవనరులను కాపాడితేనే భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ పూర్తయిన తర్వాత వర్షపు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగి, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో నీటి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని తెలిపారు. రూ.19 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో చెరువు పూడిక తొలగింపు, చెరువు కట్ట బలోపేతం, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ, రక్షణ గోడల నిర్మాణం, వర్షపు నీటి సక్రమ నిల్వకు అవసరమైన ఏర్పాట్లు, ఆక్రమణల నివారణ, పచ్చదనం పెంపు, అందమైన ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి ప్రదేశాలు, ప్రజలు సేదతీరేందుకు అవసరమైన సౌకర్యాలు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత రామంతాపూర్ పెద్దచెరువు ప్రకృతి అందాలతో కళకళలాడే ప్రాంతంగా మారనుంది. చెరువుల పరిరక్షణ అనేది కేవలం నీటి నిల్వకే పరిమితం కాదని, అది పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. చెరువు అభివృద్ధి వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయని, పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. కాలుష్యం తగ్గడంతో పాటు జీవవైవిధ్యం కూడా పెరుగుతుందని, పక్షులు, జలచరాలు తిరిగి ఆశ్రయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రామంతాపూర్, హబ్సిగూడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ చెరువు ఒక ప్రధాన విశ్రాంతి కేంద్రంగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వారికి విశాలమైన నడక మార్గాలు, పచ్చని వాతావరణం, విశ్రాంతి కోసం బెంచీలు, కుటుంబ సభ్యులు సేదతీరేందుకు అనువైన ప్రదేశాలు, పిల్లలకు అనుకూల వాతావరణం వంటి సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత నగర ప్రజలు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా గడిపే ప్రదేశంగా రామంతాపూర్ పెద్దచెరువు నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, విద్యాసంస్థల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, పార్కుల అభివృద్ధి, మురుగునీటి వ్యవస్థ ఆధునీకరణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. చెరువులను ఆక్రమణల నుంచి రక్షించడం, కాలుష్యాన్ని అరికట్టడం, సహజ వనరులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన జలవనరులను తిరిగి పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నగర పర్యావరణాన్ని మెరుగుపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రజలు కూడా చెరువులను పరిశుభ్రంగా ఉంచుతూ, వాటి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు కూడా ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా చెరువు అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నామని, ఇప్పుడు పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పరిసర ప్రాంతాల అందం మరింత పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. రూ.19 కోట్లతో చేపట్టిన ఈ పునరుద్ధరణ పనులు పూర్తయిన అనంతరం రామంతాపూర్ పెద్దచెరువు హైదరాబాద్ నగరంలోనే ఆదర్శవంతమైన చెరువుగా నిలవడంతో పాటు ప్రకృతి ప్రేమికులు, ఉదయాన్నే నడకకు వచ్చే ప్రజలు, కుటుంబాలతో విహారానికి వచ్చే సందర్శకులను ఆకర్షించే కేంద్రంగా రూపుదిద్దుకోనుంది. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడంలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు, స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ పనుల ప్రారంభాన్ని స్వాగతించారు.

## వన్య ప్రాణిని వేటాడిన గ్యాంగ్ ముఠా అరెస్ట్




**శామీర్‌పేట, జూలై 12 (జనం సాక్షి) :** సంరక్షిత నీల్గాయ్ అక్రమ వేటలో పాల్గొన్న ముగ్గురు సభ్యుల గ్యాంగ్‌ను శామీర్‌పేట పోలీసు, ఎస్ఓటి మల్కాజ్‌గిరి – టీమ్ పట్టుకొని రిమాండ్ కు తరలించారు. వారి వద్ద నుంచి రైఫిల్, ఎయిర్ గన్, మందుగుండు, 70 కిలోల మాంసం, వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ లో మల్కాజ్గిరి జోన్ అడిషనల్ డిసిపి రామ్ కుమార్ విలేకరుల సమా వేశంలో వివరాలు వెల్లడించారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్ఓటి మల్కాజ్‌గిరి – (కంటోన్మెంట్) టీమ్‌తో కలిసి శామీర్‌పేట మండలం అంతాయిపల్లి గ్రామం బిట్స్ జంక్షన్ వద్ద మధ్యాహ్నం రెండు గంటలకు ఎర్ర రంగు మహీంద్రా బొలెరో వాహనం నెం.టిజి 08డి 0433ను అడ్డుకున్నారు. అదిలాబాద్ అటవీ ప్రాంతంలో సంరక్షిత వన్యప్రాణి అయిన నీల్గాయ్ (బ్లూ బుల్) ను అక్రమంగా వేటాడిన ముగ్గురు సభ్యుల గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన తుపాకులు, కత్తి, నీల్గాయ్ మాంసం, మందుగుండు, వాహనం మరియు ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వేముల సునీల్ సల్మాన్ రాజ్, వేముల అఖిల్ తండ్రి కొడుకులు. వేముల సునీల్ సల్మాన్ రాజ్ వద్ద ఆత్మరక్షణ కోసం ఆల్ ఇండియా వాలిడిటీ ఉన్న ఆర్మ్స్ లైసెన్స్ ఉంది. నిందితులు ఎర్ర రంగు మహీంద్రా బొలెరో వాహనం నెం. టిజి 08డి0433 లో అదిలాబాద్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సునీల్ తన లైసెన్స్ ఉన్న ఎన్ పిబి 30-06 ఎస్ బి టెలిస్కోప్ అమర్చిన రైఫిల్‌తో నీల్గాయ్ ను వేటాడినట్లు సమాచారం. జంతువును చంపిన తర్వాత, సునీల్ తన కొడుకు అఖిల్, కార్మికుడు ఆదినారాయణతో కలిసి నీల్గాయ్ చర్మాన్ని ఒలిచి, మాంసాన్ని ముక్కలుగా కోసి, యాప్రాల్, జవహర్ నగర్‌లోని తమ ఇంటికి బయలుదేరారు. విశ్వస నీయ సమాచారం మేరకు మార్గమధ్యంలో శామీర్ పేట పోలీసులు, ఎస్ఓటి మల్కాజ్‌గిరి – టీమ్ సంయుక్తంగా అంతాయ పల్లి గ్రామం, బిట్స్ జంక్షన్ వద్ద సుమారు మధ్యాహ్నం రెండు గంటలకు వాహనంలో ఉన్న ముగ్గురు నిందితులను అదుపు లోకి తీసుకున్నారు. పంచ్‌ల సమక్షంలో నేరానికి సంబంధించిన ఆయుధం, నీల్గాయ్ మాంసం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం, 30 ఆర్మ్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించారు. సమావేశంలో ఎస్ఓటి అడిషనల్ డిసిపి నంద్యాల నరసింహారెడ్డి, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కె.నర్సింహారెడ్డి,ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస్, ఎస్ఐ సోమిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తాం




**హయత్‌నగర్, జూలై 12 (జనం సాక్షి) :** సీపీఐ హయత్‌నగర్ మండల కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య హయత్‌నగర్ మండల నిర్మాణ మహాసభలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మండల అధ్యక్షుడు శాగంటి వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ మహా సభలకు ఏఐవైఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్ సంఘ జెండాను ఆవిష్కరించి, మహా సభలను ప్రారంభించారు. అనంతరం నాయకులు యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక అసమానతలు వంటి సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ప్రకటించారు. యువత హక్కుల సాధనకు, సామాజిక మార్పు కోసం ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హయత్‌నగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నమల్ల శ్రీకాంత్, కార్యదర్శిగా శాగంటి వీరన్న ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులు తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని, సంఘ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మహా సభలో సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి కామ్రేడ్ శేషరాజుపల్లి శ్రీదేవి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇసంపల్లి వెంకన్న, మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు సందీప్, రమేష్, గణేష్, జగదీష్, నవీన్, సురేష్, లక్ష్మణ్ తదితరులు, యువజన సంఘం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజలకు వైద్య సేవలను అందించడమే లక్ష్యం

● ఐక్యత పౌండేషన్ చైర్మన్,టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి, జూలై 12 (జనంసాక్షి) :** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఈ నెల 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన కంటి చూపును ప్రసాదించారు. ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడారు.ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారిచే ఏర్పాటు చేసిన కంటి వైద్య శిభిరం అందరికి విజయవంతంగా సేవలు అందించడం మరువలేనిదని పేర్కొన్నారు.ప్రజల ప్రేమ,నమ్మకం,ఆశీర్వాదాలే ఈ క్యాంప్ విజయానికి నాకు అతిపెద్ద భరోసా,శిబిరానికి వేలాది మంది ప్రజలు విశ్వాసంతో వచ్చిన క్షణాలు జీవితంలో మరచిపోలేని అనుభూతిని కలిగించిందన్నారు. ప్రతి కుటుంబంలో వెలుగు నింపాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టాం, కంటిచూపు పొందిన ప్రతి ఒక్కరి ఆనందమే నాకు లభించిన గొప్ప బహుమతి, నాపై నమ్మకం ఉంచి ఈ శిబిరాన్ని విజయవంతం చేసిన తలకొండపల్లి మండల ప్రజలకు,వైద్య బృందానికి,సేవా కార్యక్రమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజాసేవే నా ధ్యేయం మీ ఆశీర్వాదాలతో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో కొనసాగిస్తాను అని తెలిపారు.అలాగే ఈ కార్యక్రమానికి గత పది రోజులుగా హాజరై విజయవంతం కావడానికి సహకరించిన మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కటికల శేఖర్,శ్రీను,వీరేష్,దాస్ నాయక్,చంద్రశేఖర్,ఇమ్మడి మహేష్,రామకృష్ణ,రమేష్,సుధాకర్,వెంకటేష్,కళ్యాణ్ నాయక్,అంజన్ రెడ్డి,బాలస్వామి,శేఖర్ యాదవ్,కృష్ణనాయక్, శంకర్ నాయక్, ధర్మ నాయక్,శ్రీను నాయక్,రమేష్ నాయక్, నిర్మల శ్రీశైలం,జ్యోతి రవీందర్,మల్లేష్,భారతమ్మ, శ్రీనివాస్,రజిత రాజు నాయక్,మల్లేష్,రవి లతో పాటు ఉపసర్పంచులు మూడవత్ భాస్కర్, రమేష్ యాదవ్, గుద్దేటి నరసింహ, లక్క శ్రీను, దేరంగుల విజయ్, రమేష్ నాయక్, కోటేశ్వర్, రామావత్ నరసింహ,ఆంజనేయులు,విజయ్ కుమార్ గుప్తా,గోపాల్ నాయక్, కుమార్, యాదగిరి రెడ్డి,మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్,మాజీ సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, నరేందర్ గౌడ్, రఘుపతి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, హాట్ నాయక్, సీనియర్ నాయకులు అంజయ్య శెట్టి, డేవిడ్, అనిల్, రాజేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కొప్పు శ్రీశైలం, మురళీ గౌడ్, నాయకులకు కార్యకర్తలకు శ్రేయోభిలాషులందరికీ,మరియుమీడియా మిత్రులకు,శంకర నేత్రాలయ వైద్య బృందానికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,వ కంటి వైద్య శిభిరం సెప్టెంబర్‌లో కడ్తల్‌లో నిర్వహించబడుతుంది అని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు చేయించుకున్న పేషెంట్లు మాట్లాడుతూ..మాకు మళ్లీ కంటిచూపు వస్తుందని ఎన్నడూ ఊహించలేదు,ఆర్థిక పరిస్థితుల కారణంగా చికిత్స చేయించుకోలేక ఎన్నో సంవత్సరాలు ఇబ్బందులు పడ్డాం,సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి చొరవతో పూర్తిగా ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించి,మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఈ ఉపకారానికి మా జీవితాంతం రుణపడి ఉంటాం,ఆయన సేవలను ఎప్పటికీ మరచిపోలేం, నియోజకవర్గంలోని పేదలు,వృద్ధులు,వికలాంగులకు పెద్ద దిక్కుగా నిలుస్తూ ఇంత పెద్ద సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్యులు డా.అలెగ్జాండర్, పల్లవి, సలీల్‌తో పాటు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, శ్రీరాములు, రఘు, యాదయ్య, మల్లేష్, విజయ్, శ్రీపతి, శేఖర్, శ్రీను, శివ కాకి, భాస్కర్, మహేష్, సాయిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రీయంబర్స్‌మెంట్ సాధన కోసం 14న కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి




**నారాయణపేట, జూలై 12 (జనం సాక్షి) :** విద్యార్థుల ఫీజు రియాంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న ఎబివిపి రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ కు పిలుపు ఇచ్చినట్లు నారాయణపేట జిల్లా ఎబివిపి కన్వీనర్ నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇంతియాజ్,నగర్ కార్యదర్శి సతీష్, చరణ్ రెడ్డి తెలిపారు.వారు ఆదివారం నారాయణపేట లో విలేకరుల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 11వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల లక్షలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు.విద్యను ప్రాథమిక హక్కుగా, సామా జిక సమానత్వానికి పునాదిగా భావించాల్సిన ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనబెట్టి నిర్లక్ష్య వైఖరిని అవలంబి స్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థు లపై ఫీజుల పేరుతో ఒత్తిడి తీసుకువస్తున్నాయని,పరీక్షలకు అనుమతించ కపోవడం,సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి ఘటనలు చోటుచేసు కుంటున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా రంగానికి ఇచ్చిన హామీలు అమలులో కనిపించడం లేదని ఏబీపీ నాయకులు విమర్శించారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అవసరమైన చొరవ చూపడంలో విఫలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వంస్పందించకపోవడం ఆందోళనకరమని అన్నారు.రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, ఖాళీ అధ్యాపక పోస్టులు,సరైన మౌలిక వసతుల లేమి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ కనిపించక పోవడం వల్ల ఉన్నత విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యా ర్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. పేద విద్యా ర్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని ఎత్తివేయాలనే కుట్ర చేయడం వల్ల వారి చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను కేవలం పరిపాలనా అంశాలుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ ప్రాధాన్యత అంశాలుగా ప్రభుత్వం పరిగణించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఏబీవీపీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని, ఈ నేపథ్యంలోనే జూలై 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపు నిచ్చినట్లు తెలిపారు.రాష్ట్రంలోని విద్యార్థులు,తల్లిదండ్రులు,అధ్యాపకు లు, విద్యావేత్తలు ఈ బంద్ కు మద్దతు తెలిపి ప్రభు త్వంపైప్రజాస్వామ్యబద్ధమైన ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.ప్రభుత్వం విద్యార్థుల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సమాజంతో కలిసి ఏబీవీపీ మరింత ఉద్ధృత ఉద్యమాలను చేపడుతుందని హెచ్చరించారు.

## జిల్లాలో 250 మంది విద్యా వాలంటీర్లను నియమించాలి



**మక్తల్, జూలై 12 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో 250 మంది విద్యా వాలంటీర్లను నియమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని కోరింది. ఆదివారం మక్తల్‌లో తపస్ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. విధుల సర్దుబాటులో భాగంగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పీటీఐలను ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లాలోని కొత్త మండలాలైన కృష్ణ, కొత్తపల్లి, గుండుమాల్ మండల వనరుల కేంద్రాలకు (ఎంఆర్సీ) భవనాలు నిర్మించి అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. విద్యా వాలంటీర్ల నియామక అంశంపై ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శేర్ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహా, జిల్లా కార్యదర్శి బి. రవీందర్, మక్తల్ మండల అధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి రాకేష్ కుమార్, జిల్లా నాయకులు వి. భీమ్ రెడ్డి, నాగార్జున, వెంకట్రాములు, రాము, రాజాంజనేయులు, ప్రవర్ధన్ రెడ్డి, రామాంజనేయులు, రవీందర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ రోడ్లతో మక్తల్ రోడ్లకు మహర్దశ

- రూ.320 కోట్లతో హ్యామ్ రోడ్లు



**మక్తల్, జూలై 12 (జనంసాక్షి) :** హ్యామ్ రోడ్లతో మక్తల్ రోడ్లకు మహర్దశ పట్టనుందని రూ.320 కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్ లో హ్యామ్ రోడ్ల శంకుస్థాపనకు మంత్రుల రాక సందర్భంగా ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం మక్తల్ కు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు రానున్నారని ఆయన తెలిపారు. పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రూ.320 కోట్లతో మక్తల్ నియోజకవర్గం లో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్క మక్తల్ – నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు కే రూ.237 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా మరికల్ – మినాస్ పూర్ – లింగంపల్లి రోడ్డు కు రూ.49.57 కోట్లు,ఆత్మకూరు – మరికల్ రోడ్డు కు రూ.22.47 కోట్లు, మాగనూరు మండలం నల్లగట్టు – హిందూపూర్ రోడ్డుకు రూ.10.49 కోట్లతో రోడ్లు వేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ పనులన్నీ కేవలం ఏడాది లోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హ్యామ్ రోడ్లకు సంబంధించి సోమవారం మంత్రులు పైలాన్ ను ఆవిష్కరిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. అనంతరం ఐలిన్ స్కూల్ వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, బోయ రవికుమార్, కావలి శ్రీహరి, వాకిటి హన్మంతు, శ్రీనివాస్ గౌడ్, శివరాం రెడ్డి, ఆనంద్ గౌడ్, విజయ్ గౌడ్, గోవర్ధన్, కావాలి తాయప్ప, శివరాజ్, గుర్లపల్లి భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ - బీఆర్ఎస్ దొందూ దొందే..!



**గద్వాల, జూన్ 12 (జనం సాక్షి) :** జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరిన యువకులు.ఈ సందర్భగా మాట్లాడుతూ సర్‌ను సీరియస్‌గా తీసుకొని పని చేయాలని, ప్రజల పక్షాన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రణాళిక రూపొందించుకొని, పోరాటాలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలు,విధానాలు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తలపై ఉందని జిల్లా నేతలకు,కార్యకర్తలకు ఎంపీ డీకే అరుణ దిశ నిర్దేశం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందనీ, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేవలం కేంద్రం నిధులతోనే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు పైసా లేదని దుయ్యబట్టారు.బి ఆర్ ఎస్ , కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ఇప్పటికే ఆగం అయ్యిందని విమర్శించారు.కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు.. జూట మాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారని,ప్రజలను కాంగ్రెస్ మాయలో పడకుండా అప్రమత్తం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ను నమ్మి మరోసారి పొరపాటు చేయవద్దని ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు.బి ఆర్ ఎస్ హయంలో ఒక కుటుంబం అవినీతి చేసేదని, ప్రస్తుతం పై నుంచి కింది వరకు అవినీతి నడుస్తుందని విమర్శించారు. కమిషన్ చెల్లించకపోతే కాంట్రాక్టర్లకు బిల్లులు వచ్చే పరిస్తితి లేదన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్,దీ=ూ అండర్స్టాండంగ్ పాలిటిక్స్ చేస్తున్నాయని కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలోని ప్రజలకు, ప్రతి కార్యకర్తలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని లేదంటే తెలంగాణ అంధకారంగా మరింత అప్పుల కూపంలోకి వెళ్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర రెడ్డి, మాజీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు అప్సర్ పాషా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కేకే రెడ్డి, శ్యామ్ రావు, అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థులు బలిగేరా శివారెడ్డి, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడుగుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి



**నర్సాపూర్, జూలై 12 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణంలోని ప్రతి ఇంటి పరిసరాల్లో విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆదివారం నర్సాపూర్ పురపాలక సంఘం కమిషనర్ చెరుకు సాయికుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో, వర్షపు నీటితో పాటు గృహ వినియోగం అనంతరం విడుదలయ్యే నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి రీచార్జ్ చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. దీంతో భవిష్యత్‌లో తాగునీటి సమస్యను అధిగమించవచ్చన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల లోతట్టు ప్రాంతాల్లో ముంపు, వరదల తీవ్రత తగ్గడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కాంక్రీటీకరణ పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఇంటి యజమాని సామాజిక బాధ్యతగా భావించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.మున్సిపాలిటీ పరిధిలో 200 చదరపు గజాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భవనాలకు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండాలని, నిబంధనలు పాటించని వారిపై తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి



**కొల్చారం, జూలై 12 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో ఓటరు జాబితా సవరణను గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్ పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి. బూత్‌లోని బిఎల్ఏలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ సూచించారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ వివరాలలో ఉన్న తప్పుల సవరణ, నకిలీ ఓట్ల గుర్తింపు తొలగింపు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటర్ జాబితాలో ఉండేలా చూడటం మనందరి కర్తవ్యం. ప్రతి ఇంటింటికి వెళ్లి కొత్త ఓటర్లను గుర్తించడం, ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరి చేయించడం, మరణించిన వారి లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం అవసరమని గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలకంటి సంగమేశ్వర్ మహేశ్వర్ రెడ్డి అక్రమ్ సాకేత్ కిరణ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ తరలించే వరకు ఉద్యమం చేస్తాం

- నిరాహార దీక్షలో బిఆర్ఎస్ నేత ప్రతాప్ రెడ్డి



**తూప్రాన్, జూలై 12 (జనం సాక్షి) :** ప్రజల అనారోగ్యాలకు కారణమైన రంగాయపల్లి శివారు లోని యం స్ అగర్వల్ కంపెనీ నీ తరలించేవరకు ఉద్యమం చేస్తామని బి ఆర్ ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు గ్రామ పంచాయతీ వద్ద నిరాహార దీక్షా చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. వీరితో పాటు నియోజక వర్గ నాయకులు ఈ దీక్షలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఈ కంపనీ వలన మా పిల్లలకు చర్మ వ్యాధులు వ్యాపిస్తున్నాయి, అంగ వైకల్యం ఏర్పడం, గర్భం లో పిండాలు కరుగుతున్నాయి, రాత్రుల్లో శబ్దాలు వచ్చి నిద్రలు పట్టడం లేదని మీరు, గాలి కాలుష్యం, జంతువులు రోగాలతో రాలిపోతున్నాయి, పంటలు పండడం లేదు, ఎన్నో సంవత్సరాలుగా బాధలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు.. ఈ కంపనీ మాకు వద్దు మా ఆరోగ్యమే ముద్దు. అని మహిళలు యువకులు ప్రతి ఒక్కరూ ఈ సభలో మొర పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మా బాధను గుర్తించి వ్యాధులకు కారణమైన ఈ కంపనీనీ తొలగించాలని కోరారు కంపెనీ తరలించే వరకు ఉద్యమం ఆపేది లేదని ప్రజలకు అండగా ఉండి ఉద్యమం చేస్తూనే ఉంటామని అన్నారు.

# మంత్రుల పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- డీఎస్పీ నల్లపు లింగయ్య



**మక్తల్, జూలై 12 (జనంసాక్షి) :** మక్తల్ మండల కేంద్రంలో సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు మక్తల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు చేయనున్న సందర్భంగా, బహిరంగ సభలో ఉన్న నేపథ్యంలో సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తిప్రస్పల్లి నుండి మక్తల్ వరకు, అలాగే కచ్వర్ నుండి మక్తల్ వరకు బైక్ ర్యాలీ సందర్భంగా ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో హైలిన్ స్కూల్ సమీపంలో బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మంత్రుల పర్యటన మొత్తం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య వెల్లడించారు. బందోబస్తు పర్యవేక్షణలో డీఎస్పీ నల్లపు లింగయ్యతో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి




**మెదక్ టౌన్, జూలై 12 (జనం సాక్షి) :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడం, ద్వారా నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రాథమిక విద్యను బలహీనపరిచే జీవో నెంబర్ 25 ను సవరించి విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించే విధంగా సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కల్పించడం ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సూచనలు చేసి జీవో నం 25 ను.సవరించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అనుకూలంగా తరగతికి ఒక ఉపాధ్యాయుడు ని నియమించాలని ఆయన ఆదివారం రోజు మండల కేంద్రంలో హవేలీ ఘనపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు.సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంగమేశ్వరలతో కలసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పిఆర్టియు హవేలీ ఘనపూర్ శాఖ బాధ్యులు సుభాష్ రెడ్డి, సంగమేశ్వర్ , నందారం రఘుబాబు, రాజేందర్ రెడ్డి , త్యార్ల శ్రీనివాస్ , బొగ్గుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సేవలను మరింత చెంతకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**కేటీదొడ్డి, జూలై 12 (జనం సాక్షి) :** రైతాంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో మరియు నాణ్యమైన రీతిలో అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం" అని గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కె.టి.దొడ్డి మండలం పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ (ఐజమీా) సెంటర్‌ను ఎమ్మెల్యే గారు ఈరోజు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారికి షాప్ యజమాని గోపి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గారు తన చేతుల మీదుగా స్థానిక రైతులకు ఎరువులను (ఫర్టిలైజర్స్) పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి గ్రామాల పరిధిలోనే నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ నూతన ఐజమీా సెంటర్‌ను ప్రారంభించడం జరిగింది. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ఇలాంటి ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల ద్వారా సేవలను సద్వినియోగం చేసుకోవాలి. నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ అండగా ఉంటూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది." అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచులు నారాయణ, పవన్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి, ముఖ్య నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, ఉరుకుందు, యుగేందర్ గౌడ్, శేఖర్ రెడ్డి, నవీన్ రెడ్డి, శేఖర్, రంగారెడ్డి, అమరేష్, మహాదేవ్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికే ఈ పరిస్థితి భారీ వర్షాలు వస్తే పరిస్థితి ఎలా?




**నెన్నెల, జూలై 12 (జనం సాక్షి) :** నెన్నెల మండలంలో కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లు దెబ్బతిని, నీరు నిల్వ ఉండటం, దోమల బెడద పెరగడం, పలుచోట్ల విద్యుత్ అంతరాయాలు ఏర్పడడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, రాకపోకలకు అంతరాయం కలగడం, ఇళ్లలోకి వర్షపు నీరు చేరడం, దోమల ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ చర్యలు, విద్యుత్ వ్యవస్థ పటిష్ఠీకరణపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రామప్పలో 'సండే' సందడి

- రామలింగేశ్వరుడి దర్శనం కోసం పోటెత్తిన భక్త జనం
- శివనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం





**వెంకటాపూర్ (రామప్ప), జూలై 12 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో "సండే "సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో రామలింగేశ్వర స్వామి దర్శన నిమిత్తం ఉద్యోగులు, విద్యార్థులు తమతమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. వారు ముందుగా రామప్ప దేవాలయం లోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది.కాగా, వారికి దేవాలయ అర్చకులు హరిశర్మ, ఉమాశంకర్ స్వామివారి ఆశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా వారికి రామప్ప దేవాలయం విశిష్టత, శిల్పకళ నైపుణ్యం గూర్చి టూరిజం గైడ్లు గోరంటాల విజయ్ కుమార్, తడబోయిన వెంకటేష్ వివరించారు. అనంతరం భక్తులు, పర్యాటకులు రామప్ప చెరువు వద్దకు చేరుకొని చెరువులో బోట్ షికారు చేస్తూ పకృతి అందాలను ఆస్వాదించారు. భక్తులు, పర్యాటకులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం మూలంగా ఆలయ పరిసరాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెంకటాపూర్ చల్లా రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# 26 ఏళ్ల తర్వాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు

- దిలావర్‌పూర్‌లో ఆత్మీయ సమ్మేళనం



**దిలావర్‌పూర్, జూలై 12, (జనం సాక్షి) :** దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999--2000 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక వేదికపైకి చేరారు. పాఠశాల విద్యను పూర్తి చేసుకుని 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో వారు ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు.

**పాత జ్ఞాపకాల మురిపెం.. గురువుల స్మరణ**

చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి దోస్తులను చూసి ఆనందంతో మురిసిపోతూ, పాఠశాల రోజుల్లో జరిగిన రకరకాల సంఘటనలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటూ, తమ పాత మధురాను భూతులను అందరితో పంచుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరిగిన ఈ ఆత్మీయ కలయిక పూర్వ విద్యార్థుల కుటుంబాలలో ఎంతో సంతోషాన్ని నింపింది.

# ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు

- సిఐ మడవి ప్రసాద్
- ప్రజల సంరక్షణ,భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్ ల నిర్వహణ



**ఉట్నూర్ జూలై12(జనం సాక్షి) :** ప్రజల రక్షణ,సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని ఉట్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మడవి ప్రసాద్ తెలిపారు. ఆదివారం రోజున ఉట్నూర్ మండలంలోని ఇంకర్ గూడా గ్రామంలో ఉదయం 30 మంది పోలీసు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా గ్రామంలో మూడున్నర లీటర్ల గుడుంబా రెండు కిరాణా షాపులలో 42 వేల విలువగల లిక్కర్ ఉట్నూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ గ్రామస్థులతో మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, దొంగత నాలు, దోపిడీలు చేయకుండా సత్ప్రవర్తన తో ఉండాలని అన్నారు. దొంగతనాలు చేసేవారి, నేరాలు చేసే వారి సమాచారం పోలీసులకు అందజేయాలని కాలనీకి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ముఖ్యంగా ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. వాహనాలను విథౌట్ నంబర్ ప్లేట్ నడపడం, లైసెన్సు లేకుండా నడపడం చట్టరీత్య నేరంగా పరిగణించబడుతుందని అలాంటి చేయకుండా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు గుంపుల విజయ్,ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్న, మరియు పోలీస్ సిబ్బందిలు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి

- ఏడుగురు అరెస్ట్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు శనివారం సీసీఎస్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో జరుగుతున్న పేకాటపై సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో దాడి చేశారు. నిందితుల వద్ద నుండి 4,850 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని తదుపరి చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఆదిరెడ్డికి అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం



**హనుమకొండ ప్రతినిధి జూలై 12 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డికి ఈ నెల 25, 26 తేదీలలో పుదుచ్చేరిలో నిర్వహించనున్న నాలుగవ అంతర్జాతీయ మహిళా అవార్డుల ప్రధానోత్సవం సందర్భంగా జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అవార్డు స్వీకరించేందుకు ఆహ్వానం అందినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి సదస్సులో కళాశాల అధ్యాపకుడు పాల్గొనడం కళాశాలతో పాటు కాకతీయ విశ్వ విద్యాలయానికి గర్వ కారణమని అన్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధనా పత్రం (బెస్ట్ పేపర్) అవార్డు అందుకున్న డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి విద్యా, పరిశోధన, జర్నలిజం, పౌర సంబంధాల రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పుదుచ్చేరి అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అవార్డు స్వీకరించనున్న సందర్భంగా ఆయనకు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# 13న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

- 1 నుంచి 19వయస్సు గల ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ ప్రతినిధి జులై 12 (జనం సాక్షి) :జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూలై 13 సోమవారం జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వైద్య, విద్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 2,08,441 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నులి పురుగుల సంక్రమణను నివారించేందుకు భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఎల్లప్పుడూ చెప్పులు ధరించడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను శుభ్రంగా కడిగి వినియోగించడం, వేడి వేడి, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండడం వంటి పరిశుభ్రత అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించి, జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ విజ్ఞప్తి చేశారు.

# జీడిగడ్డ తండా గ్రామంలో 7 మేకల చోరీ



**చెన్నారావుపేట, జూలై 12 ( జనం సాక్షి):** ఏడు మేకలు చోరీకి గురైన సంఘటన మండలంలోని జీడిగడ్డ తండా గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. తండావాసుల కథనం ప్రకారం... ఇదే జీడిగడ్డ తండా గ్రామానికి చెందిన భూక్య వీరు రోజువారి మాదిరిగానే శనివారం పొద్దంతా తాను పెంచి పోషిస్తున్న మేకలను మేతకు తీసుకువెళ్లి సాయంత్రం ఇంటికి తీసుకువచ్చి తాళ్ల సహాయంతో ఇంటిముందు కట్టేశాడు. గుర్తుతెలియని దొంగలు శనివారం అర్ధరాత్రి సమయంలో కట్టేసిన తాళ్లను కట్ చేసుకుని 7 మేకలను దొంగిలించుకుపోయారు. ఉదయం లేచి చూసేసరికి ఏడు మేకలు లేకపోవడంతో వెంటనే స్థానిక చెన్నారావుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి బాధితుడి నుండి వివరాలను సేకరించుకుపోయారు.

# సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాగ్‌లు వద్దు

- పర్యావరణ హిత పేపర్ బ్యాగ్ లు ముద్దు



**నడి కూడ జూలై 12 (జనం సాక్షి) :** జాతీయ పేపర్ బ్యాగ్ దినోత్సవం సందర్భంగా, ఆదివారం సెలవు దినం అయినప్పటికీ "పర్యావరణ పరిరక్షణలో మేము సైతం" అనే సందేశంతో ఎంపీయూపీఎస్ ముస్త్యాలపల్లి విద్యార్థులు తమ ఇళ్లలో ఉన్న పాత న్యూస్ పేపర్లతో పర్యావరణ హితమైన క్యారీ బ్యాగ్‌లను తయారుచేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించి, పేపర్ బ్యాగ్‌ల వినియోగాన్ని పెంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యర్థంగా పడేసే పాత వార్తాపత్రికలను పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, వ్యర్థాల నిర్వహణకు కూడా తోడ్పడవచ్చని వారు తెలిపారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ విద్యార్థులను అభినందిస్తూ, చిన్న చిన్న అలవాట్లలో మార్పు తీసుకురావడం ద్వారా పెద్ద పర్యావరణ మార్పుకు నాంది పలకవచ్చని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగ్‌లను ఉపయోగించాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా ఎంపీయూపీఎస్ ముస్త్యాలపల్లి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు.

# మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- జీవన జ్యోతి గ్రామైఖ్య సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



**చెన్నారావుపేట, జూలై 12( జనం సాక్షి):** మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాత మగ్దుంపురం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న జీవన జ్యోతి గ్రామైఖ్య సంఘం భవనానికి శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో మహిళా సంఘాల ద్వారా వేలాది కుటుంబాలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేశాయని గుర్తు చేశారు. అదే సంకల్పంతో ప్రస్తుతం మహిళలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు చిన్న పొదుపులతో ప్రారంభమై నేడు కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేసే శక్తిగా ఎదిగాయని పేర్కొన్నారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని చిన్న వ్యాపారాలు, పాడి పరిశ్రమ, కుట్టు కేంద్రాలు, ఇతర ఉపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామైఖ్య సంఘాలకు సొంత భవనాలు ఏర్పడటం వల్ల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, బ్యాంకు లావాదేవీలు మరియు సంఘ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉప సర్పంచ్ అలువాల శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామైక్య సంఘాల మహిళలు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి జూలై 12 (జనం సాక్షి) :** ఆదివారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల నియోజకవర్గం లోని అర్హులైన లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..45 మంది లబ్ధిదారులకు 20 లక్షల 91900 వేల రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామని అన్నారు.పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు.పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల సీఎంఆర్ ఎఫ్ చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సకాలంలో లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నడికుడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు సీఎం సహాయనిధి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- 100% పూర్తయిన ఏన్యుమరేషన్ ఫారాల పంపిణీ
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, జూలై 12 ( జనం సాక్షి) :** వరంగల్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, ధృవీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలోని నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 7,76,953 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు 100 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 2,99,149 ఫారాలు (38.50 శాతం) డిజిటలైజేషన్ పూర్తికాగా, మిగిలిన ఫారాలను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నర్సంపేట నియోజకవర్గంలో 54.23 శాతం, వరంగల్ ఈస్ట్‌లో 26.25 శాతం, వర్ధన్నపేటలో 36.37 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించుటకు వివిధ మండలాల ప్రత్యేక అధికారులకు ఎస్ఐఆర్ నిర్వహణపై పర్యవేక్షణ అధికారులుగా బాధ్యతలు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు కూడా సహకరించాలని, బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలు అందించి ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజలను కోరారు . జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
13 జూలై 2026

# విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల బ్యూరో, జూలై 12 (జనం సాక్షి) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంయుక్తంగా కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించిన భూమి గతంలో రైతులకు చెందినదని, భూమి కేటాయింపులో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నిరంతర కృషితో రాష్ట్ర ప్రభుత్వం వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలోని ఐదు ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిందన్నారు. ఈ భూమి కేటాయింపునకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేయాలని కోరారు. విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, జగిత్యాల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గానికి కూడా మరిన్ని విద్యాసంస్థలు తీసుకురావాలని ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కోరారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్యా సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ, 1983లో కేవలం 20 కేంద్రీయ విద్యాలయాలతో ప్రారంభమైన వ్యవస్థ ప్రస్తుతం దేశ, విదేశాలలో 1,289 కేంద్రీయ విద్యాలయాలకు విస్తరించిందన్నారు. ప్రస్తుతం 13,51,446 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, 42,661 మంది బోధనా సిబ్బంది, సుమారు ఐదు వేల మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణకు మొత్తం 39 కేంద్రీయ విద్యాలయాలు



మంజూరు కాగా, ప్రస్తుతం 37 పాఠశాలలు పనిచేస్తున్నాయని చెప్పారు.

కేంద్రీయ విద్యాలయాలు నాణ్యమైన, అందుబాటు విద్యకు ప్రతీకలని పేర్కొంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సైన్యం, వాయుసేన, నౌకాదళం, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రాధాన్యతతో పాటు స్థానిక విద్యార్థులకు కూడా ప్రవేశాల్లో అవకాశం ఉంటుందని వివరించారు. రష్యా, నేపాల్, ఇరాన్ వంటి దేశాల్లో కూడా కేంద్రీయ విద్యాలయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆస్ట్రోనాట్ రాకేష్ శర్మ, ప్రముఖ జర్నలిస్టు అర్నబ్ గోస్వామి, సినీనటి ఐశ్వర్య రాయ్ తదితర ప్రముఖులు కేంద్రీయ విద్యాలయాల్లోనే చదువుకున్నారని గుర్తు చేశారు. జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సైనిక్ స్కూల్ ఏర్పాటుతో పాటు జగిత్యాలకు కృషి విజ్ఞాన కేంద్రాన్ని తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. మంచి స్థలంలో కేంద్రీయ విద్యాలయానికి ఐదు ఎకరాలు కేటాయించిన ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్రీయ విద్యాలయానికి మరో ఐదు ఎకరాల భూమి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ఎంపీ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో సైనిక్ స్కూల్‌ను కూడా మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి విద్యా సంస్కరణలను అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, మిగిలిన సమయంలో ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఈ విద్యాసంస్థను తీసుకురావడానికి నిరంతరం కృషి చేశానని తెలిపారు. జగిత్యాల పరిసర ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం తదితర విద్యాసంస్థలు ఒకే ప్రాంతంలో ఏర్పాటు కానున్నాయని చెప్పారు. వాలంతరీ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సహజ వ్యవసాయంపై మళ్లీ పరిశోధనలు ప్రారంభించి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎంపీ అరవింద్ చేసిన కృషి అభినందనీయమన్నారు. తెలంగాణను విద్యారంగంలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ మోడల్ స్కూల్స్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి అనేక విద్యా కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలు, ఇతర సౌకర్యాల వ్యయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం గణనీయంగా పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, చలగల్ గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్, జగిత్యాల ఆర్.డి.ఓ. మధుసూదన్ ఇతర ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న ధర్మారెడ్డిపల్లి కాలువకు సాగునీటిని అందిస్తాం

- ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి కరస్పాండెంట్, జులై 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రామన్నపేట పట్టణ కేంద్రంలో 274.79 కోట్ల వ్యయంతో చేపట్టనున్న చిట్యాల-భువనగిరి ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి శంకుస్థాపన చేయడం జరిగింది. శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా అమలవుతున్నాయని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రహదారులు, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని తెలిపారు. రూ.274.79 కోట్లతో మూడు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం భువనగిరి నియోజకవర్గ అభివృద్ధిలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ నెల 17వ తేదీన ధర్మారెడ్డి కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగునీరు అందించి వారి కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా వలిగొండ - వెలివర్తి రహదారి వెడల్పు, పోచంపల్లి--చౌటుప్పల్ రహదారి, బీబీనగర్ - వెంకిర్యాల రహదారి, చిన్నారావుపల్లి--వెంకిర్యాల రహదారి, రేపాక - వీరవెల్లి - యాదాద్రి రహదారి అభివృద్ధి పనులను కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- ఏబీవీపీ డిమాండ్




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 12 (జనంసాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాగర్‌కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మొక్తాల శాంతన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యను ప్రాథమిక హక్కుగా, సామాజిక సమానత్వానికి పునాదిగా భావించాల్సిన ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనబెట్టి నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల కళాశాలల బందుకు పిలుపునివ్వడం జరిగిందని అందులో భాగంగానే నాగర్ కర్నూల్ జిల్లాలో కూడా కళాశాల బందు నిర్వహిస్తున్నామని కావున కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల పేరుతో ఒత్తిడి తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు తమ చదువును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగానికి ఇచ్చిన హామీలు అమలులో కనిపించడం లేదని ఏబీవీపీ నాయకులు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అవసరమైన చొరవ చూపడంలో విఫలమైందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక అంశాలపై ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, ఖాళీ అధ్యాపక పోస్టులు, సరైన మౌలిక వసతుల లేమి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ లేకపోవడం వల్ల ఉన్నత విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీని వల్ల వారి చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను కేవలం పరిపాలనా అంశాలుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ ప్రాధాన్యత అంశాలుగా ప్రభుత్వం పరిగణించాలని సూచించారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఏబీవీపీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సమాజంతో కలిసి ఏబీవీపీ మరింత ఉద్ధృత ఉద్యమాలను చేపడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్, నగర సంయుక్త కార్యదర్శి శివ, జీవన్, విష్ణు, శివతో పాటు పలువురు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# వంగపల్లి వేదికగా రూ.358 కోట్ల విలువైన హ్యామ్ పథకం

**యాదగిరిగుట్ట, జూలై 12 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ వద్ద సుమారు రూ.358 కోట్ల నిధులతో హ్యామ్ (హామీ) పథకం కింద చేపట్టనున్న పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడి ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, వ్యాపార వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు రాయగిరి నుండి వంగపల్లి గ్రామం వరకు దాదాపు వెయ్యి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో వాహనాలు, కార్యకర్తలు పాల్గొనడంతో మొత్తం మార్గం కాంగ్రెస్ పార్టీ జెండాలతో, నినాదాలతో మారుమోగింది. ప్రజలు రహదారుల వెంట నిలబడి నాయకులకు ఘన స్వాగతం పలికారు. ర్యాలీ అనంతరం వంగపల్లి గ్రామానికి చేరుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకి మరియు ఇతర ప్రజాప్రతినిధులకు స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, పూల వర్షం మధ్య నాయకులను సభా వేదిక వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు.

అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రహదారుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తూ మౌలిక



వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మరిన్ని అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ శ్రేణులు, అధికారులు, మహిళలు, యువకులు, రైతులు, వేలాది మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాలలంతా ఐక్యంగా ఉండాలి

- నేను ఉద్యమించేందుకు సిద్ధం
- మాల, ఉప కులాల మహార్యాలీలో మంత్రి వివేక్ వెంకటస్వామి

**భద్రాచలం, జూలై 12 (జనంసాక్షి) :** మాల జాతికి అన్యాయం జరిగితే మాకు పదవులు ముఖ్యం కాదు, మీ కోసం నేను ప్రభుత్వంతో కొట్లాడేందుకైనా సిద్ధమేనని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం భద్రాచలంలో మాల, మాల ఉప కులాల మహార్యాలీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాలలంతా ఐక్యంగా ఉండాలని, చిన్న చిన్న గ్రూపులుగా ఉంటే బలహీనపడతామని అన్నారు. మీకున్న సమస్యలను నా దృష్టికి తెస్తే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మాల ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి మాలల హక్కుల సాధనకై ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. మాలలకు




రాజ్యాంగం ప్రకారం ఐదు శాతం వాటా ఉంటే ఉప కులాలకు చెందిన గ్రూపుల్లో రెండున్నర శాతం వాటా మాత్రమే వస్తోందన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను మాత్రమే అమలు చేస్తోందని కాని ఉమ్మడి రాష్ట్రంలో దామాషా పద్ధతిలో విభజన జరిగిందన్నారు. షమీమ్ అఖ్తర్ నివేదికను అమలు చేయాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రితో మాలలకు జరిగిన అన్యాయంపై మాట్లాడటం జరిగిందని, క్యాబినేట్ సబ్ కమిటీలో సైతం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మాలల జనాభా ఎక్కువైనా మాకందే ప్రయోజనాలు మాత్రం అంతంత మాత్రమేనన్నారు. రోస్టర్ విధానంలో మార్పుల వలన తీవ్ర నష్టం జరుగుతోందని ఉద్యోగాలు, ప్రమోషన్లలోనూ నష్టోతున్నామన్నారు. మాలల హక్కులను కాలరాసే విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ, అల్లాడి పౌల్‌రాజు, చింతిర్యాల రవికుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు

- సింగరేణి ఆర్జీ.వన్ జీఏం లలిత్ కుమార్

**గోదావరిఖని, జూలై 12 (జనంసాక్షి) :** రామగుండం ఏరియా-1లో తాడిచర్ల--2 బ్లాక్ సాధన విజయోత్సవాలు ఘనంగా చేపట్టారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల సందర్భంగా రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే-1,3 ఇంక్లైన్ గనిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా జియం డి లలిత్ కుమారు మాట్లాడుతూ, తాడిచర్ల-2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని జియం పేర్కొన్నారు., ఈ విజయోత్సవం మన సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రామగుండం ఏరియా -1 జీఎం కార్యాలయం, అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో తాడిచర్ల--2 బ్లాక్ కేటాయింపు విజయోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ స్వీట్లు పంపిణీ చేసి తాడిచర్ల-




2 బ్లాక్ సాధన పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తూ, తాడిచర్ల - 2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు, మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమానికి హాజరైన అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమములో రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజోయ్ మజుందార్, యస్. ఓ టు జియం చంద్ర శేఖర్, గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటి జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, జిడికే 1 గ్రుఫ్ ఏజంట్ యల్ రమేష్, 11 గ్రూప్ ఏజంట్ చిలుక శ్రీనివాస్, జీడీకే ఓసి.5 పివో రమేష్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ళ శ్రీనివాస్, సీనియర్ పివో హనుమంతరావు, జియం ఆఫీస్ ఇంచార్జ్ రాజు, జీఎం కార్యాలయం ఉద్యోగులు, ఆర్జీ.1 లోని జిడీకే 1,2,2ఏ,11 ఇంక్లైన్ గనులు, ఓసి.5, అన్ని విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**వలిగొండ, జూలై 12 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువులు, విత్తనాల షాప్ ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. ప్రస్తుతం షాప్ లో యూరియా, డి ఏ పి ఎంత స్టాక్ ఉంది. రైతులకు ఎంత కొనుగోలు చేసారు అని అడిగారు. రైతులకు డైరెక్ట్ గా వచ్చి కొనుగోలు చేస్తున్నారా లేక ఫర్టిలైజర్ అప్ లో బుక్ చేసుకున్న వారికి అమ్ముతున్నారా అని అప్ లో చెక్ చేసారు. ఈ సీజన్ లో రైతులు ఎక్కువగా ఏ పంట సాగు చేయడానికి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఎల్ నీనో ఎఫెక్ట్ ఉంది కాబట్టి వరి కాకుండా పత్తి, కందులు వంటి పంటలు సాగు చేసేలా రైతులకి అవగాహనా కలిపించాలి అని అగ్రికల్చర్ అధికారికి సూచించారు. అనంతరం మండలంలో ని నాగారం గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న ప్రక్రియ ని పరిశీలించారు. వాళ్ళు ఎలా చేస్తున్నారు. ఒక్కో ఫారం ఫిల్ చేయడానికి ఎంత సమయం పడుతుంది.. ఒక్కో టీం కి ఎన్ని ఇండ్లు ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్ని పూర్తి చేసారు అని అడిగి తెలుసుకున్నారు. బయటి రాష్ట్ర ల నుండి వచ్చిన ఇక్కడ ఉన్న వారి వివరాలు ఎలా సేకరిస్తున్నారు అని అడిగారు. ప్రతి ఫారం ని జాగ్రత్త గా నింపాలి అన్నారు. ఈ తనిఖీలు ఎంఆర్ఓ దశరథ, అగ్రికల్చర్ ఆఫీసర్ అంజనీదేవి తదితరులు ఉన్నారు.




# ఎయిర్‌టెల్ మనీ, క్లౌడ్, డేటా సెంటర్లపై ఫోకస్

**సునీల్ మిత్తల్**

**న్యూఢిల్లీ:**రానున్న రోజుల్లో ఫైనాన్షియల్ సర్వీసెస్, డేటా సెంటర్స్, క్లౌడ్ సేవల విస్తరణపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ కంపెనీ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తెలిపారు. గత పదేళ్లలో ఎయిర్‌టెల్‌ను బలోపేతం చేసేందుకు మౌలిక సదుపాయాలపై రూ.3.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన వెల్లడించారు. తదుపరి దశ వృద్ధిలో భాగంగా తమ ఫైనాన్షియల్ విభాగమైన ఎయిర్‌టెల్ మనీలో రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామన్నారు. అలాగే, 1 గిగావాట్ సామర్థ్యాన్ని అందుకొనే దిశగా డేటా సెంటర్ల వ్యాపారమైన నెక్స్‌ట్రా (ఔలిబిటీజీ) ఇటీవల రూ.9500 కోట్లు సమీకరించిందని కంపెనీ వార్షిక నివేదికలో మిత్తల్ పంచుకున్నారు. ఎయిర్‌టెల్ క్లౌడ్ ఇప్పటికే ప్రోత్సహకర ఫలితాలను ఇస్తోందని, ఈ సేవలను తక్కువ ధరకే అందిస్తున్నామన్నారు. ఎయిర్‌టెల్ 5జీ కస్టమర్ల బేస్ 18 కోట్లకు చేరిందన్నారు.

## ఎన్ఎస్ఈ నుంచి అహింస సూచీ

**న్యూఢిల్లీ:**నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) అనుబంధ సంస్థ ఎన్ఎస్ఈ ఇండిసిస్ లిమిటెడ్ సరికొత్త సూచీని ఆవిష్కరించింది. దేశంలో నిఫ్టీ 500లోని కంపెనీల్లో, అహింసా సూత్రాలతో పనిచేస్తున్న వాటి ఆధారంగా ఈ సూచీని తీసుకొచ్చారు. జంతు సంక్షేమ లక్ష్యంతో, వ్యాపార విధానాలు అవలంబించే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టదలచే మదుపర్ల కోసం దీనిని సృష్టించారు. అహింస ఇన్వెస్ట్‌మెంట్ మూవ్‌మెంట్ (ఏఐఎమ్) కింద అహింస గెయిన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ సూచీలోకి అర్హత గల కంపెనీలను గుర్తించడానికి నైతికత పరిశీలన ప్రక్రియ వినియోగిస్తారు. సాధారణంగా కంపెనీలు తయారు చేసే ఉత్పత్తులు, సేవలు, మొత్తం వ్యాపార ధోరణుల ఆధారంగా గ్రీన్, ఆరెంజ్, రెడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరిస్తారు. కేవలం గ్రీన్ విభాగ కంపెనీలకే సూచీలో చేరడానికి అర్హత ఉంటుంది. 2016 ఏప్రిల్ 1 ప్రాతిపదిక తేదీతో, 1000 పాయింట్ల ప్రాతిపదిక విలువతో తీసుకొచ్చే ఈ సూచీలోని షేర్ల వెయిటేజీని ఫ్రీఫ్లోట్ మార్కెట్ విలువ ఆధారంగా నిర్ణయిస్తారు.




# అందరి చూపు ఎస్‌బీఐ పైనే..

- ఎస్‌బీఐ ఫండ్స్‌పైనే చూపంతా
- ఈ వారం 2 ఐపీఓలు..

**న్యూఢిల్లీ:**దేశీయ ప్రైమరీ మార్కెట్ మళ్లీ జోరందుకుంటోంది. ఈ వారమూ మెయిన్‌బోర్డు కేటగిరీలో రెండు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతన్నాయి. ఇందులో ఎస్‌బీఐ అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ అతిపెద్ద ఐపీఓపై ఆసక్తి నెలకొంది. దీంతో పాటు గత వారం సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకున్న రెండు కంపెనీలూ ఈ వారం స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓ జులై 14న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. 16న ముగియనుంది. జులై 21న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్ట్ కానుంది. మార్కెట్ నుంచి సుమారు రూ.9,812 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.545-574గా కంపెనీ నిర్ణయించింది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయిస్తున్నాయి.
గుజరాత్‌కు చెందిన టెక్స్‌టైల్ కంపెనీ అల్పైన్ టెక్స్‌వరల్డ్.. మార్కెట్ నుంచి రూ.126 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.100-105గా కంపెనీ నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను కొత్త తయారీ కేంద్రం ఏర్పాటుకు కంపెనీ వినియోగించనుంది. మిల్లివర్స్ టెక్నాలజీస్ అనే మరో సంస్థ ఎస్ఎంఈ కేటగిరీలో రూ.160.3 కట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.315-331గా కంపెనీ నిర్ణయించింది. ఎస్‌బీఐ ఫండ్స్ ఎఖూకు అప్లయ్ చేస్తున్నారా?.. 10 కీలక పాయింట్లు టెక్నికల్ టెక్స్‌టైల్స్ తయారుచేసే కుసుమఘర్ సంస్థ షేర్లు జులై 15న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. జులై 8 నుంచి 10 మధ్య సబ్‌స్క్రిప్షన్ వచ్చిన ఈ కంపెనీ 128.85 రెట్లు బిడ్లు అందుకుంది. దీంతో లిస్టింగ్‌పై ఆసక్తి నెలకొంది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.398-419గా నిర్ణయించింది.లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా షేర్లు జులై 16న స్టాక్ మార్కెట్ లిస్ట్‌కానున్నాయి. జులై 13 వరకు సబ్‌స్క్రిప్షన్ పూర్తి కానుంది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.203-214గా కంపెనీ నిర్ణయించింది. ఈ రెండూ కాకుండా డెవ్సన్ కాటలిస్, హ్యాపీ స్టీల్ ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో లిస్టింగ్‌కు రానున్నాయి.




## మెటా మ్యూజ్ ఇమేజ్ ఉపసంహరణ

**న్యూఢిల్లీ:**ఇన్‌స్టాగ్రామ్‌లోని ఫొటోల సాయంతో ఫేక్ ఇమేజెస్ సృష్టించేందుకు వీలుగా ఉందనే ఆందోళనలు వెల్లువెత్తడంతో, అధునాతన ఏఐ ఇమేజ్ జనరేటర్ 'మ్యూజ్ ఇమేజ్'ను ఉపసంహరిస్తున్నట్లు మెటా ప్రకటించింది. మెటా సూపర్‌ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ అభివృద్ధి చేసిన తొలి మీడియా జనరేషన్ మోడల్ ఇది. ఈ ఏఐ టూల్ వల్ల డేటా గోప్యత, ఇమేజ్-స్క్రాపింగ్, అనుమతుల విషయంలో వినియోగదార్ల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏమైందంటే: మెటా మ్యూజ్‌లో ఉన్న ఫీచరు సాయంతో.. పబ్లిక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లోని ఫొటోలను తీసుకుని, ఏఐ చిత్రాలను వినియోగదార్లు సృష్టించగలరు. ఇందువల్ల ఎవరో తయారు చేసే ఏఐ జనరేటెడ్ చిత్రాల్లో.. మన అనుమతి లేకుండానే, మన ముఖాలు కనిపించే అవకాశం ఉంది. ఏఐ జెనరేటెడ్ అని వాటర్‌మార్క్ వేస్తామని మెటా చెబుతున్నా కూడా, గోప్యత విషయంలో వినియోగదార్లు ఆందోళన చెందడంతో చివరకు మెటా దిగి వచ్చింది. ఈ టూల్‌ను ఉపసంహరిస్తున్నట్లు శనివారం ప్రకటించింది.




## అత్యంత శక్తిమంత మహిళ నీతా అంబానీ

**న్యూఢిల్లీ:**ఫార్చ్యూన్ ఇండియా అత్యంత శక్తిమంత మహిళల జాబితా 2026లో రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న 100 మంది మహిళలతో ఈ జాబితాను ఫార్చ్యూన్ ఇండియా రూపొందించింది. రెండో స్థానంలో రోష్నినాడార్, 3వ స్థానంలో అపోలో హాస్పిటల్ నిర్వాహకులు 4వ స్థానంలో ఓపీ జిందాల్ గ్రూప్ గౌరవ ఛైర్‌పర్సన్ సావిత్రి జిందాల్, 5వ స్థానంలో అదానీ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ప్రీతి జి అదానీ, 6వ స్థానంలో బయోకాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, 7వ స్థానంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈడీ ఈశా అంబానీ, 8వ స్థానంలో హిందుస్థాన్ యునిలీవర్ ఎండీ ప్రియా నాయర్, 9వ స్థానంలో నెట్‌ఫ్లిక్స్ ఎగ్జిక్యూటివ్ బేలా బజారియా, 10వ స్థానంలో ఫ్యాషన్ ఉత్పత్తుల సంస్థ ఛానల్ సీఈఓ లీనా నాయర్ ఉన్నారు.

## ఈవీ విడిభాగాల మార్కెట్

**2032 కల్లా ఎనిమిదింతలు: సీఈఎస్**

**న్యూఢిల్లీ:**భారత విద్యుత్ వాహన(ఈవీ) విడిభాగాల విపణి, 2032 కల్లా ప్రస్తుతం కంటే ఎనిమిదింతలు పెరిగి రూ.3.55 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఒక నివేదిక అంచనా వేసింది. 2025లో ఈ విపణి విలువ రూ.41,000 కోట్లుగా పేర్కొంది. ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్, కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ (సీఈఎస్) రూపొందించిన నివేదికను ఇండియా ఎనర్జీ స్టోరేజ్ వీక్ 2026లో విడుదల చేశారు. దీని ప్రకారం భారత పారిశ్రామిక, స్వచ్ఛ మొబిలిటీ లక్ష్యాల సాధనలో ఈవీ విడిభాగాల వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. దేశీయ సరఫరా వ్యవస్థ బలోపేతం అయితే స్వచ్ఛ మొబిలిటీ విజయవంతం అవుతుంది. 2025లో బ్యాటరీ ప్యాక్‌లే విడిభాగాల మార్కెట్లో సగానికి పైగా వాటా ఆక్రమించాయి. మోటార్లు, ఇన్వర్టర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ కూడా ఎంచదగ్గ పాత్ర పోషించాయి. ఈవీల తయారీదార్లు(ఓఈఎమ్‌లు) తమ డ్రైవ్‌ట్రెయిన్‌లను ఏకీకరణ చేయడం పెంచగా, ఇతర పరిశ్రమలు అధునాతన ఉప వ్యవస్థల్లో పెట్టుబడులు పెంచడంతో విడిభాగాల మార్కెట్లో ఇన్వర్టర్లు, బ్యాటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థ(బీఎమ్ఎస్)ల వాటా వేగంగా పెరుగుతోంది. బ్యాటరీ ప్యాక్‌లు, ఇన్వర్టర్ల వాటాయే ఈవీ వ్యయాల్లో 60% పైగా ఉందని నివేదిక తెలిపింది. భారత ఈవీ మార్కెట్లో వేగం పెరుగుతుండడం, టెక్నాలజీ, తయారీ విషయంలో ప్రపంచానికి నేతృత్వం వహించడానికి దేశ సంసిద్ధతను ప్రతిబింబిస్తోంది. వ్యూహాత్మక పెట్టుబడుల కారణంగా అంతర్జాతీయ ఈవీ వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకోగలదు. 2025-32 మధ్య 38% సీఏజీఆర్‌తో భారత ఈవీ విడిభాగాల మార్కెట్ వృద్ధి చెందే అవకాశం కనిపిస్తోంది. ఆర్ అండ్ డీ, తయారీ, సరఫరాలో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలకు ఇది మంచి అవకాశాన్ని అందించనుంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,53,140 (22 క్యారెట్లు) | ₹ 1,67,064 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

# 'ఉడాన్' ఊపందుకోవాలంటే..


**న్యూఢిల్లీ:**దేశంలోని చిన్న నగరాలకూ విమాన సర్వీసులు నిర్వహించేందుకు తొమ్మిదేళ్ల కిందట తీసుకొచ్చిన ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగ్‌రిక్) పథకం రెండోదశను (వికసిత్ ఉడాన్) రూ.29,000 కోట్లతో చేపడుతున్నట్లు కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. విమాన సేవలు లేని మరిన్ని ప్రాంతాలను రాబోయే పదేళ్లలో కొత్తగా జతచేయాలన్నది ప్రణాళిక. 100 అదనపు ఏరోడ్రోమ్‌లను రూ.12,000 కోట్లతో అభివృద్ధి చేస్తారు. 200 హెలిప్యాడ్‌లను నిర్మించడం, ప్రాంతీయ విమానయాన సంస్థల కార్యకలాపాల కోసం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కొనసాగించడంతో పాటు చిన్న విమానాశ్రయాల నిర్వహణకూ మద్దతు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. 2016లో ప్రారంభమైన ఉడాన్ పథకం కింద 669 మార్గాలను ప్రకటించినా, అందులో సగం మేరే కార్యకలాపాలు సాగిస్తున్నాయని అంచనా. 95 విమానాశ్రయాలు, హెలిపోర్ట్‌లు, వాటర్ ఏరోడ్రోమ్‌లను అనుసంధానించడం ద్వారా 1.66 కోట్ల మందికి పైగా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరిందని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ఉడాన్ పథకంలో అత్యంత కీలకమైంది వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్). చిన్న నగరాలకు నిర్వహించే విమాన సర్వీసుల వల్ల కంపెనీలకు నష్టం వస్తే, ఈ పథకం కింద కేటాయించిన నిధులతో సాయం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు స్పష్టంగా లేకపోవడం వల్లే, విమానయాన కంపెనీలకు నష్టం వాటిల్లుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఏయే మార్గాల్లో, ఎంత కంటే ఆక్యుపెన్సీ (సీట్ల భర్తీ) తగ్గితే, ఎంత మేర వీజీఎఫ్ అందిస్తారో తెలియడంలేదు. ఇందుకు విమానాల నిర్వహణ వ్యయాలు సంక్లిష్టంగా ఉండటమే కారణం.ఏ వస్తువు అయినా తయారీ వ్యయం, మార్కెటింగ్ ఖర్చులు, మార్జిన్లు కలుపుకుని.. ఎంతకు విక్రయిస్తే లాభం వస్తుందో నిర్ణయించుకుని, ధర ఖరారు చేస్తారు. విమానాలకు వచ్చేసరికి ఇది ఎంతో సంక్లిష్టంగా ఉంటుంది. చిన్న/పెద్ద విమానాలు, సీట్ల భర్తీ, ఎంత దూరం ప్రయాణిస్తున్నాయి అనే అంశాలతో పాటు ఆయా సంస్థలు ఎన్ని విమానాలు నిర్వహిస్తున్నాయనే అంశాలు, విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర, డాలర్ మారకపు విలువ ఆధారంగా విమానయాన కంపెనీలకు వ్యయాలు అవుతుంటాయి. దీని ఆధారంగా టికెట్ ధరలను నిర్ణయించుకుంటే ఫరవాలేదు. అయితే రద్దీ మార్గాల్లో పెద్ద సంస్థలకు దీటుగా ఛార్జీ ఉండకపోతే, చిన్న సంస్థలకు ఆదరణ ఉండదు. చిన్న నగరాలకు విమానాలు నడిపినప్పుడు సంభవించే నష్టాలపై, వీజీఎఫ్ గణనలో కంపెనీలకు, విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ అంచనాలకు తేడా ఎక్కువగా ఉంటోంది. ఆయా విమానాలు కొత్తవా, పాతవా అనేదీ చూడాల్సి ఉంటుంది. సీట్ల భర్తీ 50-60% కంటే తక్కువగా ఉంటే, వీజీఎఫ్ ఇస్తామన్నా.. అందుకే కంపెనీలు నిలబడలేకపోతున్నాయి. చిన్న నగరాల్లో కొత్త విమానాశ్రయం నిర్మించి, అక్కడకు సర్వీసులు నడపమంటే.. వ్యయాల దృష్ట్యా కొత్త కంపెనీలకు సాధ్యం కాకపోవచ్చు. అధిక విమానాలున్న అగ్రగామి సంస్థ ఇండిగో లాంటివి కూడా.. లాభాలు వచ్చే మార్గాలకు బదులుగా కొత్త మార్గాలకు విమానాలు కేటాయించడం ఎందుకు అనే భావనలో ఉంటున్నాయి. తక్కువ విమానాలు నిర్వహించే సంస్థలకు, ఒక విమాన సర్వీస్ బ్రేక్ ఈవెన్ కావాలంటే 90% సీట్ల భర్తీ ఉండాలన్నది అంచనా.ఇండిగో లాంటి సంస్థల విమానాల్లో 75-80% సీట్లు నిండినా కూడా ఇబ్బంది ఉండదు. దేశంలో చిన్న నగరాలన్నింటికీ విమాన సర్వీసులు నడపాలని ఆకాంక్ష ఉన్నా.. ఆర్థికంగా నిలదొక్కుకునే రూట్లు, తక్కువ నిర్వహణ ఖర్చు, బలమైన కనెక్టివిటీ, స్థిరమైన ప్రయాణికుల డిమాండ్ కలిసొస్తేనే ప్రాంతీయ విమానయానం విజయవంతమవుతుంది. ఆయా ప్రాంతాలకు నిత్యం ఎంతమంది ప్రయాణిస్తారనే అంశం ఆధారంగానే ముందుకెళ్లడం మంచిది. పర్యాటకానికి ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నందున, అటువంటి ప్రాంతాలకు సమీపంలో ఉన్న పట్టణం/నగరాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు, పారిశ్రామికంగా-వాణిజ్య అవసరాల దృష్ట్యా ప్రయాణించే వాటికి ప్రాధాన్యమివ్వాలి. ఆయా విమానాశ్రయాలకు బస్సుల అనుసంధానత కూడా ముఖ్యమే. తక్కువ ఖర్చుతో విమానయానాన్ని అందుబాటులోకి తెద్దామనే భావన ఉన్నప్పుడు, 'విమానాశ్రయాలకు కారు/క్యాబ్‌ల్లో రాలేరా' అనే భావన నుంచి బయట పడితేనే.. ఉడాన్ పథక లక్ష్యం నెరవేరుతుంది. 20-70 సీట్ల విమానాల దేశీయ తయారీకి అడుగులు పడుతున్నాయి. వీటి కొనుగోలు, నిర్వహణకు ప్రత్యేక రాయితీలు ఇస్తే.. మరిన్ని విమానయాన కంపెనీలు రంగంలోకి దిగొచ్చు.



## చిల్లర లేదని 'మంత్రి'నే దిగిపొమ్మన్న కండక్టర్..

- చివరకు అతడితోపాటు డ్రైవర్ కూడా సస్పెన్షన్
- బెంగళూరులో ఆర్టీసీలో ఘటన

**బెంగుళూరు(జనంసాక్షి):**
కర్ణాటక రవాణా శాఖ మంత్రి బైరతి సురేష్.. బెంగళూరులో ఆర్టీసీ బస్సు సేవలపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఎవరూ గుర్తు పట్టకుండా మాస్క్ ధరించిన ఆయన.. సాధారణ ప్రయాణికుడి మాదిరిగా నగరంలో పలు రూట్‌లలో అర్ధరాత్రి ప్రయాణించి రవాణా సేవలను పరిశీలించారు. ఈ క్రమంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ కండక్టర్, మరో డ్రైవర్‌ను సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు.తనిఖీల్లో భాగంగా బస్సు ఎక్కిన మంత్రి.. కండక్టర్‌కు రూ.100 ఇచ్చి రెండు టికెట్లు ఇవ్వమన్నాడు. అయితే, కండక్టర్ మాత్రం తన వద్ద సరిపడా చిల్లర లేదని చెబుతూ బ్యాగును చూపించాడు. అక్కడితో ఆగకుండా, ఒకవేళ చిల్లర లేకుంటే బస్సు దిగి పోవాలని మంత్రికి సూచించాడు.ఓ స్టాప్‌లో ప్రయాణికుడు చేయి ఎత్తి బస్సు ఆపాలని సంజ్ఞ చేసినా, డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లిపోవడాన్ని మంత్రి గమనించారు. క్షేత్రస్థాయిలో ఆర్టీసీ సిబ్బంది తీరును గమనించిన ఆయన.. ఓ కండక్టర్, ఓ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.





## ఖాన్ మార్కెట్లో అద్దెలు హాట్ గురూ

- ఏప్రిల్-జూన్‌లో 9% పైకి
- చదరపు అడుగుకు రూ.1700-1800
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

**న్యూఢిల్లీ:**దిల్లీలోని ఖాన్‌మార్కెట్లో నెలవారీ అద్దెలు సరికొత్త గరిష్ఠాలకు చేరుతున్నాయి. 2025 ఇదే కాలంతో పోలిస్తే, ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో అద్దెలు 9% పెరిగాయి. సరఫరా ఆటంకాల మధ్య గిరాకీ మెరుగవడం ఇందుకు నేపథ్యమని స్థిరాస్తి కన్సల్టింగ్ సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ (సీ అండ్ డబ్ల్యూ) అంటోంది. ఈ కంపెనీ అందించిన సమాచారం ప్రకారం.. దిల్లీ-ఎన్‌సీఆర్‌లోని ప్రధాన వీధుల్లో నెల వారీ అద్దె 2-10% పెరిగింది. సౌత్ ఎక్స్‌టెన్షన్ 1, 2లో అత్యధికంగా 10% వృద్ధి కనబడింది. ఇక్కడ చదరపు అడుగుకు అద్దె రూ.850-900కు చేరింది. గలేరియా మార్కెట్, కనాట్ ప్లేస్‌లలో వరుసగా 4%, 2% మేర వృద్ధి నమోదైంది. నెలవారీ అద్దె చ.అడుగుకు కనాట్ ప్లేస్ (ఇన్నర్ సర్కిల్)లో రూ.1250-1300, గలేరియా మార్కెట్‌లో రూ.1250-1350గా పలికాయి.ఖాన్ మార్కెట్లో అద్దె ఏప్రిల్-జూన్‌లో చదరపు అడుగుకు రూ.1700-1800గా పలికింది. కమలా నగర్ మార్కెట్‌లో మాత్రం అద్దెల్లో (చ.అ.కు రూ.490-510) పెద్దగా మార్పు లేదు.గ్రేటర్ కైలాష్, ఎమ్ బ్లాక్‌లో అద్దె 2% పెరిగి రూ.490-510కి, రాజౌరి గార్డెన్‌లో 2% వృద్ధితో రూ.260-270కి, పంజాబీ బాఘ్‌లో 4% పెరిగి రూ.275-285కు చేరింది. నోయిడా సెక్టార్ 18లో 5% వృద్ధితో నెలవారీ అద్దె చ.అ.కు రూ.201-230కి చేరింది. గురుగ్రామ్ సెక్టార్ 29లో 3% పెరిగి రూ.180-200గా పలికింది.

## క్రెడిట్ కార్డ్ వినియోగం ఇంకా తక్కువే

**సిబిల్ నివేదిక**

రుణ చెల్లింపుల్లో క్రమశిక్షణ మెరుగుపడటం లాంటి సానుకూల అంశాలున్నప్పటికీ.. మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం తక్కువగానే ఉందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ఎండీ భావేశ్ జైన్ తెలిపారు. 'రుణ వ్యవస్థలో క్రెడిట్ కార్డుల వాటా తగ్గింది. గతేడాది ఇదే కాలంలో కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకున్న వారిలో 26% మందికి అంతకుముందు రుణ చరిత్ర లేదు. కానీ ఇప్పుడు ఆ సంఖ్య 8 శాతానికి పడిపోయింద'ని వివరించారు. భారత్‌లో సుమారు 5.2 కోట్ల మందికి క్రెడిట్ కార్డులున్నాయి. వివిధ రకాల రుణ సేవలు పొందుతున్న సుమారు 25 కోట్ల మందిలో ఈ సంఖ్య 25 శాతమేనని తెలిపారు. సిబిల్ రూపొందించిన ఒక నివేదిక ప్రకారం..

**హాంకాంగ్‌లో 98%:**సాధారణంగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో క్రెడిట్ కార్డులను ఉపయోగించే వారి నిష్పత్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ నిష్పత్తి కొలంబియాలో 62%, హాంకాంగ్‌లో 98%, అమెరికాలో 81%, యూకేలో 70 శాతంగా ఉంది. వినియోగ అవసరాలకు ఎక్కువగా వాడే క్రెడిట్ కార్డులు, పూచీకత్తు లేని రుణ ఉత్పత్తుల విభాగంలో చూస్తే క్రెడిట్‌కార్డులు దేశీయంగా తమ ఆధిపత్యాన్ని కోల్పోయాయి. వ్యక్తిగత రుణాలు, యూపీఐ వంటి ప్రత్యామ్నాయాలతో ఇవి పోటీపడాల్సి వస్తుంది. ప్రస్తుతం వినియోగదార్లు వీసా, మాస్టర్ కార్డ్, ఇతర నెట్‌వర్క్‌ల క్రెడిట్ కార్డులను యూపీఐ యాప్‌లకు అనుసంధానించలేకపోతున్నారు. దీనివల్ల వినియోగం కేవలం ప్రభుత్వం ప్రోత్సహించే రూపే కార్డులకే పరిమితమవుతోంది. గత దశాబ్ద కాలంలో క్రెడిట్ కార్డుల బకాయిలు 8.3 రెట్లు పెరిగి రూ.3.1 లక్షల కోట్లకు చేరాయి. కార్డులు కలిగి ఉన్న వినియోగదార్ల సంఖ్య 3.6 రెట్లు పెరిగి 5.2 కోట్లకు, మొత్తం కార్డుల సంఖ్య 5.1 రెట్లు పెరిగి 10.7 కోట్లకు చేరింది. 3 లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ కార్డులు కలిగి ఉన్న వారి సంఖ్య దశాబ్దక్రితం ఉన్న 12% నుంచి 22 శాతానికి పెరిగింది. వినియోగ రుణాల్లో క్రెడిట్ కార్డుల వాటా 56% నుంచి 38 శాతానికి తగ్గిందని నివేదిక పేర్కొంది.

## ఆర్థిక సేవల వినియోగంలో దక్షిణాది భేష్

**పీడబ్ల్యూసీ ఇండియా సర్వే**

దిల్లీ: కేవలం డిజిటల్ మార్గాల్లో ఉన్న వారితో పోలిస్తే.. భౌతిక, డిజిటల్ (ఫిజిటల్) ఆర్థిక మార్గాలను ఎంచుకున్న కుటుంబాలు ఆర్థికంగా బలంగా ఉన్నాయని పీడబ్ల్యూసీ ఇండియా సర్వే చెబుతోంది. ద్వర రీసెర్చ్ ఫౌండేషన్‌తో కలిసి ఏడు రాష్ట్రాల్లోని 18 జిల్లాల్లో 4,000 కుటుంబాలతో చేపట్టిన ఈ సర్వేలోని ముఖ్యాంశాలు..దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న కుటుంబాలు 70% మేర మల్టీ-సర్వీస్ డిజిటల్ ఆర్థిక సేవల (డీఎఫ్ఎస్)ను వినియోగిస్తున్నాయి. మంచి నెట్‌వర్క్‌ను వీరు ఏర్పాటు చేసుకున్నారు. 44% మంది థర్డ్ పార్టీ ప్రొవైడర్ల నుంచి సలహాలు అందుకోగా, 40% మంది సామాజిక సంబంధాల ద్వారా, 13% మంది అధికారిక ఆర్థిక సేవల ప్రొవైడర్ల ద్వారా ఆర్థిక సేవలను పొందుతున్నారు.దేశ పశ్చిమ భాగంలో 95% మంది డీఎఫ్ఎస్‌ను పొందుతున్నా, అందులో 65% మంది రుణ వినియోగదార్లకు ఏదో ఒక సందర్భంలో నిరాకరణ ఎదురైంది. ఉత్తర భారత్‌లో అధికులు ఆర్థిక సేవలకు దూరంగా ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కొరత ఉంది. నడిచి వెళ్లే దూరంలో 40% మందికి సేవల లభ్యత లేదు. కొత్త వినియోగదార్లు ఆర్థిక సేవలను పొందే విషయంలో తక్కువ నమ్మకాన్ని కనబరుస్తున్నారు.తూర్పు భారత్‌లో అయితే 37% మంది ఎన్నడూ ఆర్థిక సలహాలను కోరలేదు. 23% మంది కోరినా, ఎటువంటి స్పందనా లభించలేదు. ఆదాయాల్లో హెచ్చుతగ్గులే ఆర్థిక ఆరోగ్య



# కరీంనగర్ మార్కెట్ యార్డు అభివృద్ధికి కార్యాచరణ

## పాలకవర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు, 11 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం

- ఆధునికీకరణకు కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్ బ్యూరో, జూలై 12 ( జనంసాక్షి) :** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య అధ్యక్షతన ఆదివారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులు, వ్యాపారులు, హమాలీలకు మెరుగైన సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల విస్తరణ, ఆధునికీకరణ చర్యలపై మార్కెట్ చైర్మన్, సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. యార్డు సమగ్ర అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన 11 కీలక అంశాల పై పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానాలు చేసింది.

సమావేశంలో మార్చి , ఏప్రిల్, మే, నెలలకు సంబంధించిన మార్కెట్ కమిటీ ఆదాయ - వ్యయ వివరాలను పరిశీలించి ఆమోదించారు. తెలంగాణ ప్రభుత్వం, హరికృష్ణ మిషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం కోసం ఏర్పాటు చేయనున్న సెంట్రలైజ్డ్ కిచెన్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు సంవత్సరాల ఒప్పందంతో షెడ్డు కేటాయింపు పై నిర్ణయం తీసుకున్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉన్న సీసీ కెమెరాల మరమ్మతులు, నిర్వహణ, మహాత్మా గాంధీ హోల్‌సేల్ వెజిటబుల్ మార్కెట్ పునరుద్ధరణకు మార్కెటింగ్ శాఖ సంచాలకులకు ప్రతిపాదనలు పంపడం, మార్కెట్ యార్డులో అవసరమైన మరమ్మతులు చేపట్టడం, ఫ్రూట్ మార్కెట్‌లో కూలిపోయిన ప్రహరీ గోడ స్థానంలో నూతన గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం, నూతన టాయిలెట్ బ్లాకుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం, మార్కెట్ కమిటీ కార్యాలయానికి కొత్త ఫర్నిచర్ కొనుగోలు, మార్కెట్ కమిటీ కోసం నూతన గోదాముల నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం, మార్కెట్ యార్డు నిర్వహణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించడం, మార్కెట్ కార్యాలయంలో సోలార్ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు, అలాగే ఫ్రూట్ మార్కెట్ యార్డులో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం వంటి అంశాల పై విస్తృతంగా చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను దశలవారీగా అమలు చేసి కరీంనగర్ మార్కెట్ యార్డును ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని సమావేశంలో నిర్ణయించారు. రైతులు, వ్యాపారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని చైర్మన్ ఆకుల నర్సయ్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శులు ఓదెలు, సయ్యద్ హమీద్ అలీ, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పంజాల శ్రీనివాస్ గౌడ్, బోనాల శ్రీనివాస్, ఖాజా, రుద్ర రాము, మీసాల శంకర్, తపట్ల రాజు, జగ్గని కనకయ్య, రావణవేణి సంపత్, కాసవేణి భూమయ్య, మాలోతు మాలతి, శివనాధుని వెంకటేశ్వర్లు, పల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడి - విజ్ఞాన ఒడి

### అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాస్




**సికింద్రాబాద్, జులై 12 (జనం సాక్షి):** ప్రభుత్వ బడిలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా నెగ్గుతారని, అందుకే ప్రభుత్వ బడి అంటే విజ్ఞానపు వొడి వంటిదని అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం ఉపాధ్యక్షురాలు జి.అంకమ్మ అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మహీపతి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ప్రతి సబ్జెక్టులో నిష్ణాతులుగా ఉండడానికి కారణం అక్కడ ఉండే ఉపాధ్యాయులు రకరకాల టెస్టులు రాసి, ట్రైనింగ్ చేసి, మంచి ర్యాంకులు సాధించిన వారు మాత్రమే ఉంటారనీ, అలాంటి ఉపాధ్యాయుల చేత తీర్చిదిద్దిన విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో మంచి జ్ఞానాన్ని పొందగలుగుతారని తెలిపారు. నేడు ప్రైవేటు వ్యవస్థలో పోటీ పడుతున్న పరిస్థితుల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న తల్లిదండ్రులు చాలా గొప్పవారని అన్నారు. బతుకు తెరువు కోసం శ్రమిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొనే పేద, మధ్యతరగతి వర్గాలే నేడు ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారని, అలాంటి పిల్లలే ప్రభుత్వ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు గాను, నీతి నిజాయితీ కలిగిన అధికారులు గాను సమాజ సేవకు పాటుపడతారని అన్నారు. భవిష్యత్ తరాలకు, దేశాభివృద్ధికి తోడ్పడాల్సిన బాధ్యత ప్రభుత్వ బడిలో చదువుకున్న వారిపైనే ఎక్కువ ఉంటుందని దాన్ని మీరు గుర్తించి మీ భవిష్యత్తును మీరు తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్. సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల ప్రతిభను వెలికి తీయడానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా బాలోత్సవాలు జరుపుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికి తీయడానికి వివిధ అంశాలపై కథలు, కవితలు, వ్యాసాలు వంటి అనేక రచనలు పోటీలు నిర్వహించడం, మట్టి బొమ్మలు, చిత్రలేఖనం, ఏకపాత్రాభినయాలు, షార్ట్ ఫిలిమ్స్, డాన్స్, సైన్స్ టిప్స్, వంటి అనేక ప్రయోగాలు చేయిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. వచ్చే ఆగస్టు నెలలో 7, 8, 9 తరగతుల్లో ఫస్ట్ క్లాస్ పాస్ అయిన వారందరికీ ఇలాంటి ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నేడున్న వ్యవస్థలో అనేక లొసుగులు ఉన్నాయని అవినీతి, కులం, మతం, భాష, ప్రాంతం, లింగం వంటి అనేక వివక్ష లతో కూడుకున్న దుష్ట రాజకీయాలు నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య వైద్య అందుబాటులో లేకుండా పోతుందని, నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. ఇలాంటి వ్యవస్థను మార్చాల్సిన బాధ్యత నేటి విద్యార్థుల పైనే ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకార దర్శి మమత, పద్మ, రూపా రుక్మిణి, ఆఫీస్ సెక్రటరీ పి.బ్రాహ్మణి, పి.నవీన్, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**హుజురాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** హుజురాబాద్ మామిండ్ల వాడకు చెందిన ముత్తోజు భాగ్య శనివారం ఉదయం తన ఇంటి ఆవరణలో ఉన్న చేద బావిలో నీటిని తోడేందుకు బకెట్ వేయగా ఒక మనిషిని పోలి వున్న శవం కనిపించింది. ఈ విషయాన్ని కౌన్సిలర్ భర్త బండ నవీన్ కు తెలుపగా, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికులతో కలిసి బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయగా, చింత సునీతగా గుర్తించడం జరిగింది. మృతురాలు కేవలం కుర్తా (టాప్)మాత్రమే ధరించి ఉంది. మెడకు నలుపు రంగు చీర గుడ్డతో ఉరి వేసినట్లుగా ఉంది. ముఖంపై పెదాలపై గాయాలు ఉన్నాయి. ఈమె మొదటి భర్త చనిపోగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి మోతే కిరణ్ తో కలిసి సహజీవనం చేస్తూ భాగ్య నివసించే సమీపంలోనే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కిరణ్ తో సునీత ఎప్పుడు గొడవ పడుతుండేవారు. మృతురాలు సునీత భాగ్య ఇద్దరు స్నేహితులు. సునీత తరచుగా భాగ్య ఇంటికి వెళ్ళేది. సునీతను హత్య చేసి బావిలో పడేసినట్లుగా అనుమానం ఉందని బండ నవీను ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. ఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్ తో పరిశీలించడం జరిగింది. ఏసీపీ మాధవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

# అభివృద్ధికి అడ్డుగా మారిన విద్యుత్ పోల్

- నల్లవెల్లి చౌరస్తా విస్తరణకు బ్రేక్..!
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు



**యాచారం, జూలై 12(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నల్లవెల్లి చౌరస్తాలో రహదారి విస్తరణ పనులకు మధ్యలో నిలిచి ఉన్న విద్యుత్ పోల్ అడ్డంకిగా మారింది. చౌరస్తా వద్ద రోడ్డు విస్తరించినప్పటికీ, విద్యుత్ పోల్‌ను ఇప్పటికీ తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.ప్రతిరోజూ ఈ మార్గంలో భారీ లారీలు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు నిమిషాల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా, ఇప్పటివరకు పోల్‌ను తరలించే చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ పనులు పూర్తిగా ఫలించాలంటే ముందుగా విద్యుత్ పోల్‌ను తొలగించి సురక్షిత రవాణాకు మార్గం సుగమం చేయాలని ప్రజలు కోరుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ మరియు రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు

# చోకబారు మాటలు మానుకోవాలి

### టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర స్పోక్స్ వర్సన్ గౌరీ సతీష్

**మొయినాబాద్, జూలై12, జనంసాక్షి:** రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు చోకబారు మాటలు మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర స్పోక్స్ వర్సన్ గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యమే కారణం అని షాబాద్లో జరిగిన సంఘటనకు ప్రభుత్వం ఎలా బాధ్యతగా ఉంటుందని సూచించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, సబితాఇంద్రారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అనడం ఎంతవరకు సమజసం అని అన్నారు. సిరిసిల్ల జిల్లా నెరళ్ల గ్రామంలో జరిగిన దమనఖాండను రైతుల వట్ల దళితుల వట్ల గానీ అక్కడ ఉన్న సామాజిక వర్గం వట్ల గానీ దమనఖాండను మరచిపోయి మాట్లాడడం ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు. షాబాద్ మండలంలో జరిగిన ఫోక్సో కేసునిందితుడు రాజ్కుమార్ ఉన్మాదిగా మారి మరణహోమం సృష్టించారన్నారు. ఇందుకు ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లి చేతులు దులువుకోవడం మానుకోవాలని ఆయన అన్నారు. షాబాద్లో జరిగిన సంఘటన అందరికి బాధకరమేనని సూచించారు.

# అనంతగిరి హిల్స్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన మహిళ మృతి

## సంఘటనలు జరుగుతున్న జాగ్రత్తలు తీసుకొని అధికారులు

- శని ఆదివారాల్లో అనంతగిరికి పర్యాటకుల తాకిడి
- జాడ లేని మౌలిక సదుపాయాలు
- ఎమర్జెన్సీ సదుపాయం కరువు






**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 12 (జనం సాక్షి):** ప్రకృతి అందాలను తిలకిస్తూ కాలక్షేపం చేయడానికి వచ్చిన పర్యాటకుల కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటుంది. అధికారు ల తప్పిదం వలన ఇప్పటివరకు అనేక సంఘటనలు చోటు చేసుకు న్నాయి. తాజాగా ప్రకృతి ఒడిలో సేద తీర్చుకోవడానికి నగరానికి చెందిన ఒక కుటుంబంలో విషాదం నెలకొంది. అనంతగిరి హిల్స్ లో ట్రెక్కింగ్ కు వెళ్లిన ప్రియ (47) అనే మహిళ మృతి చెందింది. ఆదివారం నాడు అనంతగిరి హిల్స్ లో ఈ సంఘటన చోటు చేసుకుంది. నగరానికి చెందిన ఒక కుటుంబం అనంతగిరి హిల్స్ అందాలు చూడడానికి వచ్చారు. అర్బన్ పార్క్ నుంచి పాయింట్ వాచ్ టవర్ వరకు వెళుతుండగా మార్గమధ్యంలో కుప్పకూలి మృతి చెందింది. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అమలుకున్నాయి. తీవ్ర అస్వస్థకు గురైన మహిళను బతికించడానికి హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయమై ఆమె కుటుంబ సభ్యులు వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పర్యాటకుల సురక్షితం ఎక్కడ..?**


వికారాబాద్ అనంతగిరి పర్యటన కోసం వచ్చి ఇప్పటివరకు అనేక మంది పర్యాటకులు మృతి చెందారు. ప్రధానంగా మూడు సంఘటనలు సంచలనంగా మారాయి. సర్పన్ పల్లి ప్రాజెక్టులో పడవ బోల్తా పడి పర్యాటకులు మృతి చెందిన సంఘటన ఒకటి ఒక రిసార్ట్స్ లో మరో సంఘటన చోటు చేసుకుంది. ఇప్పుడు అనంతగిరి హిల్స్ లో మరో సంఘటన జరిగింది. ఈ సంఘటనల్లో పర్యాటకులు మృతి చెందారు. సంఘటన జరిగినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చేసే దిశగా అడుగులు వేయలేదు. రిసార్ట్స్ తోపాటు అనంతగిరి హిల్స్ లో పర్యాటకుల భద్రత తగినంత దృష్టిని అధికారులు పెట్టలేదు. శని ఆదివారాల్లో అనంతగిరి అందాలు తిలకించడానికి తండోపతండాలుగా పర్యాటకులు ఈ ప్రాంతానికి చేరుకుంటారు. వారి భద్రత కోసం ప్రధాన కూడలిల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. అటవీశాఖ అధికారులు నామమాత్రం ఫీజు వసూలు చేయడమే వారి వంతు అయింది. అందులో చిన్న పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు అటవీ ప్రాంతం గుండా పర్యటించుకుంటూ అడవి అందాలను ఆస్వాదిస్తారు. అయితే దట్టమైన అడవి గుండా పర్యాటకులు వెళ్ళినప్పుడు ప్రమాదం జరిగితే ఎమర్జెన్సీగా ప్రాథమిక చికిత్స అందించడా నికి వసతులు కల్పించిన దాఖ లాలు లేవు. ఉదాహరణకు అడవి ప్రాంతంలో విష సర్పా లు అలాగే ఏదైనా అనారోగ్యం చేత అస్వస్థ గురి అయితే ప్రాథమిక చికిత్స అందించ డానికి ఇక్కడ ఒక అంబులెన్స్ గానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెంటర్ కానీ లేదు.

అంతేకాకుండా పర్యాటకులకు తోడు పర్యటన కోసం వచ్చిన పోకిరిలా సంఖ్య కూడా భారీగానే ఉంటుంది. కుటుంబ సమేతంగా కాలక్షేపం చేయడానికి వచ్చిన పర్యాటకులకు పోకిరిల బెడద తప్పడం లేదు. అడవి అందాలను ఆస్వాదించడానికి వస్తే పోకిరిలా చేష్టల వలన పర్యాటకుల కుటుంబాలు మానసిక వేధింపులకు గురి అవుతున్నారు. ఈ విషయం జగమెరిగిన సత్యమైన పర్యాటకులు ఎవరు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడంతో పోకిరిలా ఆట ఆడిందే పాటగా సాగుతుంది. అంతేకాకుండా అనంతగిరి హిల్స్ చుట్టూ అనేక రిసార్ట్స్ ఉన్నాయి. వాటిపై అధికారుల ఆజ్యమహిషి లేదు. నగరాల నుంచి వచ్చిన పర్యాటకులు మైనర్ల నుంచి యుక్త వయస్సు వరకు ఉన్న పర్యాటకులు ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నా రో అధికారులు గుర్తించలేకపోతున్నారు. అనంతగిరి అడివిలో నిత్యం కొన్ని ప్రాంతాలు జూలాయిల అడ్డలుగా మారాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని మరో ప్రాణ నష్టం మరో సంఘటన జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### హిమాయత్ నగర్ గ్రామస్తులకు

# న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాను

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్, జూలై 12 జనం సాక్షి :** గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నా చేతుల మీదుగా పట్టాలు ఇవ్వడం జరిగిందని.. ప్రస్తుతం ప్రభుత్వం వాటికి సంబంధించి స్థలాలకు పొజిషన్ ఇవ్వడం లేదు వారికి న్యాయం జరిగేంతవరకు నేను అండగా ఉంటానని మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్ నగర్ గ్రామస్తులకు ఆమె ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల ఇలా స్థలాల పట్టాలను అందజేసిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వారి నుంచి ఆ స్థలాలను స్వాధీనం పర్చుకోవడం సరైన పద్ధతి కాదని ఆమె పేర్కొన్నారు. పేదలకు ఇచ్చిన స్థలాలను తిరిగి లాక్కోవడం సరికాదని వారికి అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని సబితా ఇంద్రరెడ్డి చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో చాలామందికి వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయని ముందుగా వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు ఇక్కడి హిమాయత్ నగర్ 60గజాల స్థలాలకు సంబంధించిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని.. ఒకవేళ కానీ యెడల రెండేళ్లలో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని అప్పుడు మీకు తగిన న్యాయం చేస్తామని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ కరోళ్ల శ్రీధర్, రాష్ట్ర నాయకులు దేశమల్ల ఆంజనేయులు, కొంపల్లి అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, దప్పు రాజు, ముదిగొండ రవి యాదవ్, చిడిగిద్ది కృష్ణారెడ్డి, మాల ఎల్లేష్, మైనార్టీ సంఘం నాయకుడు సలీం ఖాన్, పాటి ప్రసాద్ రెడ్డి, జల్లెల మల్లేష్ యాదవ్, వడ్ల కాళిదాస్ చారి, పరమేష్, మోత్కుపల్లి సునీల్, హిమాయత్ నగర్ ఆయా యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను, కరీం గోపాల్ నాయక్, హిమాయత్ నగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గోధుమలను అక్రమంగా విక్రయిస్తున్న రేషన్ డీలర్ అరెస్ట్

**హయత్ నగర్, జూలై 12 (జనం సాక్షి) :** బి.ఎన్. రెడ్డి నగర్‌లో ప్రభుత్వ రేషన్ షాప్‌కు ఆనుకుని ఉన్న గదిలో ప్రభుత్వం పంపిణీ చేసిన గోధుమలతో పాటు బయట నుంచి తెచ్చిన గోధుమలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న రేషన్ డీలర్‌ను వనస్థలిపురం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం సుమారు 1:20 గంటలకు దాడి నిర్వహించగా, రేషన్ డీలర్ రవుల శ్రీనివాస్ (54) కస్టమర్లకు గోధుమలు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన గోధుమలతో పాటు ప్రభుత్వం పంపిణీ చేసిన గోధుమలను కూడా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన స్థలంలో ఉన్న 22 గోధుమల సంచులు (సుమారు 11 క్వింటాళ్లు)ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వనస్థలిపురం ఎస్ హెచ్ ఓ రవిబాబు తెలిపారు.

# ఈ నెల 16న తాండూర్ కు మంత్రుల రాక

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు (జనంసాక్షి) :** తాండూర్ నియోజకవర్గంలో గల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ పట్టణానికి ఈ నెల 16వ తేదీన రోడ్డు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు తాండూర్ నియోజకవర్గంలో మంజూరైన దాదాపు రూ.290 కోట్ల హ్యామ్ రోడ్లు 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' రహదారుల నిర్మాణానికి తాండూర్ పట్టణానికి సమీపంలో అంతారం గ్రామ పరిధిలో గౌరవ మంత్రులు ఉదయం 10:45 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు అనంతరం ఉదయం 11:00 గంటలకు కందెనేల్లి సమీపంలో జిపిఆర్ గార్డెన్స్ లో ఏర్పటు చేసే సభలో బైపాస్ రోడ్ లో భూములు కోల్పోయిన భూనిర్వసితులకు దాదాపు రూ.25 కోట్ల చెక్కులను బాధితులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గల చైర్మన్ లు,పార్టీ అధ్యక్షులు సర్పంచ్లులు,గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మహిళలు ఉచిత ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్స్ వరంగల్



**హుజురాబాద్, జూలై 12 (జనం సాక్షి ) :** మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యానికి పునాది, ఈ లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్స్, వరంగల్ ఆధ్వర్యంలో జూలై 13, 14, 15 తేదీలలో మూడు రోజుల పాటు ఉచిత ప్రత్యేక మహిళా గైనకాలజీ ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ ప్రసూతి ఒ స్త్రీ వ్యాధుల నిపుణురాలు డా. రమ్య దాస్యం పాల్గొని మహిళలకు సమగ్ర వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా పీసీఓడీ, పీరియడ్స్ సమస్యలు, సంతానలేమి, వైట్ డిశ్చార్జ్, ఫైబ్రాయిడ్స్, గర్భాశయ సంబంధిత వ్యాధులు, మెనోపాజ్ సమస్యలు వంటి మహిళల్లో తరచుగా కనిపించే అనారోగ్య సమస్యలకు నిపుణుల సలహాలు, అవసరమైన చికిత్సలు అందించబడతాయని, అలాగే శిబిరానికి హాజరయ్యే మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్ష, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్ష, అవసరమైతే వైద్యుల సూచన మేరకు అల్ట్రాసౌండ్ పెల్విస్ స్కాన్ ఉచితంగా నిర్వహించబడుతుందని తెలిపారు. శిబిరం ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, వరంగల్‌లో నిర్వహించబడుతుందన్నారు. మహిళలు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరారు. మరిన్ని వివరాలకు సెల్ : 94598 75555 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# వరుణదేవా... కరుణించవయ్యా!

## వర్షాల కోసం కప్పలకు పెళ్లిళ్లు చేసిన గ్రామస్తులు

- ఏర్పుమళ్లలో పూర్వకాల ఆచారానికి పునరావృతం
- చినుకు కోసం రైతుల ఆకాశం వైపు ఎదురుచూపు
- వర్షాభావంతో వరి సాగుపై అయోమయం





**బొంరాస్‌పేట, జూలై 12 (జనం సాక్షి ) :** వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న "కప్ప కావడి" ఆచారం మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించారు. వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తాడనే విశ్వాసంతో గ్రామస్తులు ఆడ, మగ కప్పలకు సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామంలోని చిన్నారులను రోకలికి ఇరువైపులా నిలబెట్టి, మధ్యలో ఆడ, మగ కప్పలను వేపమండలతో కట్టి పసుపు నీటితో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామమంతా ఊరేగింపుగా తీసుకెళ్లగా మహిళలు బిందెలతో నీళ్లు పోస్తూ, "వానలు కురిపించు వరుణదేవా... కప్పతల్లి నీళ్లాడే కడవల నిండా నీళ్లు రావాలి" అంటూ జానపద గేయాలు ఆలపించారు. చివరగా కప్పలకు వివాహం జరిపి వర్షాల కోసం ప్రార్థనలు చేశారు.

ఇదిలా ఉండగా, జూలై నెలలో ఇప్పటికే 12 రోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మండల వ్యాప్తంగా రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాధారంగా సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు చినుకు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులు మాత్రం తుంపర సేద్యం ద్వారా పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. అయితే మండలంలో అధికంగా వరి సాగు చేసే రైతులు ఈసారి వరి వేయాలా, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. బోరు బావుల్లో నీటి వసతి ఉన్న కొందరు రైతులు ఇప్పటికే దుక్కి దున్ని నారుమడులు సిద్ధం చేసినప్పటికీ, సాధారణ వర్షాలు లేకపోవడంతో సాగుపై అనిశ్చితి కొనసాగుతోంది.



# బాల్యం భుజాన బడి బ్యాగ్ కాదు కల్లు సీసాల పెట్టె!

## చదువుకోవాల్సిన వయసులో బతుకు భారం మోస్తున్న చిన్నారి

- టెక్రియాల్‌లో కలిచివేసిన బాలుడి దృశ్యం
- బాల కార్మికత్వంపై మరోసారి ప్రశ్నలు
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

**చేతిలో పుస్తకాలు ఉండాల్సిన వయసు... భుజాన బడి బ్యాగ్ ఉండాల్సిన సమయం... కానీ కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టెక్రియాల్ గ్రామంలో ఓ బాలుడు కల్లు సీసాలతో నిండిన భారమైన పెట్టెను మోస్తూ కనిపించిన దృశ్యం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. బాల్యం చదువుకు, ఆటపాటలకు అంకితం కావాల్సిన సమయంలో ఉపాధి భారం మోస్తున్న ఈ చిన్నారి పరిస్థితి బాలల హక్కుల పరిరక్షణపై మరోసారి ఆందోళన వ్యక్తం చేస్తోంది.**

**కామారెడ్డి, జూలై 12 (జనంసాక్షి):** దేశంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చట్టాలు, ప్రత్యేక కార్యక్రమాలు అమల్లో ఉన్నాయని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. పాఠశాల గడప తొక్కాల్సిన బాలుడు కల్లు సీసాల పెట్టెను మోస్తూ కనిపించడం చట్టాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది కుటుంబ ఆర్థిక ఇబ్బందుల ఫలితమా, లేక బాల కార్మికత్వానికి మరో ఉదాహరణా అనే కోణంలో సంబంధిత శాఖలు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

బాలల విద్య హక్కు, రక్షణ హక్కు, దోపిడీ నుంచి స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం, చట్టాలు కల్పించినప్పటికీ, ఇలాంటి ఘటనలు ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణలో లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. గ్రామ స్థాయిలో బాలల పరిస్థితిపై నిరంతర నిఘా ఉండాల్సిన బాలల సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖలు ఎంతవరకు తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై వెంటనే బాలల సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, జిల్లా యంత్రాంగం స్పందించి బాలుడి కుటుంబ పరిస్థితులను పరిశీలించాలని, అవసరమైతే విద్య, ఆర్థిక, సామాజిక భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే బాల కార్మికత్వాన్ని ప్రోత్సహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి చిన్నారి చేతిలో పుస్తకం ఉండేలా, భుజాన బడి బ్యాగ్ ఉండేలా చూడాల్సిన బాధ్యత సమాజంపైనే కాకుండా ప్రభుత్వ యంత్రాంగంపైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# పంచాయతీ నిధులపై పంచాయితీ

- రూ.13.80 లక్షల ఖర్చులపై మిస్టరీ..!
- సర్పంచ్‌పై విచారణ కోరిన బాధితుడు
- వాస్తవాలు వెలికితీయాలని అధికారులకు గ్రామస్థుల విజ్ఞప్తి





బాధితుడు దాసరి ఆనంద్

**జగిత్యాల జిల్లా క్రైమ్, జూలై 12 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గ్రామ పంచాయతీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. గ్రామ సర్పంచ్ కనుముల వెంకటేష్ గ్రామ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం లేదని, ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన దాసరి ఆనంద్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామాభివృద్ధి పేరిట అక్రమ కమిటీలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాల సమీపంలో బెల్ట్‌షాప్ నిర్వహణకు సహకరించడం, గ్రామ నిధుల లెక్కల్లో స్పష్టత లేకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడి కథనం ప్రకారం, గతంలో గ్రామ పెద్దల సమక్షంలో తనను గ్రామ వీసీడీ (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ) చైర్మన్‌గా ఎన్నుకున్నారని, అనంతరం ఆ కమిటీ అక్రమమని చెబుతూ తన వద్ద ఉన్న రూ.1.75 లక్షలను సర్పంచ్ తీసుకున్నారని ఆరోపించారు. డబ్బులు తిరిగి కోరితే కేసులు పెడతానంటూ బెదిరించారని తెలిపారు. ఇటీవల వైన్స్ టెండర్ పేరుతో మరోసారి రూ.3.60 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని, దీనిని ప్రశ్నించడంతో తనపై కక్ష పెంచుకున్నారని పేర్కొన్నారు. అనంతరం అదే టెండర్‌ను ఇతరులకు అప్పగించి ప్రభుత్వ పాఠశాల సమీపంలో బెల్ట్‌షాప్ నిర్వహించేందుకు అవకాశం కల్పించారని ఆరోపించారు.

### ఆడిట్ నిర్వహించాలని డిమాండ్

ఈ వ్యవహారాలను ప్రశ్నించినందుకే అటవీశాఖ అధికారుల ద్వారా తన గుడిసెను తొలగించారని, అనంతరం తప్పుడు కేసు నమోదు చేయించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో రూ.13.80 లక్షల ప్రజాధనం ఖర్చులపై స్పష్టమైన లెక్కలు లేవని, ఆ నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ, ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీల్లో ప్రజాధనం వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాలని చట్టాలు పేర్కొంటున్న నేపథ్యంలో, వెంకట్రావుపేటలో వచ్చిన ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత విభాగాలు సంయుక్తంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జ్వర సర్వేపై ఆకస్మిక తనిఖీ

- సాయిరాం కాలనీలో ఇంటింటి సర్వే పరిశీలన
- డ్రై డే కార్యక్రమాల అమలుపై అధికారుల సమీక్ష
- దోమల నివారణ చర్యలు కట్టుదిట్టం చేయాలని సూచన
- జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలని విజ్ఞప్తి



**మెట్‌పల్లి, జూలై 12, (జనంసాక్షి):** సీజనల్ వ్యాధుల నియంత్ర ణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యలను డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. ఎం. జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాం కాలనీలో నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వే, డ్రై డే కార్యక్రమా లను పీవో (ఎన్‌వీబీ డీసీపీ) డా. అర్చనతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న జ్వర సర్వేను పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాల నమోదు, జ్వర లక్షణాలు ఉన్న వారి గుర్తింపు, అవసరమైన పరీక్షల కోసం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు పంపిం చడం, చికిత్స అందించే విధానంపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం డ్రై డే కార్యక్రమాల అమలును పరిశీలిస్తూ ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాలు, కూలర్లు, నీటి ట్యాంకులు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, వాడని పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు వైరల్ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వయంగా మందులు వాడకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పీవో డా. అర్చనా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు ప్రతి జ్వర కేసును సకాలంలో గుర్తించి నమోదు చేయాలని, డెంగ్యూ, మలేరియా అనుమానితులను వెంటనే పరీక్షలకు పంపించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. తనిఖీ అనంతరం అధికారులు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు పలు సూచనలు చేసి, ప్రభుత్వ ఆదేశాల మేరకు జ్వర సర్వే, డ్రై డే కార్యక్రమాలను నాణ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. వొంటెల వాణి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో మహిళ దారుణ హత్య

### శాంతినగర్‌లో విషాదం, కలకలం



**మెట్‌పల్లి, జూలై 12 (జనం సాక్షి) :** మెట్‌పల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకున్న మహిళ హత్య ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న కర్రె సుజాత (34) అనే మహిళ తన నివాసంలోనే గుర్తుతెలియని వ్యక్తుల దాడికి గురైంది. దుండగులు పదునైన ఆయుధంతో మెడపై తీవ్రంగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. అనంతరం నిందితులు ఘటన స్థలం నుంచి పరారైనట్లు తెలుస్తోంది. కొంతసేపటి తర్వాత స్థానికులు మహిళ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి వెంటనే మెట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్సై కిరణ్ కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటన స్థలంలో ఆధారాలను సేకరించి, హత్యకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ హత్యకు వ్యక్తిగత విభేదాలు, కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. నిందితులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో శాంతినగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకోగా, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలు, నిందితుల వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నాయకులకు షోకాజ్ నోటీసులు

**గంభీరావుపేట జూలై 12 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కమిటీ (పిసిసి) ఇటీవల గంభీరావుపేట కాంగ్రెస్ మండల కమిటీని అధికారికంగా ప్రకటించింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నర్మాల గ్రామానికి చెందిన నిమ్మల తిరుపతి గౌడ్ ను నియమించిన నేపథ్యంలో అధ్యక్ష ప్రకటన వెలువడిన మరుసటిరోజే మండలానికి చెందిన కొందరు నాయకులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం ప్రెస్ క్లబ్ లో సమావేశం ఏర్పాటు చేయడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినట్లు జిల్లా కాంగ్రెస్ సమితి దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ స్పందిస్తూ, ఈ చర్య పార్టీ క్రమశిక్షణ నియమావళికి విరుద్ధంగా ప్రాథమికంగా భావిస్తున్నామని పార్టీ నిర్ణయాలను బహిరంగ వ్యతిరేకించడం వల్ల కార్యకర్తల్లో అయోమయం ఏర్పడటమే కాకుండా పార్టీ ప్రతిష్టకు నష్టం కలిగే విధంగా ఉందని హెచ్చరించారు.

మండల కాంగ్రెస్ నాయకులు గుండెల్లి రాజు,ఒరగంటి నర్సింలు, ఎలుక రాజు, గంగి స్వామి, సయ్యద్ నుశ్రత్ హుల్ల హుస్సేన్ లపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో, షోకాజ్ నోటీస్ అందిన 48 గంటల్లోపు జిల్లా కాంగ్రెస్ కమిటీకి వివరణ ఇయ్యాలని సూచించారు. నిర్దేశిత గడువులో వివరణ అయ్యాక పోయిన రాజ్యాంగం ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోబడునని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు

## అప్పులు తీర్చలేక మహిళ ఆత్మహత్య



**ముస్తాబాద్, జులై 12 (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామానికి చెందిన బండి లావణ్య (38) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిగింది. ఆమె భర్త బండి రవి గత మూడు సంవత్సరాల క్రితం అప్పులు చేసి బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ పనులు సరిగా లేక జీతం రాకపోవడంతో పిల్లల చదువుల గురించి ఆయన అప్పులు చేయడంతో మొత్తం అప్పులు ఐదు లక్షల వరకు చేరాయి. అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన లావణ్య రాత్రి తన ఇంటి దూలానికి చీరతో ఉరి వేసుకొని చనిపోయిందని మృతురా లి కొడుకు బండి వికాస్ ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్ఐ జ్యోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

## అలుగునూరులో ముమ్మరంగా ఓటర్ల నమోదు

### పర్యవేక్షించిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



**తిమ్మాపూర్,జూలై 12 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు గ్రామంలోని 133, 134 పోలింగ్ బూత్‌లలో ఓటర్ల నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియ చురుగ్గా సాగుతో ంది. ఆదివారం జరిగిన ఈ నమోదు ప్రక్రియను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి బొంతల కళ్యాణ్ చంద్ర స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ.. బూత్ నంబర్ 133లో 71 శాతం, 134లో 79 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో బిఎల్‌ఓలు గౌరీ, లత కనబరుస్తున్న చొరవను,ఎన్నికల అధికారుల సమన్వయాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**ఓటు హక్కు వినియోగంపై అవగాహన:**

"ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. ప్రతి అర్హుడు బాధ్యతాయుతంగా ఓటరుగా నమోదు కావాలి. బిఎల్‌ఓలతో పాటు పౌర సమాజం కూడా సమన్వయంతో పనిచేస్తేనే వంద శాతం నమోదు సాధ్యమవుతుంది" అని కళ్యాణ్ చంద్ర పిలుపునిచ్చారు. ఇంకా ఓటు నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే,వెంటనే బిఎల్‌ఓలను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియకు సహకరిస్తున్న స్థానిక ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కొలువుల భర్తీ కోసం జూలై 15న మహాధర్నా: సీపీఎం పిలుపు



**కరీంనగర్, జూలై 12, (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 12 ఏళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖల్లో దాదాపు 10 లక్షల పోస్టులు, కేంద్ర విద్యాసంస్థల్లో సుమారు 37 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు కేవలం 16 వేల ఉద్యోగాలనే భర్తీ చేసిందని వాసుదేవరెడ్డి విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయడం లేదని, డీఎస్సీ, గ్రూప్స్, జేఎల్, డీఎల్, పోలీస్ తదితర శాఖల్లో ఖాళీలకు పూర్తి స్థాయిలో నోటిఫికేషన్లు విడుదల చేయలేదన్నారు. ప్రతి నెల రూ.5 వేల నిరుద్యోగ భృతి అందించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు అన్ని ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జూలై 15న జరిగే మహాధర్నాలో నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గిట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, జి. రాజేశం, నాయకులు రాయికంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, మాతంగి శంకర్, చల్ల లక్ష్మణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు

### నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అర్బన్, జూలై 12 (జనంసాక్షి) :** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 1వ డివిజన్ హనుమాన్ నగర్‌లో ఉన్న పెద్దమ్మ దేవాలయం వద్ద 12.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమం లో చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగుతుందని మేయర్ తెలిపారు. 26వ డివిజన్ కార్పొరేటర్, కరీంనగర్ సిటీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... పెద్దమ్మ దేవాలయానికి సిసి రోడ్డు వేయాలని కోరిన వెంటనే సాంక్షన్ చేసి శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు తమ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల పై హర్షం వ్యక్తం చేస్తూ, నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ భారీ అపర్ణ జితేందర్, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి మోటార్లను వెంటనే ఆన్ చేసి రైతులకు నీరందించాలి

- వర్షాభావం నేపథ్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్
- మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతులు చేయాలి
- రైతుల సమస్యలపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



**కరీంనగర్, జులై 12 (జనంసాక్షి):** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకోవాలంటే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని తారక్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షా భావం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థి తుల్లో కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయడమే పరిష్కారమన్నారు. ఈ అంశంపై రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం, ముఖ్యంగా రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. ఆ లేఖ రాసినందుకు రిటైర్డ్ ఇంజనీర్లు, మేధావులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. దశాబ్దాల అనుభవం ఉన్న ఇరిగేషన్ నిపుణులు రైతుల ప్రయోజనం కోసం ఇచ్చిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. గోదావరిలో ప్రస్తుతం దాదాపు 98 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని, మేడిగడ్డ వద్ద గేట్లు మూయకుండానే అక్కడి నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయవచ్చని తెలిపారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును పనికిరాదని ప్రభుత్వం ప్రచారం చేసిందని, ఇప్పుడు అదే ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోతే తమ ఆరోపణలు తప్పని తేలిపోతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు రావడం లేదని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఏడు జిల్లాల్లోని సుమారు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీని నిర్మించారని పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతులు చేయవచ్చని, ఈ విషయాన్ని అసెంబ్లీలో హరీశ్ రావు, కేటీఆర్ పలుమార్లు ప్రస్తావించారని గుర్తు చేశారు.

మేడిగడ్డ బ్యారేజీలో ఒకే ఒక పిల్లర్ మాత్రమే దెబ్బతిన్నదని, ఏడో బ్లాక్‌ను పునర్నిర్మించేందుకు రూ.300-400 కోట్లు మాత్రమే అవసరమవుతాయని చెప్పారు. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ఉచితంగా మరమ్మతులు చేయడానికి సిద్ధమని తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంతో ప్రస్తుత ముఖ్యమంత్రికి ఎలాంటి సంబంధం లేదని, కేసీఆర్ నాయకత్వంలో ఇరిగేషన్ ఇంజనీర్లు, జర్నలిస్టులు, వివిధ వర్గాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అలాంటి వారిని గౌరవించే సంస్కృతి ప్రస్తుత ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

ప్రెస్ మీట్‌లో ఒక జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా తప్పుబట్టారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, ముత్యాల బలరాం రెడ్డి, ఏలేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై హరీష్ అబద్దాల వరద

- ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోండి
- ప్రభ్యు విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్ (జనంసాక్షి) : కాళేశ్వరంపైన హరీష్ రావు అబద్దాల వరదను పారిస్తున్నారని, ఆయన పెద్ద ఇంజనీర్ లా ఆయన మాట్లాడుతున్నాడని ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నీటిని ఎత్తిపోస్తే జరిగే పరిణామాలను సీఎం చాలా స్పష్టంగా వివరించారని, బ్యారేజ్ లకు మరమ్మతులు జరిగాకే నీటిని ఎత్తిపోస్తామని, ఇక నైనా కాళేశ్వరంపైన తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆయన హితవు పలికారు. తన మెదడు అంతా రంగరించి నిర్మించానని మామ చెపితే హరీష్ రావు ఆయనకు తోడయ్యాడని, కాళేశ్వరం కూలేశ్వరం అయినా సిగ్గుపడకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం కూలిపోయిందని కుమిలిపోయి రాష్ట్ర రైతులకు క్షమాపణ చెపుతారని భావించామని, బీఆర్ఎస్ నాయకులు అసహనంలో ఉన్నారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. సీఎం కాళేశ్వరం పైన స్పష్టమైన సమాచారం ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అబద్దాలు చెప్తున్నారని, జులై 28, 2004న ఆ నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లికి శంకుస్థాపన చేశారు, 2004 , 2009 మధ్యనే బ్యారేజీ, మెయిన్ కెనాల్స్ పూర్తి అయ్యాయని, ఎల్లంపల్లి బ్యారేజ్ నిర్మాణానికి రాళ్లు తానే మోసినట్లుగా హరీష్ రావు మాట్లాడుతున్నాడని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ఎల్లంపల్లిని కూడా తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఎల్లంపల్లి తెలంగాణకు గుండె కాయ అని, మేడిగడ్డ తెలంగాణ గుండె కాయ అన్నారు కానీ, అది జారిపోయిందన్నారు. సైకోలుగా మారింది బీఆర్ఎస్ నాయకులని, కన్నెపల్లి పంప్ హౌస్ ను ఆన్ చేయాలంటే మేడిగడ్డ, అన్నారం, సుందీళ్లలో నీళ్లు ఉండాలని ఆది శ్రీనివాస్ చెప్పారు. నీళ్లను నిల్వ చేస్తే బ్యారేజీలకు ప్రమాదం అని బీఆర్ఎస్ హయాంలోనే ఎన్డీఎస్ఏ సూచించిందని, కన్నెపల్లిలో మీట నొక్కితే ఎల్లంపల్లిలో నీళ్లు ఎలా వచ్చి పడతాయి..? ఊర్లు కొట్టుకుపోయినా సరే రాజకీయాలు ముఖ్యం అన్నట్లు బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఆయన ఫైర్ అయ్యారు. రెండో సారి అధికారంలోకి వచ్చినప్పుడు హరీష్ రావుకు మంత్రి పదవే ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టాడని, సైకోలా మారి రైతులను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 41 కిలోల గంజాయి స్వాధీనం

**గుట్టుచప్పుడు కాకుండా ప్రయివేటు ట్రావెల్స్‌లో రవాణా**
**పట్టుకున్న నార్కోటిక్స్, ఈగిల్ ఫోర్స్ పోలీసులు**



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో గుట్టుగా సాగుతున్న గంజాయి రవాణాను రాచకొండ నార్కోటిక్స్ పోలీసులు, ఈగిల్ ఫోర్స్ సంయుక్తంగా రట్టు చేశాయి. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు బస్సులో తరలిస్తున్న సుమారు 41 కిలోల గంజాయిని ఆటోనగర్ సమీపంలో పట్టుకుని సిబ్బందిని అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో జులై 11న మహావీర్ హరిణ వనస్థలి జాతీయ ఉద్యానవనం వద్ద ఒడిశాకు చెందిన బాబా బోలేనాథ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆపి తనిఖీ చేశారు. రెండు బ్యాగుల్లో దాచిన రూ.20.5 లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. కమీషన్‌కు ఆశపడి బస్సు సిబ్బందే స్మగ్లర్లతో చేతులు కలిపినట్లు దర్యాప్తులో తేలింది. ఒడిశాకు చెందిన బస్సు డ్రైవర్ కోమల ఖిల్, కండక్టర్ బుబు మడకమి, హెల్పర్ లక్ష్మణ్ కురమిలను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేశారు. గంజాయి పంపిన మల్కన్‌గిరికి చెందిన సుబిన్, హైదరాబాద్‌కు చెందిన గుర్తుతెలియని రిసీవర్ కోసం రాచకొండ నార్కోటిక్స్ పోలీసులు గాలిస్తున్నారు. బస్సు సిబ్బంది మాదకద్రవ్యాలు రవాణా చేస్తూ పట్టుబడటం ఇది మూడోసారి. గతంలో మే 21న బంకేశ్వరి ట్రావెల్స్ బస్సులోనూ 21 కిలోల గంజాయి పట్టుబడింది. ప్రైవేట్ బస్సు యజమానులు తమ వాహనాలపై నిఘా ఉంచాలని పోలీసులు హెచ్చరించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే 1908 లేదా వాట్సాప్ 8712671111కు తెలపాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన పారితోషికం ఇస్తామని డ్రగ్స్ రహిత తెలంగాణ కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈగిల్ ఫోర్స్ కోరింది.

# మేడిగడ్డపై మూర్ఖత్వపు ప్రచారం

- షాబాద్ సైకోకు, రేవంత్‌రెడ్డికి తేడా ఏం లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : మేడిగడ్డపై సీఎం మూర్ఖత్వపు ప్రచారం చేస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరం ద్వారా గొప్ప అవకాశం సృష్టించారని అన్నారు. షాబాద్ సైకో ఘటనకు, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలకు తేడా లేదని అన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లను జైల్లో పెడతానని సీఎం బెదిరిస్తున్నారని.. వారు తెలంగాణవాదులుగా మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. వాస్తవాలు మాట్లాడితే బెల్ట్ ట్రీట్మెంట్ ఇస్తారా అని.. జైల్లో పెట్టిన వాళ్లు కాలగర్భంలో కలిశారని సూచించారు. సూపర్ ఎల్‌నినోతో మంచి నీళ్లకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతల రక్తాన్ని పొలాల్లో చల్లుతానని రేవంత్‌రెడ్డి అన్నారని.. కేసీఆర్ రక్తం చెమటగా మారి తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డికి తమ రక్తం కావాలంటే కేటీఆర్‌తో సహా అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహుల చేతిలో ఆయుధంగా ఉన్నారని.. ఆయనది రాక్షస మనస్తత్వమని.. ఇలాంటి వ్యాఖ్యలపై ఎలాంటి కేసులు పెట్టాలో డీజీపీ ఆలోచించాలని అన్నారు. భద్రాచలం కొట్టుకుపోతుందని అజ్ఞానపు సీఎం, మంత్రి అంటున్నారని.. దీనిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మంత్రికి ఏ మూర్ఖుడు చెప్పిండో తెలియదని.. 290 టీఎంసీల వరద వచ్చినా భద్రాచలానికి ఏం కాలేదని అన్నారు. సీఎం పదవి పిచ్చిలో పడి ఆయనకు జ్ఞాపక శక్తి తగ్గిందన్నారు. వీళ్లకు అసెంబ్లీ పెట్టే దమ్ము లేదని.. కేసీఆర్ వస్తే లాగులు తడుపుకుంటారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని.. రాష్ట్రంలో ఉన్నది హైబ్రిడ్ కాంగ్రెస్ అని పేర్కొన్నారు.


# రెండు జీవనదుల సాక్షిగా..
# నడిగడ్డ గుండె కోత!

- కృష్ణ-తుంగభద్ర మధ్యలో ఉన్నా గద్వాల రైతుకు నీటి గండం
- ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్‌పై నీలినీడలు..
- ప్రాజెక్టులు ఉన్నా పొలాలకు చేరని జలాలు



*ఒకవైపు కృష్ణా.. మరోవైపు తుంగభద్ర. రెండు జీవనదుల మధ్య విరాజిల్లే జోగులాంబ గద్వాల జిల్లా నేడు నీటి కొరతతో విలవిల్లాడుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడం, ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు తగ్గిపోవడం, సాగునీటి విడుదలపై అనిశ్చితి నెలకొనడంతో ఖరీఫ్ సాగు సంక్షోభంలో పడింది. పెట్టుబడులు పెట్టిన రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తుండగా, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది.*





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12 (జనం సాక్షి):**

భౌగోళికంగా రెండు ప్రధాన నదుల వరం లభించిన జిల్లాగా పేరొందిన జోగులాంబ గద్వాల ప్రస్తుతం తీవ్రమైన వర్షాభావాన్ని ఎదుర్కొంటోంది. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ఆలస్యమవడం, కృష్ణా-తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో తగిన వర్షపాతం లేకపోవడంతో ప్రియదర్శిని జూరాల, తుంగభద్ర జలాశయాలకు ఆశించిన మేర నీరు చేరడం లేదు. దీంతో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ సాగునీటి విడుదలపై అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి జిల్లాలో ఖరీఫ్ సాగును ప్రశ్నార్థకంగా మార్చింది. జిల్లాలో గద్వాల, అయిజ, రాజోళి, అలంపూర్ తదితర మండలాల రైతులు ఇప్పటికే అప్పులు చేసి విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. తొలకరి వర్షాల కోసం ఎదురుచూసినా ఆశించిన వర్షపాతం లేకపోవడంతో పంటల విత్తనాలు ఆలస్యమవుతున్నాయి. ముందుగా విత్తిన పత్తి మొలకలు ఎండకు మాడిపోతుండగా, వరి, మిరప, వేరుశనగ సాగు కూడా అనిశ్చితిలో పడింది. భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోవడంతో బోర్లు ఎండిపోతున్నాయి. విద్యుత్ సరఫరా సమస్యలు రైతుల ఇబ్బందులను మరింత పెంచుతున్నాయి.

### ప్రాజెక్టులు ఉన్నా.. రైతుకు అందని నీరు

జూరాల, తుంగభద్ర వంటి ప్రధాన జలవనరులు జిల్లాకు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటి ప్రయోజనం పూర్తిస్థాయిలో రైతులకు చేరడం లేదు. ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో భారీ వర్షాలు కురిస్తేనే జూరాలకు వరదలు వచ్చే పరిస్థితి ఉంది. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక పెరగడం వల్ల నిల్వ సామర్థ్యం తగ్గిపోగా, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) చివరి ఆయకట్టుకు నీరు చేరడం లేదు. నెట్టెంపాడు, భీమా వంటి ఎత్తిపోతల పథకాలు ఉన్నా కాలువల నిర్వహణ లోపాలు, మోటార్ల మరమ్మతుల్లో జాప్యం కారణంగా నీరు సకాలంలో పొలాలకు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ చర్యలపై ఆశలు

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం ప్రాజెక్టుల నీటిపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రైతులను చైతన్యపరచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ నీటితో పండే కందులు, పెసర్లు, జొన్నలు వంటి ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీపై అందించడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలి. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సాంకేతిక సూచనలు ఇవ్వాలి. అందుబాటులో ఉన్న నీటిని పారదర్శకంగా నిర్వహిస్తూ చివరి ఎకరా వరకు చేరేలా చర్యలు తీసుకోవాలి. పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరా, ఎండిపోయిన పంటల నష్టాన్ని అంచనా వేసి తక్షణ పెట్టుబడి సాయం అందించడం కూడా అత్యవసరమని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసి రైతాంగానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

# ఎనిమరేషన్ ఫారాలను అధికారులకు ఇవ్వాల్సిందే..

- నమోదు చేసుకోని వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తాం
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ



శేరిలింగంపల్లి, జూలై 12 (జనంసాక్షి) : స్పెషల్ ఇంటెన్స్ రివిజన్(సర్) ప్రక్రియను ప్రతి ఒక్కరు అత్యంత బాధ్యతంగా భావించి తమ ఓటును నమోదు చేసుకోవాల్సిందేనని, లేని పక్షంలో ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గుల్మోహర్ పార్క్, మై హోమ్ మంగళ గేటెడ్ కమ్యూనిటీ పరిధిలో కొనసాగుతున్న ఎన్నిమరేషన్ ఫారాల నమోదు కార్యక్రమాన్ని, డిజిటలైజేషన్ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తోకలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమం ఈనెల 24 వరకు కొనసాగు ఉందని, చాలా కీలకమైన సమయంలో దీనిని నిర్వహిస్తున్నందున 18 సంవత్సరాలు నిండిన వారి నుండి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిందేనని తెలియజేశారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఈఆర్ఓ, జోన్ ఈఆర్ఓలు, ఎన్నికల నమోదు అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్షను నిర్వహించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పాటు సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటిలోని అర్హులైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారమ్ అందించాల్సిందేనని, వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాల్సిందేనని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియ అనుకున్న సమయానికల్లా పూర్తి కావాలని, ఆ దిశగా అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగాలని సిఈఓ సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని మరేసన్ ఫారాలను సమర్పించని వారిని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల జాబితా నుండి తొలగిస్తామని, భవిష్యత్తులో వారు చాలా ఇబ్బందులను చవిచూడాల్సి వస్తుందన్నారు. భారత జాతీయ పౌరులై ఉండి అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎన్నికల నమోదు కార్యక్రమంలో తమ వివరాలను కలిగి ఉండాలన్నదే సర్ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అన్నారు. వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి రాజీ, అలసత్వం ఉండకూడదని, పూర్తి పారదర్శకతతో పాటు ఆన్లైన్ విధానంలో డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని సైతం నిర్దిష్టంగా పూర్తి చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలు జూన్ చివరి వారంలో ప్రారంభించి జూలై 24 వరకు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరు బూత్ లెవల్ అధికారులద్వారా ఎన్ని మరేషన్ ఫారాలను పొంది ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా ప్రతి ఇంటిని సందర్శించాలని, గడువు దాటిన పిదప ఆయా ప్రాంతాలలో ఎలాంటి ఫిర్యాదులు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి అధికారులు తప్పనిసరిగా ఎన్నిమరేషన్ ఫారాల ప్రక్రియను పారదర్శకతతో పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వం తద్వారా భారత ప్రభుత్వానికి వివరాలను నిర్దిష్టంగా అందించాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపారు.

# వ్యక్తిని కత్తితో పొడిచి చంపిన బాలురు

న్యూఢిల్లీ (జనంసాక్షి) : నడుస్తున్న వ్యక్తి బురద చిందించడంపై ఐదుగురు బాలురు ఘర్షణకు దిగారు. ఆ వ్యక్తిని కత్తితో పొడిచి చంపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితులైన బాలురను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. జూలై 9న అశోక్ విహార్ ప్రాంతంలో ఒక వ్యక్తి కత్తి గాయాలతో పడి ఉన్నట్లు పోలీసుల కు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. కత్తి గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించి నట్లు డాక్టర్లు నిర్ధారించారు.కాగా, ఉధమ్ సింగ్ పార్క్ ప్రాంతంలో నివసించే 34 ఏళ్ల బన్సీ లాల్‌గా మృతుడిని పోలీసులు గుర్తించారు. లాలా లజపత్ రాయ్ మార్కెట్‌లోని ఒక సీసీటీవీ షాపులో అతడు పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. బన్సీ లాల్ హత్యపై దర్యాప్తు చేశారు. కాలువ సమీపంలోని బురద ప్రదేశంలో అతడు నడుస్తుండగా కొందరు బాలురపై పొరపాటున బురద పడంతో వారి మధ్య ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు.

# ఐలయ్యకు మంత్రి పదవి వస్తుంది

**రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



ఆలేరు (జనంసాక్షి) : ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి వచ్చేలా తాను కృషి చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వంగపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గతంలో ఆలేరు, భువనగిరి నియోజకవర్గ ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో ఎంపీగా గెలిపించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనను ఈ ప్రాంత ప్రజలు భవిష్యత్‌లో మంత్రిగా చూడాలని అన్నారు. ఐలయ్యకు మంత్రి పదవి వచ్చేలా తాను పోరాడుతానని స్పష్టం చేశారు. గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వద్ద వంగపల్లి అండర్‌పాస్ నిర్మాణం కోసం ఒత్తిడి తెచ్చామని, ప్రస్తుతం ఆ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రాన్ని మండల కేంద్రాలతో అనుసంధానించేలా డబుల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇరుకైన రహదారుల కారణంగా ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా ఆలేరు ప్రాంతానికి రెండు కాలువలు కూడా తీసుకురాలేదని విమర్శించారు. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్‌లో నీరు ఉన్నప్పటికీ ఆలేరు రైతులకు అందించలేదన్నారు. ప్రస్తుతం బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని, గంధమల్ల ప్రాజెక్టుతో ఆలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. యాదగిరిగుట్టకు పలుమార్లు వచ్చినా కొండపైకే పరిమితమై, కొండ కింద అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తగా ఏర్పడిన మోటకొండూరు మండలాన్ని కూడా నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికుంట్ల సత్యం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ సరిత, యాదగిరిగుట్ట తహశీల్దార్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370